PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 176 | విజయవాడ, బుధవారం 31 జనవరి 2024 | 8+8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, wednesday 31 January 2024 | Rs

కేరళలో అంగన్‌వాడీలకు వేతనాలు పెంపు

- పదేళ్లు సర్వీసున్నవారికి రూ.వెయ్యి
- మిగిలిన అందరికీ రూ.500 చొప్పున పెంపుదల
- డిసెంబర్ 2023 నుంచే అమల్లోకి
- 60 వేల సిబ్బందికి లబ్ధి

7

ప్రయివేటు టెల్కోల వసూళ్ల ఎత్తుగడ..!

- 2జి, 3జి సేవల నిలిపివేతకు ప్రతిపాదనలు
- ట్రాయ్‌తో సంప్రదింపులు
- 4జి, 5జితో రెవెన్యూ పెంచుకునే ప్రయత్నం
- బిఎస్‌ఎన్‌ఎల్‌ను దెబ్బగొట్టే కుట్ర
- 25 కోట్ల పైగా మందిపై భారం

3

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం రాష్ట్రపతి ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమవుతాయి. గురువారం మధ్యంతర బడ్జెట్‌ను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. మొదటి రెండు రోజుల తరువాత, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సమాధానంపై ఉభయ సభల్లో చర్చలు ప్రారంభమవుతాయి. ఆ తరువాత బడ్జెట్‌పై చర్చలు జరుగుతాయి. ఇది ఓట్ ఆన్ అకౌంట్ అవుతుంది. ఫిబ్రవరి 9న ఈ సెషన్ ముగుస్తుంది.

ఎంపిల సస్పెన్షన్ ఎత్తివేత

ప్రివిలేజ్ కమిటీకి సూచించిన 14 మంది ప్రతిపక్ష ఎంపిల సస్పెన్షన్‌ను ఎత్తివేసినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. అఖిలపక్ష సమావేశ అనంతరం మీడియాతో ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. ప్రతిపక్షాల ఎంపిల సస్పెన్షన్‌ను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష సభ్యులందరి సస్పెన్షన్‌లను ఉపసంహరించుకోవాలని కోరుతూ.. లోక్‌సభ, రాజ్యసభకు చెందిన ప్రివిలేజెస్ కమిటీలతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపిందని చెప్పారు. నిర్మాణాత్మక చర్చలకు అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే ఎంపిల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని కోరామని చెప్పారు. బడ్జెట్ సెషన్ సమర్థవంతంగా సాగడంలో పార్లమెంటు సభ్యుల మధ్య చర్చలు, సహకారం ప్రధానమని తెలిపారు.

కేంద్ర ఏజెన్సీల దాడి ఆపాలి

- అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల డిమాండ్

లోపలి పేజీలో..

మోడీని గద్దె దించడమే లక్ష్యం

- హద్దుల్లేని ఇడి దుర్వినియోగం
- సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సమావేశం అనంతరం మీడియాతో ఏచూరి



తిరువనంతపురంలోని ఇఎంఎస్ అకాడమీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి, వేదికపై ఎంఎ బేబీ, ఎంవి గోవిందన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిపిఐ(ఎం) శాయశక్తులా పోరాడుతుందని పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. తిరువనంతపురంలోని ఇఎంఎస్ అకాడమీలో మూడు రోజుల పాటు జరిగిన సిపిఎం కేంద్ర కమిటీ సమావేశం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 2024 లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధతపై కేంద్రకమిటీ చర్చించిందన్నారు., అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవ తీరు రాజ్యాంగాన్ని ఉల్లంఘించేందుకు బిజెపి ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ఉందనే విషయాన్ని వెల్లడించిందన్నారు. బిజెపిని గద్దె దించేందుకు రాష్ట్రాల వారీగా పొత్తులు, సర్దుబాట్లు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. "ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పరిస్థితి ఉంది. కేరళలో ఎల్‌డిఎఫ్, కాంగ్రెస్ మధ్య ప్రత్యక్ష పోరు. ఇక్కడ బిజెపికి సీట్లు రావు. అదే తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని సెక్యులర్ ఫ్రంట్. బీహార్‌లో నితీష్ కుమార్ పార్టీ మినహా మహాకూటమి ఉంది. 'ఇండియా' వేదికకు చాలా రాష్ట్రాల్లో ఉమ్మడి అభ్యర్థులు ఉన్నారు. కేరళ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఇది సాధ్యం కాదు. ఎన్నికల రాజకీయాల్లో రెండు, రెండు కలిపితే నాలుగు కాదు. బీహార్‌లో ప్రస్తుత పరిణామాలకు నితీష్ కుమారే కారణమని అన్నారు. ఇడి, సిబిఐని బిజెపి, కేంద్ర ప్రభుత్వం రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయి. ఇడి కేసు పెట్టిన వారు బిజెపిలో చేరితే కేసు క్లోజ్ అయ్యే పరిస్థితి ఉంది. 2019 తరువాత ఇడి 5,500 కంటే ఎక్కువ కేసులను నమోదు చేసింది. 23 శాతం కేసులు మాత్రమే కోర్టుకు చేరాయి. ప్రత్యర్థులను భయపెట్టడానికి, వేధించడానికి ఇడి ఉపయోగించబడుతుంది. కేరళను కష్టాల్లోకి నెట్టిన బిజెపికి సాయం చేయడమే కాంగ్రెస్ వైఖరి" అని ఏచూరి విమర్శించారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం) సిస్టమ్‌లోని యంత్రాల క్రమాన్ని రీ సీక్వెన్సింగ్ చేయాలని ఆయన అన్నారు.. ఇవిఎం వ్యవస్థలో బ్యాలెట్ యూనిట్ (బియు), కంట్రోల్ యూనిట్ (సియు), ఇటీవల జోడించిన ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివి ప్యాట్) ఉన్నాయి. ఇవిఎంల పనితీరుపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని సిపిఎం గుర్తించింది. పోలింగ్ బూత్‌లో ఈ మెషీన్ల ప్లేస్‌మెంట్ సీక్వెన్స్‌లో మార్పును ప్రతిపాదించాం" అని ఏచూరి తెలిపారు. "ప్రస్తుతం, ఈ ప్రక్రియలో యూనిట్‌లో ఓటింగ్ ఉంటుంది. ఇది కంట్రోల్ యూనిట్‌కి బదిలీ చేయబడే ముందు ధ్రువీకరణ కోసం వివిప్యాట్‌కి పంపిస్తుంది. మేము ఓటరు యూనిట్ నుండి వివి ప్యాట్‌కి ప్రసారాన్ని ట్రాక్ చేయగలిగినప్పటికీ, వివిప్యాట్ నుండి కంట్రోల్ యూనిట్‌కు ఏమి ప్రసారం చేయబడుతుందనే దానిపై అనిశ్చితి ఉంది. కాబట్టి, మేము క్రమంలో మార్పును సూచిస్తున్నాము. ఓటర్ యూనిట్, తరువాత కంట్రోల్ యూనిట్, ఆ తరువాత వివి ప్యాట్. ఈ విధంగా, ఓటర్లు తమ ఓటు కచ్చితంగా కంట్రోల్ యూనిట్‌లో నమోదైందని ధ్రువీకరించుకోవచ్చు" అని ఆయన అన్నారు. 50 శాతం వివి ప్యాట్‌లను ఓటింగ్ మెషీన్‌లో ప్రదర్శించే సమాచారంతో క్రాస్ చెక్ చేసుకోవాల్సిన అవసరాన్ని ఏచూరి నొక్కిచెప్పారు. "ఈ విధానం ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉంటుంది. అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సమానమైన అవకాశాన్ని అందించేలా, ప్రజలలో విశ్వాసాన్ని నింపడం లక్ష్యంగా పెట్టుకోవాలి" అని ఏచూరి తెలిపారు.

ఈ విలేకరుల సమావేశంలో ఏచూరితోబాటు పార్టీ కేరళ రాష్ట్ర కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంవి గోవిందన్ మాస్టార్, పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి కూడా పాల్గొన్నారు .

నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి వాటిపై పోరు ఉధృతం

- సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు

లోపలి పేజీలో..

ఇంధన రంగంలో రూ.22 వేల కోట్ల పెట్టుబడులు

పలు ప్రాజెక్టులకు ఎస్‌ఐపిబి ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇంధన రంగంలో రూ.22,302 కోట్ల పెట్టుబడులకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్‌ఐపిబి) ఆమోదం తెలిపింది. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిఎం అధ్యక్షతన ఎస్‌ఐపిబి సమావేశం మంగళవారం జరిగింది. దీనికి సిఎస్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పెట్టుబడుల సమ్మిట్లో చేసుకున్న ఒప్పందాలు కార్యారూపం దాలుస్తున్నాయని, ముఖ్యంగా సాంప్రదాయేతర ఇంధన వనరుల విభాగంలో ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. రూ.22,302 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ముందుకు రావడం అభినందనీయమని, దీనివల్ల 5,300 మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని పేర్కొన్నారు. అనంతరం పలు ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటిల్లో జెఎస్‌డబ్ల్యు నియో ఎనర్జీ లిమిటెడ్ 3,350 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. వైఎస్‌ఆర్ జిల్లా చక్రాయిపేట వద్ద 400 మెగావాట్లు, సత్యసాయి జిల్లా ముదిగుబ్బ వద్ద 1,050, అనంతపురం జిల్లా కనగానపల్లె, రాప్తాడులో 1,050, డి హీరేహాళ్, బొమ్మనహాళ్‌లో 850 మెగావాట్లతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు రూపంలో రూ.12,065 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. దీనివల్ల 3,300 మందికి ఉపాధి లభించనుంది. దీంతోపాటు నంద్యాల జిల్లా అవుకు మండలం కునుకుండ్ల, కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం జలదుర్గం వద్ద రూ.1,287 కోట్లతో 171 మెగావాట్ల రెండు విండ్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నారు. సత్యసాయి జిల్లా తలుపుల మండలం పులిగుండ్ల పల్లెలో ఆగ్రీన్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ 1000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును ఏర్పాటు ఏర్పాటు చేయనుంది. దీనికోసం రూ.4,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. కర్నూలు జిలా ఆస్పరి వద్ద ఎక్రోన్ ఎనర్జీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ రూ.1,350 కోట్లతో 200 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. వీటితోపాటు రెన్యూ విక్రం శక్తి ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో 600 మెగావాట్ల ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. దీనికోసం రూ.3,600 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. వీటన్నిటికీ ఎస్‌ఐపిబి ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుడివాడ అమర్‌నాథ్, సిఎస్ జవహర్‌రెడ్డి, ఎస్‌సిఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మహాత్మ గాంధీ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సిఎం జగన్, మంత్రి అమర్‌నాథ్

తేజస్వి యాదవ్ విచారణ

8 గంటలపాటు ప్రశ్నించిన ఇడి



పాట్నా : ఆర్‌జెడి నాయకులు, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు మంగళవారం దాదాపు 8 గంటల పాటు విచారించారు. పాట్నాలోని ఇడి కార్యాలయానికి మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో తేజస్వి యాదవ్ చేరుకున్నారు. తేజస్వి యాదవ్‌కు మద్దతుగా ఆర్‌జెడికు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అక్కడకు భారీ సంఖ్యలో చేరుకున్నారు. తేజస్వికి అనుకూలంగా నినాదాలు చేశారు. తేజస్విని రాత్రి 8:00 గంటల వరకూ అధికారులు విచారించారు. విచారణ సమయంలో అధికారులు 60కు పైగా ప్రశ్నలను సంధించినట్లు సమాచారం.

ఈ నెల 28న మహా కూటమి ప్రభుత్వం నుంచి నితీష్ వైదొలిగి బిజెపి పంచన చేరారు. ఆ తరువాత రోజు నుంచి ఆర్‌జెడి నేతలపై ఇడి విచారణ ప్రారంభమైంది. ల్యాండ్ ఫర్ జాబ్స్ స్కామ్ కేసుకు సంబంధించి ఆర్‌జెడి అధినేత, తేజస్వి యాదవ్ తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఇడి సోమవారం సుమారు 10 గంటలపాటు విచారణ జరిగింది. ఈ నెల 19న తేజస్వి యాదవ్, లాలూ ప్రసాద్‌లకు కొత్తగా ఇడి సమన్లు జారీ చేసింది. సిబిఐ నమోదు చేసిన కేసు ఆధారంగా ఇడి విచారణ చేస్తోంది. లాలూ ప్రసాద్ రైల్వే శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 2004 నుంచి 2009 మధ్య కాలంలో కొంత మంది అభ్యర్థుల నుంచి తన కుటుంబ సభ్యుల పేరు మీద భూమి తీసుకుని వారికి రైల్వేల్లో, వివిధ జోన్లలో ఉద్యోగాలు కల్పించారని సిబిఐ తన ఎఫ్ఐఆర్‌లో ఆరోపించింది.

రాజ్యసభ సభ్యులు మనోజ్ ఝా యాదవ్ మాట్లాడుతూ 'ఇది ఇడి కార్యాలయం కాదు. తేజస్వి యాదవ్ వచ్చిన బిజెపి కార్యాలయం. ఎన్నికలు వచ్చినప్పుడు ప్రతిపక్ష నాయకులను ఇక్కడికి పిలిపిస్తారు' అని విమర్శించారు. ఆర్‌జెడి నాయకుల ఆందోళన నేపథ్యంలో ఇడి కార్యాలయం వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు.

పార్లమెంట్‌లో నిలదీయండి

ఎంపిలకు ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన సమితి పిలుపు • రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఫిబ్రవరి మొదటి వారంలో జరుగనున్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎంపిలకు పలువురు సూచించారు. విజయవాడ లెనిన్ సెంటర్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనా సమితి ఆధ్వర్యంలో "ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కుల కోసం- ఆత్మగౌరవ దీక్ష" లను మంగళవారం నిర్వహించారు. ఈ దీక్షల్లో ప్రసంగించిన పలువురు ఎంపిలు కేంద్ర ప్రభుత్వాని నిలదీసి హామీల అమలు కోసం పోరాటం కొనసాగించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఫిబ్రవరి 7,8 తేదీల్లో ఢిల్లీలో ప్రత్యేక హోదా సాధనా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాలకు ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.విజయవాడలో సిపిఐ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, వి.శ్రీనివాసరావులు మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాత్మాగాంధీని హత్య చేసి, దేశాన్ని విచ్ఛిన్నం చేసిన ఆ శక్తులే నేడు కేంద్రంలో అధికారం లో ఉన్నారన్నారు. హోదా పట్ల మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు నిరసనగా దీక్షలు చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలోనైనా భయ పడకుండా అన్ని రాజకీయ పార్టీలు హోదాకోసం ముందుకు రావాలన్నారు. 2019 ఎన్నికలకు ముందు వైసిపి, టిడిపి, జనసేన హోదాపై కోతలు మిగతా 7లో



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, వేదికపై చలసాని, రామకృష్ణ, తదితరులు

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దాడి

- ముగ్గురు జవాన్లు మృతి

సుక్మా : ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా-బిజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టుల దాడిలో ముగ్గురు జవాన్లు చనిపోయారు. మరో 14 మంది గాయపడ్డారు. టేకులగూడెం అడవుల వద్ద భద్రతా సిబ్బంది తనిఖీలు చేస్తుండగా మావోయిస్టులు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారని బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ మీడియాకు తెలిపారు. టేకులగూడెంలో సోమవారమే సిఆర్‌పిఎఫ్ సిబ్బంది కొత్తగా ఒక శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన చెప్పారు. మంగళవారం సిఆర్‌పిఎఫ్, సిఆర్‌పిఎఫ్‌కు చెందిన కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్), స్పెషల్ టాస్క్ ఫోర్స్, జిల్లా రిజర్వ్ గార్డ్‌కు సంబంధించిన సిబ్బంది సంయుక్తంగా జోనగూడ-అలిగూడా గ్రామాల్లో తనిఖీలు చేస్తుండగా మావోయిస్టులు దాడికి పాల్పడ్డారని ఆయన వివరించారు. ఈ ఘటనలో ఇద్దరు కోబ్రా 201 బెటాలియన్‌కు, మరొకరు సిఆర్‌పిఎఫ్ 150వ బెటాలియన్‌కు చెందిన జవాన్లు మరణించారని తెలిపారు. గాయపడిన జవాన్లను ఆసుపత్రులకు తరలించినట్లు చెప్పారు. దాడి చేసిన తరువాత మావోయిస్టులు పారిపోయారని తెలిపారు. టేకులగూడెంలో 2021 ఏప్రిల్‌లో మావోయిస్టుల దాడిలో 23 మంది భద్రతా సిబ్బంది మరణించారు.

పోటెత్తిన వివోఏలు

- 36 గంటల మహాధర్నా ప్రారంభం
- మూడేళ్ల కాలపరిమితి రద్దుచేయాలి : కెఎస్ లక్ష్మణరావు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన 36 గంటల మహాధర్నాకు వివోఏలు పోటెత్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి భారీ సంఖ్యలో తరలిరావడంతో విజయదాడ ధర్నా చౌక్ కిక్కిరిసిపోయింది. సిఐటియు అనుబంధ సంఘం అయిన ఎపి వెలుగు విఓఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాను పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలను సమర్థవంతంగా పనిచేసేలా అహర్నిశలు కృషిచేస్తున్న విఓఎలకు మూడేళ్ల మిగతా 7లో



వివోఎల మహాధర్నాలో అభివాదం చేస్తున్న ఎంఎల్సీ లక్ష్మణరావు, కె.ధనలక్ష్మి, ఉమామహేశ్వరరావు, తదితరులు



హాజరైన వివోఎలు

ప్రశ్నార్థకంగా కల్లుగీత వృత్తి

- ఎక్స్‌గ్రేషియా ఎందుకు ఇవ్వడం లేదు?
- తణుకులో ఎపి కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ ప్రారంభం



ఇమ్రాన్‌ఖాన్‌కు పదేళ్ల జైలు శిక్ష


లోపలి పేజీలో..

వైసిపిలో తెగని బాలినేని పంచాయితీ

- మాగుంటకు అవకాశం ఇవ్వాల్సిందేనని పట్టు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికార వైసిపికి ప్రకాశం జిల్లా రాజకీయాలు దిక్కుతోచని పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఒంగోలు ఎంపిగా మరోమారు మాగుంట శ్రీనివాసరెడ్డికి అవకాశం ఇచ్చేది లేదని వైసిపి అధిష్టానం తేల్చిచెబుతుండగా, మాగుంటకు టికెట్ ఇవ్వకపోతే తాను పోటీ చేసేది లేదని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తేల్చి చెబుతుండంటంతో వైసిపికి ఈ చిక్కుముడిని విప్పడం సమస్యగా మారింది. ఇప్పటికే పలు దఫాలుగా అధిష్టానానికి తేల్చిచెప్పిన బాలినేని శ్రీనివాసరెడ్డి మంగళవారం కూడా అదే అంశాన్ని మరోసారి చెప్పారు. బాలినేనితో సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి ఓ హోటల్లో జరిపిన చర్చల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. మధ్యే మార్గంగా బాలినేని కుమారుడు ప్రణీత్ రెడ్డికి ఒంగోలు ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని ప్రతిపాదించినా తిరస్కరించినట్లు సమాచారం. ఎంపి టికెట్ మాత్రం మాగుంటకు ఇచ్చే ప్రసక్తే లేదని, చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఇస్తామనే ప్రతిపాదనను బాలినేని తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిసింది. మాగుంటకు టికెట్ ఇచ్చే పరిస్థితి లేకపోతే కుమారుడు రాఘవరెడ్డికి ఇవ్వాలని బాలినేని ప్రతిపాదనను వైసిపి అధిష్టానం తిరస్కరించినట్లు తెలిసింది. అలాగే పలువురు సిట్టింగులు మంగళవారం కూడా తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి వచ్చి వైసిపి పెద్దలను కలిసి వెళ్లారు. తాడేపల్లికి వచ్చిన వారిలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, మంత్రి ఉషశ్రీ చరణ్, మాజీ మంత్రి కూరసాల కన్నబాబు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఆదాల ప్రభాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



బాలినేని

అసమానతలు లేని విద్యా వ్యవస్థ కోసం పోరాటం

- ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను

ప్రజాశక్తి - క్యాంపస్ (ఎస్‌వియు)

నూతన విద్యా విధానం (ఎన్‌ఇపి) వల్ల విద్యార్థుల్లో అసమానతలు పెరుగుతున్నాయని, ఉన్నత విద్యలో విద్యార్థుల చేరికలు క్రమంగా తగ్గుతున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను, రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ అన్నారు. కొంత మందికే విద్య అందే విధంగా ఎన్‌ఇపి-2020 ఉందని తెలిపారు. 'నూతన విద్యా విధానం.. నీట్ రద్దు' అంశంపై తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన మంగళవారం సెమినార్ జరిగింది. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని అమలు చేసి, విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్ర చేస్తోందని మండిపడ్డారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వకుండా, ప్రభుత్వ పాఠశాలలో టీచర్స్ పోస్టులు భర్తీ చేయకుండా మోసపూరిత విధానాలు అమలు చేస్తోందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు మాధవ్ కృష్ణ మాట్లాడుతూ రోజు రోజుకూ విద్య ఖరీదవుతోందని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమవుతోందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ నూతన విద్యా విధానం రద్దు చేయాలని ఢిల్లీలో జనవరి 12 న పెద్ద ఎత్తున నిరసన జరిగిందని, ఫిబ్రవరి ఒకటిన చెన్నైలో భారీ ర్యాలీ ఉంటుందని, వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. సెమినార్‌లో ఆఫీస్ బేరర్స్ అశోక్, వినోద్, హరిత, యూనివర్సిటీ అధ్యక్షులు నరేంద్ర, నాయకులు శివ, పవన్, వీరేష్, హర్షత్ తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న విపి సాను

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మరోసారి నోటీసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి నుంచి టిడిపిలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలకు స్పీకరు కార్యాలయం మంగళవారం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యేలతో పాటు ఈ దఫా పిటిషనర్, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుకు కూడా నోటీసులు జారీ చేసింది. ఫిరాయించిన ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవితో పాటు చీఫ్ విప్‌తో కలిసి ఐదుగురిని స్పీకరు ఒకేసారి విచారణ చేయనున్నారు. ఫిబ్రవరి 5లోగా నోటీసులపై స్పందించాలని, 8వ తేదీ స్వయంగా ఎమ్మెల్యేలు విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అనర్హత పిటిషన్ విషయంలో మరోసారి ఎమ్మెల్యేల వివరణ తీసుకున్నాకే నిర్ణయం తీసుకోవాలని స్పీకరు భావించారు. ఈ నేపథ్యంలోనే మరోసారి నోటీసులు పంపారు.

ఫైబర్‌నెట్ కేసులో 'సుప్రీం'కు రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఫైబర్‌నెట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ముందస్తు బెయిల్‌పై అత్యవసర విచారణను కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులపై చంద్రబాబు నాయుడు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ముందు ప్రస్తావించడం, అత్యవసర జాబితా కోసం ఒక లేఖను దాఖలు చేసింది. ఈ కేసును అత్యవసర జాబితా కోసం జనవరి 31న పేర్కొనవల సిందిగా అభ్యర్థించింది. ఈ అంశం జనవరి 17న ప్రత్యేక ధర్మాసనం ముందు రావాల్సి ఉండగా, ధర్మాసనం సమావేశమవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, న్యాయవాది అన్మోల్ ఖేటా సుప్రీంకోర్టులో దాఖలు చేసిన తన పిటిషన్‌లో చంద్రబాబు దీనిని 'రాజకీయ ప్రేరేపిత అంశం' అని పేర్కొన్నారు. ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కేసులో సహ నిందితులకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిందని పిటిషన్‌లో తెలిపారు.

టిడిపిలోకి కోనేటి ఆదిమూలం!

- సోషల్ మీడియాలో లోకేష్‌తో కలిసి ఫొటో వైరల్

ప్రజాశక్తి - పిచ్చాటూరు (తిరుపతి జిల్లా)



తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం త్వరలోనే టిడిపి కండువా కప్పుకోనున్నారని సమాచారం. రాజధాని అమరావతిలో మంగళవారం యువనేత నారా లోకేష్‌తో కలిసి ఉన్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ చర్చకు తావిచ్చింది. ఈ నేపథ్యంలో మంత్రి పెద్దిరెడ్డి అనుచరగణం కోనేటి ఆదిమూలం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జరిపిన సర్వేలో ఆదిమూలంకు ప్రతికూలంగా ఉందని చెప్పి సత్యవేడు నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా గురుమూర్తిని ప్రకటించారు. ఆదిమూలంను తిరుపతి ఎంపి అభ్యర్థిగా కుండమార్పిడి చేశారు. అయితే 'నియోజకవర్గం' వదిలి వెళ్లడం ఇష్టంలేని ఆదిమూలం స్థానికంగానే తాను ఉంటానంటూ తన అనుచరగణంతో వెల్లడించారు. అధిష్టానం ఏమాత్రం దిగిరాకపోవడంతో మంత్రి పెద్దిరెడ్డిపై విమర్శలు గుప్పించారు. దీంతో ఆదిమూలంపై మంత్రి పెద్దిరెడ్డి గుర్రుమన్నారు. ఇది జీర్ణించుకోలేని ఆదిమూలం టిడిపి తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. పిచ్చాటూరు, బిఎన్ కండ్రిగలో ఆదిమూలం దిష్టిబొమ్మను వైసిపి నేతలు దగ్ధం చేశారు.

రాష్ట్రాన్ని ఆదుకునే బాధ్యత కేంద్రానిదే

- విభజన హామీలపై ప్రధానికి షర్మిల లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014 ప్రకారం రాష్ట్రాన్ని ఆదుకునే బాధ్యత కేంద్రానిదేనని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ ప్రధాని మోడీకి మంగళవారం షర్మిల లేఖ రాశారు. విభజన సమయంలో కాంగ్రెస్ పొందుపరిచిన వాగ్దానాలను అమలు చేయాలని, ఆ బాధ్యత కేంద్రానిదేనని పేర్కొన్నారు. అసంపూర్ణంగా మిగిలిపోయిన వాగ్దానాలను పార్లమెంటు సెషన్లో రాష్ట్రపతి ఉపన్యాసంలో పొందుపరచాలని కోరారు. వాటిపై ఎన్నికల ముందే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అప్పట్లో తెలంగాణ ఏర్పాటు చారిత్రక అవసరంగా భావించిన కాంగ్రెస్ పార్టీ అక్కడ రాష్ట్రం ఏర్పాటుతోపాటు ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం ఎన్నో వాగ్దానాలను చట్టంలో పొందుపరిచిందని తెలిపారు. పదేళ్లు దాటినా అమలు చేయకపోవడంతో తీవ్ర నైరాశ్యంలోకి తోసేస్తూ అటు కేంద్రం, ఇటు రాష్ట్ర సర్కారు వాగ్దానాల అమలుపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టులకు జాతీయ హోదా ఈ రెండూ అత్యంత ముఖ్యమైన వాగ్దానాలని తెలిపారు. పార్లమెంటు సాక్షిగా అప్పటి ప్రధాని ఇచ్చిన హామీని అనంతరం వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదని, దీనివల్ల ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ తీవ్రంగా నష్టపోయిందని వివరించారు. పోలవరానికి జాతీయ హోదా రాష్ట్ర బాగుకోసం ఎంతో అవసరమని పేర్కొన్నా అటకెక్కించారని విమర్శించారు. దుగరాజపట్నం పోర్టు రాలేదని, కడప స్టీలుప్లాంటు అమలు కాలేదని, విశాఖ ప్రత్యేక రైల్వేజోన్ ఇంకా ఆచరణలోకి రాలేదని వివరించారు. కలహండి, బలంగీర్, బుందేల్‌ఖండ్ తరహాలో రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. వైజాగ్, చెన్నై పారిశ్రామిక కారిడార్ ఇంకా నిర్మించలేదని వివరించారు. కొత్త రాజధాని నిర్మాణానికి సపోర్టు చేయాల్సి ఉందని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రం పునరాలోచన చేయాలని కోరారు.

ప్రయివేటు వ్యక్తులతో గ్రానైట్ ఫ్యాక్టరీలలో తనిఖీలు

- కార్లలో కర్రలు, కారం పొట్లాలు
- తనపై దాడికి యత్నించారని ఎమ్మెల్యే ఏలూరి ఆరోపణ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్ (బాపట్ల జిల్లా)

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అనుచరుల గ్రానైట్ ఫ్యాక్టరీలలో ప్రయివేట్ వ్యక్తులతో కలిసి నెల్లూరు, కృష్ణా జిల్లాల మైనింగ్ అధికారులు తనిఖీలు చేశారు. మార్టూరులోని నాగరాజుపల్లి రోడ్డులో ఉన్న టిడిపి పట్టణ అధ్యక్షులు కామినేని జనార్ధన్‌కు చెందిన అనంత గ్రానైట్స్‌లో మంగళవారం మైనింగ్ అధికారులు తనిఖీలు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి అక్కడికి చేరుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఎందుకు తనిఖీలు నిర్వహిస్తున్నారని, ప్రయివేటు వ్యక్తులను ఎందుకు తీసుకొచ్చారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రయివేటు వ్యక్తులు తనపై దాడికి యత్నించినట్లు ఎమ్మెల్యే మీడియాకు తెలిపారు. విషయం తెలుసుకున్న టిడిపి శ్రేణులు, ఎమ్మెల్యే అభిమానులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. అధికారుల తీరును, ప్రయివేటు వ్యక్తుల తీరును ప్రశ్నిస్తూ టిడిపి శ్రేణులు ఆందోళనకు దిగారు. మైనింగ్ అధికారుల వెంట ప్రయివేట్ వ్యక్తులు రావడం, ఆ వాహనాల్లో కర్రలు, కారపుపొడి పొట్లాలు తీసుకురావడంతో వివాదానికి దారితీసింది. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలతో మైనింగ్ అధికారులు మార్టూరులోని టిడిపి నేతలకు చెందిన పలు గ్రానైట్ పరిశ్రమలతో పాటు తనిఖీలు చేపట్టడం జగన్ ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు నిదర్శనమని ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. మైనింగ్ అధికారులు మాట్లాడుతూ.. తాము తనిఖీకి ప్రయివేటు కార్లు తీసుకొస్తామని, ఒక అధికారి కారు చెడిపోవడంతో అతడిని వదిలిపెట్టడానికి వేరే కారు వచ్చిందని.. ఆ కారులో కారం పొట్లాలు ఉన్నాయన్నారు. తమ విధులకు కొందరు వ్యక్తులు ఆటంకం కలిగించారని పోలీసులకు మైనింగ్ అధికారులు ఫిర్యాదు చేశారు.


మైనింగ్ అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

ప్రాజెక్టుల అప్పగింతపై కేంద్రం దుందుడుకు చర్యలు

- రేపు కెఆర్‌ఎంబి సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్ , శ్రీశైలం డ్యామ్‌ల అప్పగింత వివాదం కొనసాగుతుండగానే కేంద్ర జలశక్తి శాఖ మరో ముందడుగేసింది. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఈ రెండు ప్రాజెక్టులపై వివాదం నెలకొన్న నేపథ్యంలో ఫిబ్రవరి ఒకటిన అప్పగింతపై హైదరాబాద్‌లో కీలక భేటీ జరగనుంది. దీంతో రాజకీయవర్గాల్లో మరోసారి చర్చకు దారితీసింది. రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఇఎన్‌సి)లతోపాటు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్‌ఎంబి) కేంద్ర జలశక్తి శాఖ లేఖలు రాసింది. ఈ సందర్భంగా ప్రాజెక్టుల అప్పగింత కోసం తీసుకోవాల్సిన చర్యలపై కెఆర్‌ఎంబి చైర్మన్, ఇతర ఉన్నతాధికారులు, తెలుగు రాష్ట్రాల ఇఎన్‌సిల మధ్య చర్చలు జరగనున్నాయి. నాగార్జున సాగర్‌తోపాటు శ్రీశైలం డ్యామ్ నిర్వహణ కూడా కృష్ణా బోర్డు చేతుల్లో పెట్టేందుకే కేంద్ర జలశక్తి శాఖ గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో రెండు రాష్ట్రాల ఇఎన్‌సిలతో సమావేశం ఏర్పాటు చేసింది. ప్రాజెక్టులపై పెత్తనం చేసేందుకే కేంద్రం ఈ తరహా చర్యలకు పాల్పడుతున్నదనే విమర్శలు వస్తున్నాయి. డ్యామ్‌ల అప్పగింతతో పాటు మరో 15 అంశాలపై చర్చించి యాక్షన్ ప్లాన్ తయారుచేయాలని కేంద్ర జలశక్తి శాఖ భావిస్తోంది. డ్యామ్‌ల వద్ద సిఆర్‌పిఎఫ్ నిఘాను సైతం కొనసాగించాలని ఆదేశించింది. ఒకవేళ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు చెందిన ఇంజినీర్లు నాగార్జునసాగర్ డ్యామ్‌ను సందర్శించాలంటే కచ్చితంగా కృష్ణా బోర్డు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. డ్యామ్‌కు ఏవైనా తప్పనిసరి మరమ్మతులు లన్నా బోర్డు అంగీకరించాల్సిందే. ఈ నేపథ్యంలో జరగనున్న కృష్ణా బోర్డు సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రత్యేక హోదా, విభజన హామీలపై దీక్షలు

- కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యాన రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం నిరసన దీక్షలు చేపట్టారు. వామపక్ష నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు దీక్షలో కూర్చుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ విడుదల చేయాలని, విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని, విశాఖపట్నం-చెన్నై కారిడార్‌ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షల్లో జై భారత్ జాతీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా, విభజన హామీలు ముగిసిన అధ్యాయాలు కావని, స్వార్థం కోసం ముగింపబడిన అధ్యాయాలు మాత్రమేనని అన్నారు. వాటిని ప్రజా ఉద్యమాల ద్వారా అందరం కలిసి సాధించుకోనేందుకు సరైన సమయం వచ్చిందని తెలిపారు. ప్రత్యేక హోదా విషయంలో బిజెపి చేసిన ద్రోహాన్ని వివరించారు. టిడిపి, వైసిపిలు వారి స్వప్రయోజనాల కోసం కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టాయని విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ప్రకాశం చౌక్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే కొన్ని రాయితీలు, సౌకర్యాలు దక్కేవని తెలిపారు. శ్రీకాకుళంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షల్లో నేతలు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో చట్టబద్ధంగా ఇస్తామన్న ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా బిజెపి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం పూనుకుంటోందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, జై భారత్, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.


నిరసన దీక్షలో కూర్చున్న పలు పార్టీల నాయకులు


దీక్షల్లో కూర్చున్న నాయకులు

'ఉక్కు' రక్షణకు ఐక్య పోరాటాలు


- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య పోరాటాలు నిర్వహించనున్నట్లు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిసిహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1083వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఆర్‌ఎంహెచ్‌పి విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పోరాటం కొనసాగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయడానికే మొగ్గుచూపడం దారుణమన్నారు. కర్మాగారంలో ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గడం, అందుకు తగ్గట్టు నియామకాలు జరపకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంలో ప్లాంట్‌ను నడపాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థగా స్టీల్‌ప్లాంట్‌ను నిలబెట్టుకోవడానికి అందరూ పోరాటంలోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎన్నేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

అటవీ కార్మికుల దీక్ష భగ్నం

- సమస్యలు పరిష్కరించే వరకూ దీక్షలు
- టైంస్కేల్ వర్తింపజేయాలి : వక్తలు డిమాండ్



దీక్షలను కొనసాగిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

టిటిడి అటవీ కార్మికులు చేస్తున్న నిరవధిక దీక్షలను సోమవారం అర్ధరాత్రి పోలీసులు భగ్నం చేశారు. కార్మికులు ఏ మాత్రం వెనకడుగు వేయకుండా దీక్షను కొనసాగించారు. ఆరోగ్యం క్షీణించిందన్న సాకుతో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి సహా, మరో ఎనిమిది మంది కార్మికులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి, రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో అప్పటి కప్పుడే మరో ఏడుమంది కార్మికులు దీక్షా శిబిరంలో కూర్చొని దీక్షను కొనసాగించారు. ఎంతమందిని అరెస్టు చేసినా సమస్య పరిష్కారం అయ్యేంత వరకూ దీక్ష కొనసాగుతుందని కార్మికులు స్పష్టం చేశారు. మంగళవారం వీరి దీక్షలకు మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ.. టిటిడి యాజమాన్యం చర్చలకు పిలిచి..సోమవారం అర్ధరాత్రి దీక్షల్లో ఉన్నవారిని అరెస్టు చేయిస్తారా? అని ప్రశ్నించారు. ఫారెస్టు కార్మికులకు టైంస్కేల్ వర్తింపజేస్తామని టిటిడి బోర్డు చేసిన తీర్మానం, హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా, టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఫారెస్టు కార్మికులు చేస్తున్న దీక్షకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఆర్‌పిఐ అధ్యక్షులు పి.అంజయ్య, ఎపి ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, చిత్తూరు జిల్లా సిఐటియు నాయకులు చైతన్య, సురేంద్ర, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, టిఎన్‌టియుసి నాయకులు రెడ్డెప్పనాయుడు మాట్లాడారు. సమస్య పరిష్కరించకుండా పోలీసులతో దీక్షను భగ్నం చేయడాన్ని తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ నేత శ్రీను, ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు ఇఎస్ కుమార్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

సిఎం ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పాలి

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

14 ఏళ్ల ముఖ్యమంత్రిగా వుండి రాష్ట్రానికి ఏమి చేశారో చెప్పాలనే సిఎం జగన్ ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పలేదని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భీమిలిలో వైసిపి నిర్వహించిన సిద్ధం సభ విజయవంతమైందన్నారు. ఆ సభతో వైసిపికి నూతనోత్సాహం వచ్చినట్లయిందన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజలకు నేరుగా రూ.2.5 లక్షల కోట్లను అందించిందన్నారు. చంద్రబాబు సభలకు ఎక్కడా ప్రజలు రావడం లేదన్నారు. స్కిల్ స్కామ్ కేసులో తాను తప్పు చేయలేదని మాత్రం ఆయన చెప్పలేకపోతున్నారన్నారు. జగన్ సిద్ధం పేరుతో ఎన్నికల శంఖారావం పూరిస్తే పవన్‌కల్యాణ్ మాత్రం చంద్రబాబు పల్లకి మోసేందుకు సిద్ధమయ్యారన్నారు. కన్నా లక్ష్మీనారాయణపై రాళ్ల దాడికి నేనే కారణమని అంటున్నారని, ఆ అవసరం తనకు లేదని అన్నారు.

ఆర్‌టిసి పురోగతికి కృషి

డైరీ ఆవిష్కరణలో ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో ఇతర ఆర్‌టిసిల కంటే ఎపిఎస్‌ఆర్‌టిసి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రజలందరికీ ఎంతో చేరువ అయ్యిందని ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు అన్నారు. విజయవాడలోని ఆర్‌టిసి హౌస్‌లో ఎపిఎస్‌ఆర్‌టిసి క్లాస్-2 సూపర్‌వైజర్స్ అసోసియేషన్ రూపొందించిన 2024 డైరీని ఎమ్‌డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌టిసిలో కేవలం సిబ్బంది అంకితభావం వల్లే జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను సాధించగలిగిందన్నారు. ఆర్‌టిసి సిబ్బందికి ఈ డైరీలో వున్న సమాచారం బాగా ఉపయోగపడుతుందన్నారు. సూపర్‌వైజర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వర్లు, అధ్యక్షులు ఎ విష్ణారెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ ఎం సతీష్‌కుమార్‌రెడ్డి, కోశాధికారి బి పూర్ణచంద్రరావు తదితరులు డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'పోలవరం'పై కేంద్రానికి ఆదేశాలివ్వండి

- హైకోర్టులో పిల్

ప్రజాశక్తి-అమరావతి

పోలవరం ప్రాజెక్టును నిర్ణీతకాలంలోగా నిర్మించేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. బహుళార్థ సాధక సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం సకాలంలో పూర్తి చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర జలవనరుల శాఖలకు ఉత్తర్వులివ్వాలంటూ న్యాయవాది వి రమేష్ చంద్ర వర్మ పిల్ వేశారు. 'పోలవరం ప్రాజెక్టుకు ఎగువన కాఫర్ డ్యాంను నిర్మించకుండానే డయాఫ్రం వాల్ నిర్మాణానికి అనుమతిలిచ్చిన అధికారులపై విచారణకు ఆదేశించాలి. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించకపోవడం చట్ట విరుద్ధంగా ప్రకటించాలి. ప్రాజెక్టు నిర్మాణాన్ని పర్యవేక్షించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి. డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాంల ప్రస్తుత పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించాలి' అని పిల్‌లో కోరారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సిఇఒ, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ డైరెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు.

తిరుపతిలో తమిళ సినిమా షూటింగ్

- ట్రాఫిక్ జామ్‌తో ప్రజల ఇక్కట్లు
- తాత్కాలికంగా షూటింగ్ నిలిపివేత

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తమిళ హీరో ధనుష్ తాజా చిత్ర షూటింగ్‌ను మంగళవారం ఉదయం తిరమల అలిపిరి శ్రీ బాలాజీ లింకు బస్టాండ్ వద్ద నిర్వహించారు. దీంతో తిరుమలకు వెళ్లే యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తిరుమలకు వెళ్లే వాహనాలను ఇస్కాన్ మార్గం, టిటిడి గోడౌన్, రుయా ఆస్పత్రి, బధిర హాస్టల్ మీదుగా దారి మళ్ళించారు. చిత్తూరు- బెంగళూరు -మదనపల్లి ప్రాంతాలకు వెళ్లే వాహనాలకూ ఇదే ప్రధాన రహదారి కావడంతో సుమారు అర్ధకిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి.

ఉదయం ఆరు గంటల నుంచి షూటింగ్ ప్రారంభం కావడంతో స్విమ్స్, రుయా, మెటర్నిటీ, బర్డ్, కార్పొరేషన్ కార్యాలయం, యూనివర్సిటీకి వెళ్లే ఉద్యోగులు, సహాయకులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ప్రజల నుంచి విమర్శలు రావడంతో సినిమా షూటింగ్‌ను చిత్ర యూనిట్ నిలిపివేసింది.

రెండు రోజుల పాటు గరుడ విగ్రహం, నంది సర్కిల్, గోవిందరాజస్వామి ఆలయాల వద్ద అనుమతి తీసుకున్నా, చిత్రం యూనిట్ సభ్యులకు, ప్రజలకు మధ్య రద్దీ విషయమై వివాదం జరగడంతో పోలీసు స్టేషన్‌లో కేసులు పెట్టుకునే వరకూ వెళ్లింది. దీంతో తాత్కాలికంగా షూటింగ్‌ను నిలిపేశారు.

ఎన్‌ఆర్‌ఐ యశస్వికి ఊరట

ప్రజాశక్తి-అమరావతి



రాష్ట్రంపైనా, సిఎం జగన్‌పైనా సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారనే అభియోగాలను ఎదుర్కొంటున్న ఎన్‌ఆర్‌ఐ బొద్దులూరి యశస్వికి హైకోర్టులో ఊరట లభించింది. సిఐడి జారీ చేసిన లుక్ ఔట్ నోటీసును రద్దు చేసింది. ఈ మేరకు జస్టిస్ బి భానుమతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండోసారి తప్పు చేస్తే తిరిగి యశస్వికి లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేసేందుకు సిఐడికి హైకోర్టు అనుమతినిచ్చింది. సిఐడి దర్యాప్తునకు సహకరించాలని షరతు విధించింది. ఈ మేరకు ఫిబ్రవరి 2న రెండు అఫిడవిట్లు దాఖలు చేయాలంది. 'రూ.5 లక్షల పూచీకత్తుపై అఫిడవిట్‌ను హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) వద్ద సమర్పించాలి. అడ్రస్, ఫోన్ నెంబర్ వంటి వివరాలతో మరో అఫిడవిట్ సమర్పించాలి' అని షరతులు విధించింది.

వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు

- గర్భిణులకు ఎన్నికల విధుల్లోంచి మినహాయింపు
- సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వికలాంగులు సానుకూల వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని వసతులూ ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వెల్లడించారు. సచివాలయంలో 'అందరికీ అందుబాటులో ఎన్నికలు' రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని సిఇసి ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంకె మీనా మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ర్యాంపులు ఏర్పాటుచేసే ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. ఇంటి వద్దే ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఇంటి వద్దే ఓటు వినియోగించుకోవాలనే వికలాంగులు బిఎల్‌ఒ ద్వారా ఆర్‌ఒకు ఫారమ్-12 సమర్పించాలన్నారు. ఎక్కువ మంది వికలాంగులున్న పోలింగ్ స్టేషన్లలో రెడ్‌క్రాస్, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సిసి వంటి సంస్థల నుంచి ఎంపిక చేసిన వ్యక్తులను వాలంటీర్లుగా నియమించి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. వికలాంగ ఉద్యోగులు, నిండు గర్భిణి/బాలింత ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వనున్నట్లు సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. అందుకు తగ్గట్టుగానే ఉద్యోగుల సమాచారం ఇవ్వాలని అన్ని శాఖలనూ కోరినట్లు పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంలో వికలాంగులు ఎదుర్కొన్న సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలను సూచించాలని వికలాంగుల సంఘాల ప్రతినిధులను కోరారు. సంఘాల ప్రతినిధుల అభిప్రాయాల మేరకు జిల్లా, నియోజకవర్గ స్థాయి అందరికీ అందుబాటు లో ఎన్నికలు కమిటీల్లో వికలాంగుల సంస్థలు, ప్రతినిధులను భాగస్వామ్యం చేసేలా ఆదేశాలు జారీ చేస్తామని సిఇఒ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి ఎంఎన్ హరేంద్ర ప్రసాద్, కమిటీ నోడల్ ఆఫీసరు మల్లిబాబు, రాష్ట్ర అంధ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవీంద్రబాబు, రాష్ట్ర బధిర సంఘం జనరల్ సెక్రటరీ శశికుమార్, రోడ్లు, భవనాలశాఖ అడిషనల్ సెక్రటరీ బి నరసింహారెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ మురళి కృష్ణ, స్త్రీ, శిశు, వికలాంగ, వయోవృద్ధులశాఖ అసిస్టెంట్ సెక్రటరీ విజయలక్ష్మి, పాఠశాల విద్య అడిషనల్ సెక్రటరీ ఎం భాస్కర్ పాల్గొన్నారు.

నత్త నడకన ఉప్పాడ

- రెండున్నరేళ్లుగా కొనసాగుతున్న పనులు
- నిర్మాణానికి గడువు పెంచినా 60 శాతమే పురోగతి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లాలోని యూ.కొత్తపల్లి మండలం ఉప్పాడ శివారు అమీనాబాద్ తీరంలో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. రెండున్నరేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. రూ.361 కోట్ల నిధులతో 2020 డిసెంబరులో సిఎం వైఎస్.జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. 2021 జూన్ నుంచి పనులు ప్రారంభించారు. 2023 జూన్ నాటికి పనులు పూర్తి కావాల్సి వచ్చినా ఇప్పటి వరకు 60 శాతమే పనులు పూర్తయ్యాయి. నిధుల విడుదలలో జాప్యంతో బాటు నిర్దేశిత కాలంలో నాలుగు సార్లు తుపానులు రావడంతో పనులు పూర్తి చేయడానికి మరో 18 నెలలు గడువు పొడిగించారు.

60 శాతమే పురోగతి

వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు, నాలుగు ఫిషింగ్ ల్యాండింగ్ కేంద్రాలను నిర్మిస్తుంది. ఇందుకోసం రూ.నాలుగు వేల కోట్లను ఖర్చు చేస్తుంది. మొదటి ఫేజ్‌లో ఉప్పాడతో బాటు మచిలీపట్నం, నిజాంపట్నం, జువ్వలదిన్నెలలో రూ.1,200 కోట్లతో హార్బర్ పనులు ప్రారంభించారు. ఎపి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎపియుఆర్‌బిఎఎన్) పర్యవేక్షణలో ఎంఆర్‌కెఆర్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్మాణాన్ని చేపట్టింది.

ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ ఐదు దశల్లో ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుంది. మొదటి దశలో 27 అడుగుల లోతున 5.20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను ఒకే స్థాయిలో తొలగించారు. రెండో దశలో జెట్టీ నిర్మాణం కోసం సుమారు రెండు కిలోమీటర్ల మేర బ్రేక్ వాటర్‌కు అడ్డుకట్ట వేసేందుకు బండరాళ్లను డంప్ చేశారు. ఈ బ్రేక్ వాటర్ ప్రొటక్షన్ కోసం 2,3,4,6 టన్నుల బరువు గల టెట్రా పోడ్స్ (ట్రై ఎంగిల్) దిమ్మెలను తయారు చేసి వేశారు. మూడో దశలో 800 మీటర్ల రన్నింగ్ మీటర్ల పొడవున నిర్మాణం చేపట్టారు. ఇప్పటి వరకూ ఈ పనులు 50 శాతమే పూర్తి అయ్యాయి.

నాలుగో దశలో భవనాలు, రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు పది భవనాలకు మాత్రమే స్లాబులు పూర్తయ్యాయి. కాంపౌండ్ వాల్ 30 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఐదో దశలో 20 టన్నుల సామర్థ్యం కలిగిన కోల్ట్ స్టోరేజ్, ఐస్ ప్లాంట్ల నిర్మాణం, 980 టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులను, బోట్ల మరమ్మతులు చేసే యార్డును కూడా నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకూ మొత్తం ప్రాజెక్టులో 60 శాతం పనులు మాత్రమే పూర్తి కాగా 43 శాతం నిధులు విడుదలయ్యాయి. ఇది పూర్తయితే 1.10 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు మత్స్య సంపద సేకరణకు వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. సుమారు 50 వేల మంది మత్స్యకారులకు నేరుగా ప్రయోజనం కలుగనుంది. 40 శాతం పనులు పూర్తి కావాలంటే మరో రెండేళ్ల వరకు సమయం పట్టే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.


హార్బర్ నిర్మాణ ప్రాంతం

ఈ ఏడాది మార్చికి పూర్తి

నిధుల విడుదలలో జాప్యం ఏమీ లేదు. వాస్తవానికి వచ్చే ఏడాది ఆగస్టు వరకూ గడువు ఉంది. అయితే ఈ ఏడాది మార్చి 31 లోపే హార్బర్ పనులు పూర్తి అవుతాయి. ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

– శివ ప్రసాద్, ఎపి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎపియుఆర్‌బిఎఎన్) ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ (పిఎంసి)

నిధులు విడుదల చేసి పూర్తి చేయాలి



ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపట్టి దాదాపుగా మూడేళ్లు అయ్యింది. సగం పనులు కూడా పూర్తి కాలేదు. నిధుల విడుదల్లో జాప్యం కారణంగానే నిర్మాణ పనులు ఇంకా జరుగుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి పనులను త్వరితగతిన పూర్తిచేసి మత్స్యకారులను ఆదుకోవాలి.

– సిహెచ్ ప్రసాద్, మత్స్యకారుడు, ఉప్పాడ


సర్పంచుల దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న బిర్రుప్రతాప్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలని సర్పంచుల దీక్ష

- నల్లబ్యాడ్జీలు, కండువాలతో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

సర్పంచుల న్యాయబద్ధమైన 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. కర్నూలు ధర్నా చౌక్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా సర్పంచులు నల్లబ్యాడ్జీలు, నల్లకండువాలతో మంగళవారం నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8660 కోట్లను దారి మళ్లించిందని విమర్శించారు. న్యాయబద్ధమైన 16 డిమాండ్లతో గాంధీ వర్ధంతి సందర్భంగా నల్ల కండువా, నల్ల బ్యాడ్జీలతో సర్పంచులు నిరసన చేసే దౌర్భాగ్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని వివరించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, అప్పటికీ దిగి రాకపోతే రాబోయే ఎన్నికల్లో సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు కేటాయించి వెంటనే ఆ పథకం పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మైనింగ్ సెస్, ఇసుకలో వాటా నిధులు, రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రొఫెషనల్ ట్యాక్సు, ఎంటర్‌టేన్‌మెంట్ ట్యాక్స్, నీటి తీరువా నిధులు, తలసరి గ్రాంట్, గ్రామీణ రోడ్ల నిర్వహణకు గ్రామ పంచాయతీలకు ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సర్పంచులను సభాధ్యక్షులుగా పెట్టాలన్నారు. పంచాయతీలకు రావల్సిన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భూమా వెంకట వేణుగోపాల్ రెడ్డి, సహ కార్యదర్శి రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు. జనసేన నేతలు మద్దతు తెలిపారు.


ప్రొఫెసర్ శ్రీధర్‌తో మాట్లాడుతున్న మురళీకృష్ణ

మాడభూషి శ్రీధర్‌ను కలిసిన మురళీకృష్ణ

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

ప్రముఖ న్యాయశాస్త్ర కోవిదుడు, కేంద్ర సమాచార హక్కు చట్టం పూర్వ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ మంగళవారం కలిశారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన శ్రీధర్ పూర్తిగా కోలుకుని ఆత్మవిశ్వాసంతో ఉండడం పట్ల మురళీకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం మహోన్నత లక్ష్యాలపై సరళమైన భాషతో త్వరలోనే పుస్తకాన్ని తీసుకువస్తానని ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ చెప్పినట్లు మురళీకృష్ణ తెలిపారు.

ప్రశ్నార్థకంగా కల్లుగీత వృత్తి

- ఎక్స్‌గ్రేషియా ఎందుకు ఇవ్వడం లేదు?
- తణుకులో ప్రారంభమైన ఎపి కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ



మోకులు ధరించి ర్యాలీ చేపట్టిన కల్లుగీత కార్మికులు


సభలో మాట్లాడుతున్న ఎంవి రమణ

ప్రజాశక్తి - తణుకు రూరల్

వైసిపి ప్రభుత్వం గీత వృత్తిని నాశనం చేసి, గీత కార్మికుల ఉపాధిని దెబ్బతీసిందని, ఫలితంగా కల్లుగీత వృత్తి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రమణ తీవ్రంగా విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో రెండు రోజులు పాటు నిర్వహించనున్న ఎపి కల్లుగీత కార్మిక సంఘం 15వ రాష్ట్ర మహాసభ మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు తణుకు మున్సిపల్ కార్యాలయం నుంచి నరేంద్ర సెంటర్, వెంకటేశ్వర సెంటర్ మీదుగా లయన్స్‌క్లబ్ ఆడిటోరియం వరకూ గీత కార్మికులు మోకులు ధరించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం ఏర్పడి 80 వసంతాలు పూర్తయిన సందర్భంగా సభ నిర్వహించారు. ఈ సభకు ఆహ్వాన సంఘం అధ్యక్షులు కామన మునిస్వామి అధ్యక్షత వహించారు. తొలుత సంఘం జిల్లా నాయకులు చిటకన వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రమణ మాట్లాడుతూ.. రాష్ట్రాలు వేరైనా వృత్తిపరంగా, భాషపరంగా మనందరం ఒక్కటేనన్నారు. ఈ రాష్ట్రంలో గీత కార్మికుల బతుకులు మారాలని మోకులు ధరించి రోడ్లపైకి వస్తున్నామంటే జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. ఎక్కడైనా ప్రమాదాలు సంభవిస్తే రూ.30 లక్షలు, రూ.50 లక్షలు ఇస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి, చెట్టు ఎక్కిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తూ మరణిస్తే ఎందుకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వృత్తి రక్షణ, ఆధునికీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కల్లుగీత కార్మిక సంఘం మాజీ జిల్లా గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ... పాదయాత్రలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదని సిఎం జగన్‌ను ప్రశ్నించారు. తాటి, ఈత చెట్లపై గీత కార్మికులకు హక్కు లేకుండా చేసి వృత్తిని దెబ్బతీశారన్నారు. వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ.. నూతన పాలసీలో రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వని ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనని విమర్శించారు. తమ ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికల ప్రణాళిక ప్రకటించిన వారికే తమ మద్దతు ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి, నేతలు గుబ్బల వీరరాఘవులు, కడలి పాండు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల నేతలతోపాటు మాజీ మున్సిపల్ చైర్మన్ దొమ్మేటి వెంకటసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల్లో ఉన్న వారికే ప్రాధాన్యత

- రాష్ట్ర పర్యాటక మంత్రి రోజా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రజలను నిర్లక్ష్యం చేసి వారి మధ్యలో లేని ప్రజాప్రతినిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పక్కన పెడుతున్నారని రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసుల శాఖ మంత్రి రోజా అన్నారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ కళాశాల మైదానంలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డితో కలిసి రోజా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల్లో రాణించాలనుకున్న ప్రతి ఒక్కరికి 'ఆడుదాం ఆంధ్ర' అనే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారని, రూ.110 కోట్లతో 15 వేల సచివాలయాల్లో ఈ క్రీడలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బాబు పాలనలో స్కీంలు లేవు కానీ స్కామ్ లు ఉన్నాయని విమర్శించారు. చంద్రబాబు అనేక కేసుల్లో ఇరుక్కున్నారని రాబోయే రోజుల్లో ఆయన జైలుకు వెళ్లడం ఖాయమని, ఇలాంటి వ్యక్తికి ఓటు వేయడం వృథా అని అన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, రాష్ట్ర మైనార్టీ ప్రభుత్వ సలహాదారులు హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి, చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

పార్టీని నమ్ముకున్న వారిని ఆదుకుంటాం : భువనేశ్వరి

ప్రజాశక్తి-చెరుకుపల్లి, పర్చూరు (బాపట్ల జిల్లా)

పార్టీ కార్యకర్తలను, పార్టీని నమ్ముకున్న వారిని ఆదుకోవడంలో టిడిపి, ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందని నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాపట్ల జిల్లా, చెరుకుపల్లి, కొల్లూరులో భువనేశ్వరి పర్యటించారు. చెరుకుపల్లి గ్రామానికి చెందిన కోట వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి.. మూడు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. పర్చూరు మండలం చిననందిపాడు గ్రామంలో మువ్వ సింగారావు కుటుంబాన్ని పరామర్శించి, రూ. మూడు లక్షల ఆర్థికసాయం అందించారు. ఆమె వెంట ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీ పి.అనూరాధ ఉన్నారు.

మూగజీవిపై పులి దాడి

ప్రజాశక్తి-నల్లజర్ల(తూర్పుగోదావరి)

ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం కొత్తగూడెం, రామసింగవరం, గ్రామాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి పశువులపై పులి దాడి చేసింది. ఓ దూడను చంపి, తినేసింది. స్థానికులు, రైతులు తెలిపిన వివరాలు ప్రకారం కొత్తగూడెం గ్రామానికి చెందిన ముక్కవల్లి బాలచంద్రంకు చెందిన ఆవు దూడను పులి చంపింది. ఈ విషయాన్ని అధికారులు తెలియజేశారు. దూడ కళేబరాలను, మాంసం ముద్దలను గుర్తించారు. రెండు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. అధికారులు చెప్పేవరకూ పొలాల్లోకి వెళ్లరాదని హెచ్చరించారు. పాద ముద్రలను బట్టి పుల్లలపాడు అటవీప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు భావిస్తున్నారు.

జమ్ము అండ్ కాశ్మీర్ బ్యాంక్‌తో ఎంఎస్‌ఐఎల్ ఒప్పందం

హైదరాబాద్ : జమ్ము అండ్ కాశ్మీర్ బ్యాంక్‌తో మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్(ఎంఎస్‌ఐఎల్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా డీలర్లకు ఇన్వెంటరీపై నిధులను అందించనుంది. దేశ వ్యాప్తంగా ఉన్న 4,000 మారుతి సుజుకీ సేల్స్ ఔట్ లెట్స్‌కు లబ్ధి చేకూరనుంది. డీలర్లకు అవసరమైన మూలధన అవసరాల కోసం బ్యాంక్ తోడ్పాటు అందించనుంది. ఎంఎస్ఐ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాత్సవ, సమక్షంలో మారుతి సుజుకీ జనరల్ మేనేజర్ విశాల్ శర్మ, బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధీర్ గుప్తా ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు.

ప్రయివేటు టెల్కోల వసూళ్ల ఎత్తుగడ..!

- 2జి, 3జి సేవల నిలిపివేతకు ప్రతిపాదనలు
- ట్రాయ్‌తో సంప్రదింపులు
- 4జి, 5జితో రెవెన్యూ పెంచుకునే ప్రయత్నం
- బిఎస్‌ఎన్‌ఎల్‌ను దెబ్బగొట్టే కుట్ర
- 25 కోట్ల పైగా మందిపై భారం



న్యూఢిల్లీ : పేదలు, పెద్ద వయస్సు వాళ్లను పీక్కు తినడానికి ప్రయివేటు టెలికం కంపెనీలు ఎత్తుగడలు వేస్తున్నాయి. దేశంలో 2జి, 3జి సేవలను నిలిపి వేయాలని ఆ సంస్థలు చేస్తున్న ప్రయత్నాలే ఇందుకు నిదర్శనం. దీంతో మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్‌ఎన్‌ఎల్)ను దెబ్బగొట్టే ప్రక్రియను ముమ్మరం చేశాయని స్పష్టమవుతోంది. దేశంలో ఇంటర్నెట్ సేవలు వేగంగా విస్తరిస్తున్నాయి. టెల్కోలు 4జి, 5జి సేవలను పెంచుతున్నాయి. అయినప్పటికీ 2జి, 3జి సర్వీసులు వాడేవారు దేశంలో కోట్లాది మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలు, ద్వితీయ శ్రేణి పట్టణాల్లో కోట్లాది మంది పెద్దవాళ్లు, నిరక్షరాస్యులు ఇంకా ఫీచర్ ఫోన్లనే వాడుతున్నారు. అందులో 2జి సేవలనే వినియోగించుకుంటున్నారు. ఈ విభాగంలో బిఎస్‌ఎన్‌ఎల్ విస్తృతంగా వినియోగదారులను కలిగి ఉంది. కాగా.. 2జి, 3జి సేవలను పూర్తిగా రద్దు చేయాలని రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియా టెల్కోలు తాజాగా టెలికం నియంత్రణ సంస్థ (ట్రాయ్)కు ప్రతిపాదనలు అందించాయి. దీనికి సంబంధించి కేంద్రం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని కోరాయి. కాగా దీనిపై భారతీ ఎయిర్‌టెల్ మాత్రం తన అభిప్రాయాన్ని వెల్లడించలేదు. దేశంలో దాదాపు 25 కోట్ల మంది పైగా ఇప్పటికీ 2జి నెట్‌వర్క్‌ను వాడుతున్నారని అంచనా.

2జి, 3జి సేవలను పూర్తిగా నిలిపివేసేలా కేంద్ర ప్రభుత్వమే విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో కోరింది. ఆ రెండు స్పెక్ట్రమ్‌లను మూసివేసినప్పుడే ప్రజలంతా 4జి, 5జిలోకి మారతారని పేర్కొంది. దీనివల్ల అనవసరపు నెట్‌వర్క్ వినియోగ భారం తగ్గుతుందని తెలిపింది. వివిధ రంగాల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో 5జి ఎకోసిస్టమ్‌తో యువతలో నైపుణ్యాలు పెంచుకోవడంతో పాటు తమ కలలను సాకారం చేసుకునేందుకు అవకాశాలను ఇస్తాయని జియో పేర్కొంది. ఇప్పటికీ దేశంలో 2జి నెట్‌వర్క్‌ను ఉపయోగించే వారి సంఖ్య భారీగా ఉందని వొడాఫోన్ ఇండియా పేర్కొంది. 4జి, 5జి సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ చాలామంది ఆ సేవలను వినియోగించుకోలేకపోతున్నారని తెలిపింది. 2జి సేవలను రద్దు చేస్తేనే 4జి, 5జికి అప్‌గ్రేడ్ అవుతారని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది ఇప్పటికీ ఫీచర్ ఫోన్లనే వినియోగిస్తున్నారు. 4జి, 5జి కోసం పేదలు స్మార్ట్‌ఫోన్‌కు మారాలంటే భారం పడనుంది. ఇప్పటికీ అనేక మందికి స్మార్ట్‌ఫోన్ ఆపరేటింగ్ కూడా తెలియదు. ఇలాంటి పరిస్థితుల్లో 2జి, 3జి సర్వీసులను పూర్తిగా రద్దు చేయాలని ప్రయివేటు టెల్కోలు ప్రతిపాదనలు చేయడమంటే ప్రజలపై ఆర్థిక భారం మోపడమేనని, వారిని దోచుకోవడమేనని నిపుణులు పేర్కొంటున్నారు. టెలికం కంపెనీలు తమ ఆదాయాలను పెంచుకోవడానికి వేస్తున్న పెద్ద ఎత్తుగడ అని విమర్శిస్తున్నారు. మరోవైపు 2జి విభాగంలో అత్యధిక మంది వినియోగదారులు కలిగి ఉన్న బిఎస్‌ఎన్‌ఎల్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలో ఇది ఒక భాగమని విశ్లేషిస్తున్నారు.

కనీసం రూ.50వేల కోట్లు

- సిఎంకు అధికారుల నివేదన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రానున్న రెండు నెలల కాలానికి కనీసం 50 వేల కోట్ల రూపాయలు కావాలని ఆర్థికశాఖ అధికారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నివేదించారు. రాష్ట్ర ఆర్థికస్థితిపై మంగళవారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో రానున్న రెండు నెలలకాలానికి అవసరమైన నిధుల సమీకరణ, పథకాల నిర్వహణ, అదే విధంగా ఓట్‌ఆన్‌అక్కౌంట్ ప్రతిపాదనలపై చర్చ జరిగింది. ఆర్థిక పరిస్థితిపై ఆరాతీసిన సిఎంకు అధికారులు ఉన్న పరిస్థితిని ఉన్నట్లుగానే వివరించి, క్లిష్టంగా ఉందని చెప్పినట్లు తెలిసింది.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఖజానా పరిస్థితిపై ఆరా తీసారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇంకా కేవలం రెండు నెలలు మాత్రమే ఉండడం, ఎన్నికలకు మరో మూడు నెలల కాలం మాత్రమే ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఆయన ఆరా తీయడం గమనార్హం. ఈ రెండు నెలల కాలంలో ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు నిధుల లోటు రాకుండా చూడాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. అలాగే కొద్ది రోజుల్లో ప్రవేశపెట్టనున్న ఓట్ ఆన్ అక్కౌంట్ బడ్జెట్‌పైనా ఆర్థికశాఖతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగానే రానున్న రెండు నెలలకు కనీసం 50 వేల కోట్ల వరకు కావాల్సి ఉంటుందని వారు చెప్పినట్లు తెలిసింది. పన్నుల ద్వారా వచ్చే ఆదాయం, కేంద్రం నుంచి చివరి నెలల్లో వచ్చే ఆదాయం కలిపి కొంతవరకు సర్దుకోవచ్చని, అయినా మరికొంత సమీకరించుకోవాల్సిఉంటుందని వారు తెలిపారు. అలాగే డిసెంబర్ వరకు తొమ్మిది నెలల్లో వచ్చిన ఆదాయం, చేసిన వ్యయం, లోటు అంశాలను కూడా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించినట్లు సమాచారం. జనవరిలో కూడా రావాల్సిన, వచ్చిన ఆదాయం వివరాలను వివరించారు. ప్రధానంగా ఇప్పుడు లబ్ధి అందుకుంటున్న లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా నిధుల సమీకరణ జరగాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. అలాగే గురువారం కేంద్రం ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చిన కేటాయింపులను అధ్యయనం చేసి, రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను కూడా సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ భేటీలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్, ముఖ్య కార్యదర్శి గుల్జార్, కార్యదర్శి సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



న్యూజివీడ్ సీడ్స్‌కు 50 ఏళ్లు

- విత్తన పరిశోధనకు రూ.55 కోట్లు
- 30 శాతం వృద్ధి లక్ష్యం
- సిఎండి ప్రభాకర్ రావు వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో : వచ్చే ఐదేళ్లలో న్యూజివీడ్ సీడ్స్ కంపెనీ విత్తన అమ్మకాల్లో 30 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నామని ఎన్‌ఎస్‌ఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం ప్రభాకర్ రావు అన్నారు. న్యూజివీడ్ సీడ్స్‌ను ప్రారంభించి.. ఈ ఏడాదితో 50 ఏళ్లు కావస్తుందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ శరద్ ఖురానా, హోల్ టైం డైరెక్టర్ పి సతీష్ కుమార్, చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ వి శ్రీకాంత్‌తో కలిసి ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. గడిచిన 2022-23లో 15 శాతం పెరుగుదలతో రూ.1100 కోట్ల టర్నోవర్ నమోదు చేశామని.. విత్తన కొరత వల్ల ఈ ఏడాది కూడా అదే స్థాయిలో వ్యాపారం జరగవచ్చన్నారు. కానీ వచ్చే ఐదేళ్ల పాటు 30 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చన్నారు. భారత విత్తన రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. తమ సంస్థ ఏడాదికి కోటి పత్తి విత్తనాల ప్యాకెట్లను విక్రయిస్తుందన్నారు. తమ మొత్తం వ్యాపారంలో ఈ విభాగం 46 శాతం వాటా కలిగి ఉందన్నారు. సంస్థ మొత్తం రెవెన్యూలో 5 శాతం పరిశోధన, అభివృద్ధికి కేటాయిస్తున్నామన్నారు. ఆర్‌అండ్‌డి కోసం ప్రతీ ఏడాది దాదాపు రూ.50-55 కోట్ల పెట్టుబడులు పెడుతున్నామన్నారు. గడిచిన నాలుగైదు ఏళ్లలో 3.4 కొత్త ఉత్పత్తులు తీసుకొచ్చామన్నారు. ఒక్క కొత్త విత్తనాన్ని అభివృద్ధి చేయడానికి ఏడేనిమిది ఏళ్లు పడుతుందన్నారు. ప్రతీ ఏడాది 50 లక్షల రైతులకు తాము సేవలందిస్తున్నామన్నారు. విత్తన ఉత్పత్తిలో మరో లక్ష మంది రైతులతో భాగస్వామ్యం కలిగి ఉన్నామన్నారు. వచ్చే నాలుగైదు ఏళ్లలో రెట్టింపు పత్తి విత్తనాలను సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం కోటి ప్యాకెట్లు విక్రయిస్తున్నామన్నారు. ప్రపంచ విత్తన రంగం ప్రతీ ఏడాది సగటున 5 శాతం పెరుగుదలను నమోదు చేస్తే.. భారత్ 10 శాతం వృద్ధిని సాధిస్తుందన్నారు. తమ సంస్థ పరిశ్రమ కంటే దాదాపు రెట్టింపు వృద్ధితో కొనసాగుతుందన్నారు.

సంపాదకీయం


నీతిబాహ్య రాజకీయాలు

నీతిబాహ్య రాజకీయాలకు నిలువెత్తురూపంగా నితీష్‌కుమార్ చరిత్రలో చెరగని స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఆయారాం, గయారాంలను ప్రోత్సహిస్తూ అధికారం చేజిక్కించుకోవడం ఒక్కటే ధ్యేయంగా రాజకీయాలను నడుపుతున్న కమలం పార్టీ పాటలీపుత్రం ఫల్తూ కుమార్.. ఫల్తూ రామ్‌గా పేరొందిన ఈ పెద్దమనిషిని ఆలింగనం చేసుకుని, మద్దతు ప్రకటించేసింది. చచ్చినా బిజెపి పంచన చేరేది లేదన్న నితీష్, ఈ ఫల్తూ రామ్‌కు శాశ్వతంగా తలుపులు మూసేశామన్న అమిత్ షా మాటలన్నీ మట్టి కొట్టుకుపోయాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజారిటీ స్థానాల్లో పాగా వేయడమే లక్ష్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థలతో చేయించిన బెదిరింపులు, సిఎం పదవికి ఢోకా లేదన్న భరోసా ఈ విశ్వాస ఘాతుకానికి నితీష్‌ను పురికొల్పింది.

పుల్వామా ఘటనతో ప్రజల మనోభావాలను రెచ్చగొట్టి 2019లో 303 స్థానాల్లో పాగా వేసిన కాషాయ పార్టీకి ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని ఇప్పటికే చాలా సర్వేలు విడమరిచాయి. అయోధ్యలో రామప్రతిష్ఠ చుట్టూ ప్రజల దృష్టి కేంద్రీకృతమయ్యేలా చేసి, మతభావాలు రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలని బిజెపి చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొట్టే పరిస్థితే ఉంది. మరో వైపు ఇండియా వేదికగా 28కిపైగా పార్టీలు మోడీ సర్కారును ఢీకొట్టేందుకు కసరత్తు ముమ్మరం చేశాయి. దేశంలో 55 శాతానికి పైగా ఓట్లు పొందిన ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి, సమరశంఖం పూరిస్తే తమ పరిస్థితేంటన్న కలవరం కాషాయ పార్టీని కుదిపేస్తోంది. ఇటీవల నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో మూడింటిని బిజెపి గెలుచుకున్నా, ఆ ఆనందం ఎంతో కాలం నిలవలేదు. ఓటింగ్‌లో స్వల్ప తేడా మాత్రమే ఉండటం, దేశవ్యాప్తంగా గతంలో గెలిచిన స్థానాల్లో చాలాచోట్ల ఓడిపోయే పరిస్థితే ఉందన్న సర్వేలు ఆ పార్టీకి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలను మరోసారి రంగంలోకి దింపి ప్రతిపక్ష పార్టీలను బెదిరించి, తనతో సయోధ్య కుదుర్చుకునేలా చేసి లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తోంది.

సోషలిస్టుగా రాజకీయాలు ప్రారంభించిన నితీష్... సమతా పార్టీ పెట్టి, ఆ తరువాత ఎన్‌డిఎలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. 2005లో ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుంచి 2013 వరకూ బిజెపితో దోస్తీ చేసిన ఆయన మోడీ ప్రధాని అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఆ కూటమి నుంచి తప్పుకుని, కాంగ్రెస్, సిపిఐ మద్దతుతో ప్రభుత్వాన్ని నిలబెట్టుకున్నారు. 2015లో ఆర్‌జెడి, కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి పోటీ చేసి సిఎం కుర్చీని చేపట్టిన ఆయన 2017లో మళ్లీ కమలం గూటికి చేరారు. ఈయన చలవతో ఇక్కడ కాలుమోపిన కాషాయ పార్టీ జెడి(యు) అంతానికి ప్రయత్నిస్తూనే ఉంది. 2020 ఎన్నికల్లో రామ్‌విలాస్ పాశ్వాన్ తనయుడు చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ జెడియు పోటీ చేసిన స్థానాల్లో పోటీ చేసేలా చేసి, నితీష్ పార్టీని చావుదెబ్బ తీసింది. 2010లో 115 స్థానాలున్న నితీష్ పార్టీ 2020 ఎన్నికల్లో 43 స్థానాలకు దిగజారడంతో పెత్తనమంతా తన చేతిలోనే బిజెపి కేంద్రీకృతం చేసుకుంది. బహిరంగంగా పరువు తీయడంతోపాటు పార్టీ చీలికకు యత్నించిందని స్వయానా నితీష్ వాపోయారు. 2022లో బిజెపికి కటీఫ్ చెప్పి, మహా కూటమిలో చేరారు. 243 స్థానాలున్న అసెంబ్లీలో 75 స్థానాలతో అతి పెద్ద పార్టీగా ఉన్న ఆర్‌జెడి తరపున తేజస్వి యాదవ్ ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. దాదాపు 17 ఏళ్ల జెడి(యు)-బిజెపి పాలనకన్నా మెరుగైన రీతిలో మహా కూటమి పాలన సాగింది. దాదాపు నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశారు. బిజెపిని ఎదిరించి కులగణన చేపట్టి దేశానికి ఒక నమూనాగా నిలిచింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నితీష్, ఇతర మిత్రులతో కలిసి దాదాపు క్లీన్ స్వీప్ చేసిన బిజెపి ఈసారి రివర్స్ అయ్యే పరిస్థితి ఉండటంతో కలవరపాటుకు గురైంది. వెనుకబడిన వర్గాల నేతగా గుర్తింపు పొందిన మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చింది. 'ఇండియా' వేదికలో కీలక నేతగా ఉన్న నితీష్‌కుమార్ మళ్లీ తన పంచన చేరేలా అన్ని ఎత్తులూ వేసింది. ఐదు నెలల క్రితం మనీ లాండరింగ్ కేసులో ఆ పార్టీ ఎంఎల్‌సిని, ఆయన కుమారుడిని అరెస్టు చేయడంసహా బెదిరింపులకు పాల్పడింది. దశాబ్దాలుగా అక్రమ కేసుల్లో వేధిస్తున్నా, జైలులో పెట్టినా నిబ్బరంగా ఎదిరించి నిలబడిన ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌లా చేవలేక చేవచచ్చిన నితీష్ అదే పార్టీ పంచన చేరారు. ఆయన కూటములు మారడం గత పదేళ్లలో ఇది ఐదోసారి. అవకాశవాదానికి పరాకాష్టగా ఏర్పడిన బిజెపి-జెడి(యు)కు బుద్ధి చెప్పేందుకు మహా కూటమి సమాయత్తమవుతోంది. ఆయన బిజెపి వద్దకు వెళ్తే మేం ప్రజల వద్దకు వెళ్తాం...లోక్‌సభ ఎన్నికల తరువాత జెడి(యు) కథ ముగుస్తుందంటూ తేజస్వి యాదవ్ చేసిన వ్యాఖ్య ఏ మాత్రం అతిశయోక్తి లేదు. నితీష్, బిజెపి అవకాశవాద పొత్తుపై సోషల్ మీడియాలో సెటైర్లే సెటైర్లు. లోక్‌సభ ఎన్నికల తరువాత జెడి(యు) కనుమరుగైనా ఆశ్చర్యపోనవసరం లేదు.

మహనీయుల మాట



ఆందోళన అనేది ఒక ప్రకృతి సూత్రం. ప్రకృతి శూన్యాన్ని అసహ్యించుకున్నట్లే నిశ్శబ్దాన్ని కూడా అసహ్యించుకుంటుంది. శాంతియుతంగా చక్కదిద్దాం అనుకునేవారూ... నిశ్శబ్ద, నిశ్చల, బద్ధకపు జీవులూ, స్తబ్దతకు గొప్పగా చెప్పుకునేవారూ ఎన్నటికీ విజయం సాధించలేరు.

- యూజీన్ డెబ్స్,
అమెరికా సోషలిస్టు పార్టీ నాయకుడు.

కాలయాపన కమిటీలు, కోట్లాది రైతుల సంగతేమిటి మోడీజీ!



రైతులు ముందుకు తెచ్చిన కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత అంశంతో సహా కనీస మద్దతు ధరలు, సేంద్రీయ సాగు గురించి సిఫార్సులు చేసేందుకు 2022 జులై 18న కేంద్ర ప్రభుత్వం 26 మందితో ఒక కమిటీని వేసింది. కమిటీలో అత్యధికులు తాన తందాన వారే ఉన్నందున దానిలో చేరేందుకు... రైతుల ఆందోళనకు నాయకత్వం వహించిన సంయుక్త కిసాన్ మోర్చా తిరస్కరించింది. ఆ కమిటీలో వివిధ అంశాల మీద సిఫార్సులు చేసేందుకు మరో ఐదు ఉపకమిటీలు ఏర్పాటు చేశారు. ఇక్కడే అసలు కథ ప్రారంభం. చిత్రం ఏమిటంటే ఈ కమిటీ నివేదికకు నిర్దిష్ట కాలపరిమితి విధించలేదు. ఇంతవరకు అదేమి చేసిందో మనకు తెలియదు. గతేడాది జూన్‌లో ఉప కమిటీలు నివేదికలు సమర్పిస్తాయని చెప్పారు. తరువాత ఎలాంటి సమాచారమూ లేదు. సాగు చట్టాలను వేగంగా తెచ్చిన ప్రభుత్వం దీని నివేదిక పట్ల ఎందుకు అంత శ్రద్ధ చూపటం లేదు?

ఎట్టకేలకు అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. జనవరి 22న ఆ కార్యక్రమ కోసం ప్రధాని నరేంద్ర మోడీ దేశం నలుమూలలా ఎంతలా తిరిగిందీ, ఎన్ని పొర్లుదండాలు పెట్టిందీ, ఎక్కడ ఎన్ని మొక్కులు మొక్కిందీ చూశాము. భక్తి శివుడి మీద చిత్తం చెప్పుల మీద అన్నట్లుగా లోక్‌సభ ఎన్నికలు కనిపిస్తున్నందున ఈ తాపత్రయాన్ని అర్థం చేసుకోవటం కష్టం కాదు. పోయిన దేశ ప్రతిష్ఠను, దానితో పాటు విదేశీ పెట్టుబడులను తీసుకువచ్చే పేరుతో అధికారానికి వచ్చిన కొత్తలో విదేశాలు తిరిగిన తీరు, చేసిన హడావుడి చూశాము. సరే ఎవరెన్ని విమర్శలు చేసినా ఖాతరు చేయని చరిత్రకెక్కిన పాలకుల సరసన చేరిన నరేంద్ర మోడీ రామాలయ ప్రారంభాన్ని ప్రభుత్వ-సంఘపరివార్ కార్యక్రమంగా మార్చివేశారు. మతానికి ప్రభుత్వానికి ఉన్న గీతను చెరిపివేశారనే విమర్శలను ఎదుర్కొన్నారు. ఎన్ని దేశాలు తిరిగినా, మన దేశ ప్రతిష్ఠను పెంచినట్లు ప్రచారం చేసుకున్నా చెప్పినంతగా పెట్టుబడులు రాలేదు. పలుకుబడి పెరుగుదలకు రుజువూ లేదు. మేడిన్, మేకిన్ ఇండియా, ఆత్మనిర్భరత సాకారం కాలేదు. ఇప్పుడు రామాలయం కోసం తిరిగినదానికి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు వస్తాయా? ఏం జరిగిందీ, ఎందుకు జరిగిందీ దేశమంతా చూసింది. ఏం జరగనుందో చూద్దాం!



ఎం. కోటేశ్వరరావు

రామాలయం మీద చూపిన శ్రద్ధ ప్రజల సమస్యల మీద నరేంద్ర మోడీ చూపారా? తమది పని చేసే ప్రభుత్వమని మోడీ, బిజెపి కూడా చెప్పుకుంటుంది. పదేళ్లలో అలాంటిదేమీ కనిపించలేదు. అచ్చే దిన్‌లో 'ఆకలో రామచంద్రా...' అన్న పరిస్థితిని అంగీకరిస్తూ సబ్సిడీతో కూడా జనాలు కొనుక్కోలేని స్థితిలో (లేకుంటే ఉచితంగా ఇవ్వాల్సిన పనేముంది) ఉన్నారన్న వాస్తవాన్ని గ్రహించి ఉచిత ఆహార ధాన్యాల అందచేత పథకాన్ని పొడిగించారు. కొన్ని అంశాల్లో మోడీ సర్కార్ ఎక్కడ లేని వేగాన్ని కనబరిచిన మాట వాస్తవం. బహుశా కనపడని శక్తి ఏదో నెడుతూ ఉండాలి. ఉదాహరణకు మూడు సాగు చట్టాలనే తీసుకుందాం. 2020 సెప్టెంబరులో 17న లోక్‌సభ, 20వ తేదీన రాజ్యసభ ఆమోదం, 27న రాష్ట్రపతి అంగీకారం, పది రోజుల్లో అంతా జరిగింది. వ్యవసాయం ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ రాష్ట్రాలను సంప్రదించలేదు. ఎంత వేగంగా చట్టాలను రుద్దారో ప్రతిఘటన కూడా అంతే తీవ్రంగా ఎదురైంది. రాష్ట్రపతి ఆమోదం పొందక ముందే సెప్టెంబరు 25న భారత బంద్‌కు పిలుపు ఇచ్చారు. వివిధ ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. రైతులను రాజధానిలో ప్రవేశించకుండా అడ్డుకోవటంతో నవంబరు 26 నుంచి రైతులు ఢిల్లీ శివార్లలో తిష్టవేశారు. చట్టాల అమలు మీద 2021 జనవరి 12 సుప్రీం కోర్టు స్టే విధించి, రైతుల చెబుతున్నదానిని వినాలంటూ ఒక కమిటీని వేసింది. అయినా రైతులు తగ్గలేదు. చివరకు నరేంద్ర మోడీ దిగివచ్చి క్షమాపణలు చెప్పి మూడు చట్టాలను వెనక్కు తీసుకుంటున్నట్లు నవంబరులో ప్రకటించారు. డిసెంబరు ఒకటిన పార్లమెంటులో రద్దు బిల్లుతో ఉపసంహరించుకున్నారు.

రైతులు ముందుకు తెచ్చిన కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత అంశంతో సహా కనీస మద్దతు ధరలు, సేంద్రీయ సాగు గురించి సిఫార్సులు చేసేందుకు 2022 జులై 18న కేంద్ర ప్రభుత్వం 26 మందితో ఒక కమిటీని వేసింది. కమిటీలో అత్యధికులు తాన తందాన వారే ఉన్నందున దానిలో చేరేందుకు...రైతుల ఆందోళనకు నాయకత్వం వహించిన సంయుక్త కిసాన్ మోర్చా తిరస్కరించింది. ఆ కమిటీలో వివిధ అంశాల మీద సిఫార్సులు చేసేందుకు మరో ఐదు ఉపకమిటీలు ఏర్పాటు చేశారు. ఇక్కడే అసలు కథ ప్రారంభం. చిత్రం ఏమిటంటే ఈ కమిటీ నివేదికకు నిర్దిష్ట కాలపరిమితి విధించలేదు. ఇంతవరకు అదేమి చేసిందో మనకు తెలియదు. గతేడాది జూన్‌లో ఉప కమిటీలు నివేదికలు సమర్పిస్తాయని చెప్పారు. తరువాత ఎలాంటి సమాచారమూ లేదు. సాగు చట్టాలను వేగంగా తెచ్చిన ప్రభుత్వం దీని నివేదిక పట్ల ఎందుకు అంత శ్రద్ధ చూపటం లేదు? గతంలో సుప్రీం కోర్టు కమిటీ వేసిన నివేదిక, ఆ సాగు చట్టాలను వెనక్కు తీసుకున్న తరువాత నాలుగు నెలలకు బహిర్గతమైంది. దానిలోని అంశాలు అంతకు ముందు ప్రభుత్వం చేసిన వాదనలు తప్ప మరొకటి కాదు. అందుకే రైతు సంఘాలు తిరస్కరించాయి. ప్రభుత్వం వేసిన కనీస మద్దతు ధరల కమిటీ నివేదిక లోక్‌సభ ఎన్నికలకు ముందే వస్తే అది రైతుల్లో చర్చకు దారి తీస్తుందన్న భయంతోనే కాలపరిమితి నిర్దేశించలేదు. కనీసం ముసాయిదా నివేదికలు కూడా సమర్పించలేదు. అది ఎప్పుడు వస్తుందో, ఏం సిఫార్సు చేస్తుందో ఆ పైవాడికే ఎరుక.

రామాలయ నిర్మాణం పూర్తిగాక ముందే ప్రారంభోత్సవం జరపటం గురించి శంకరాచార్యులు అభ్యంతరం తెలిపారు. మనం కొత్త ఇల్లు కట్టుకున్నపుడు పూర్తిగాక ముందే ప్రవేశ పూజలు చేసి తరువాత మిగతా పనులు చూసుకోవటంలేదా అని అనేక మంది సమర్థించారు. నిజమే, ఇదే పద్ధతి ఇతర వాటికి ఎందుకు వర్తింపచేయటం లేదు? తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని చెప్పుకొనేందుకు అక్టోబరు నాలుగవ తేదీన కేంద్ర ప్రభుత్వం బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. ఇంతవరకు బోర్డును ఏర్పాటు చేయలేదు, ఆఫీసు ఏర్పాటు లేదు. దీని ఏర్పాటుకు వివాదాలేమీ లేవు. వేల కోట్ల ఖర్చు కాదు. తదుపరి చర్యలు ఎందుకు లేవు? ముందు బోర్డును ఏర్పాటు చేస్తే దానికి నిర్దేశించిన కార్యకలాపాలు ప్రారంభమౌతాయి. పరిశోధనలకు అవసరమైన భూమి కేటాయించకపోతే రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేవటానికి వీలుంటుంది. చిత్రం ఏమిటంటే కనీస మద్దతు ధరల పంటల జాబితాలో పసుపు లేదు. పసుపు బోర్డు ఎప్పుడు ఏర్పడుతుంది, అది రైతులకు ఎలా మేలు చేస్తుంది? రాబోయే కాలానికే వదలివేద్దాం. అంతకు ముందు పసుపు రైతులకు బాండ్లు రాసిచ్చిన బిజెపి నిజామాబాద్ ఎంపీ అర్వింద్ సుగంధ ద్రవ్యాల బోర్డు విస్తరణ కార్యాలయాన్ని ఏర్పాటు చేయించి పసుపు బోర్డు కంటే ఇదే గొప్పదని చెప్పుకున్నారు. అది రైతుల్లో పేలకపోవటంతో పసుపు బోర్డు గురించి మరో అంకాన్ని ప్రారంభించారు.

ప్రకటనలు చేయటం మీద ఉన్న శ్రద్ధ అమలులో లేదని పదేళ్ల అనుభవం నిరూపించింది. రాష్ట్ర విభజన 2014 చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు నూతన రైల్వే జోన్ ఏర్పాటును పరిశీలించాలని ఉంది. ప్రత్యేక హోదా వాగ్దానంపై మడమ తిప్పిన ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వం దానికి బదులు ప్రత్యేక పాకేజి ఇస్తామంటూ కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరిణామం బిజెపి మీద తీవ్ర వ్యతిరేకతను పెంచింది. దాంతో 2019 ఫిబ్రవరి 27న లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్ర మంత్రి పియూష్ గోయల్ విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటన చేశారు. అంతకు ముందు బిజెపి రాష్ట్ర నేతలు కేంద్రానికి ఒక వినతి పత్రం ఇచ్చినట్లు, దాని మీద స్పందించినట్లు ప్రచారం చేశారు. వారు ఐదేళ్లు ఏం చేశారో తెలియదు. మరోసారి లోక్‌సభ ఎన్నికలు రాబోతున్నాయి.

ఇంతవరకు రైల్వే జోన్ ఏర్పడలేదు. అసలు నోటిఫికేషనే ఇవ్వలేదు. అదుగో ఇదిగో అంటూ చెప్పటమే తప్ప అడుగు ముందుకు పడలేదు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాల ఏర్పాటుకు స్థలం ఇవ్వలేదన్నారు. ఫలానా చోట ఇస్తామని చెప్పిన తరువాత దాని మీద నిర్ణయం తీసుకోలేదంటూ కాలం గడుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఇవ్వకపోతే జోన్ ఏర్పాటు చేసి యంత్రాంగాన్ని ఉంచే ఒదుకు విశాఖలో అద్దె భవనాలే దొరకవా? ఇచ్చిన స్థలంలో భవనాలు నిర్మించిన తరువాతే జోన్ ఏర్పాటు చేస్తారా? రాజకీయం గాకపోతే మరొకటేమైనా ఉందా ?

విశాఖ ముడసర్లోవలో ప్రతిపాదిత రైల్వేజోన్ ప్రధాన కేంద్రానికి 52.2 ఎకరాలు ఇస్తామని రాష్ట్రం ప్రతిపాదించింది. ఇంకా భూమిని గుర్తించాల్సి ఉందని, దాన్ని ఆమోదించాలని, ప్రాజెక్టు నివేదిక సిద్ధంగా ఉందని 107 కోట్ల రూపాయలను మంజూరు చేశామని డిసెంబరులో కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ లోక్‌సభలో తెలుగుదేశం ఎంపీ కె.రామ మోహన్ నాయుడు వేసిన ప్రశ్నకు సమాధానంలో చెప్పారు. 2023-24 బడ్జెట్‌లో పది కోట్లు కేటాయించి ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని కోరినట్లు మంత్రి వెల్లడించారు. జోన్ ఎప్పుడు ప్రారంభమౌతుంది, నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయన్న ప్రశ్నలకు సమాధానం లేదు. బిజెపి రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్ నరసింహారావు నెల రోజుల క్రితం మాట్లాడుతూ ముడసర్లోవ భూములను అధికారులు ఖరారు చేశారని, నిర్మాణ జాప్యం ఎందుకో అర్థం కావటం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి ఖరారులో చాలా ఆలశ్యం చేసిందన్నారు. విశాఖ జోన్ ప్రత్యేకత ఏమిటంటే ప్రధాన కార్యాలయం ఉన్న విశాఖ డివిజన్‌ను రద్దు చేసి మూడు ముక్కలుగా విడగొట్టి ఒక ముక్కను రాయగఢ్‌లో మరో ముక్కను ఖుర్దా, మూడో భాగాన్ని విజయవాడ డివిజన్‌లో విలీనం చేస్తారు. ఈ జోన్‌లో విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు ఉంటాయి. ప్రధాన కేంద్రంలో డివిజన్ లేని జోన్‌గా ఇది చరిత్రలో నిలుస్తుంది.

బిజెపి ఓట్ల రాజకీయంలో భాగంగా తెలంగాణ ఎన్నికలకు ముందు షెడ్యూలు కులాల ఉప వర్గీకరణ గురించి వాగ్దానం చేసింది. కానీ దానికి ఎలాంటి ఫలితమూ దక్కలేదు. అయిననూ ప్రయత్నించి చూడవలె అన్నట్లుగా ఈ అంశం మీద కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వర్గీకరణ అంశం సుప్రీం కోర్టులో ఏడుగురు సభ్యులున్న బెంచ్ విచారణలో ఉంది. లోక్‌సభ ఎన్నికల కోసం తప్ప ఈ కమిటీ ఏం చేస్తుందన్నది అనేక మందిలో ఉన్న సందేహం. ఎప్పటి నుంచో నడుస్తున్న ఈ సమస్య మీద దశాబ్దం క్రితం అధికారానికి వచ్చిన బిజెపి చేసిందేమిటి? అన్నది సమాధానం లేని ప్రశ్న. ఉభయ సభల్లో పూర్తి మెజారిటీ ఉన్నందున నిజానికి చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగ సవరణ చేసి అమలు చేసేందుకు పూనుకోవచ్చు. ఆ పని చేయలేదు. కాబినెట్ కార్యదర్శి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీ అధికార యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలను పరిశీలిస్తుందని చెబుతున్నారు. సుప్రీం కోర్టు తీర్పుకు కేంద్రం కట్టుబడి ఉంటుందా? ఉండేట్లయితే కమిటీ చేసే పనేమిటి? కోర్టు తీర్పు వ్యతిరేకంగా వస్తే ఏం చేస్తారు ? అందుకే దీన్ని ఓట్ల ఆకర్షణ కమిటీ అంటున్నారు.

★

అక్రమ వలసలు - విఫల అభివృద్ధి నమూనా

ఈ మధ్య షారూఖ్ ఖాన్ నటించిన బాలీవుడ్ మూవీ "డంకీ" విడుదల అయింది. నలుగురు స్నేహితులు లీగల్‌గా ఇంగ్లండ్ వెళ్లేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవుతాయి. దీంతో దేశ సరిహద్దుల గుండా అక్రమంగా ప్రయాణించి లండన్ వెళ్లాలనుకుంటారు. ఆ క్రమంలో వీళ్లు పడిన కష్టాలేంటనేది సినిమా ఇతివృత్తం.

దేశ సరిహద్దులగుండా అక్రమంగా ప్రయాణించడాన్ని డాంకీ ట్రావెల్ అంటారు. పంజాబ్‌లో దాన్ని డంకీ అని పిలుస్తారు. గుజరాత్, హరియాణా, పంజాబ్‌కు చెందిన చాలా మంది అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, యూరప్‌కు వెళ్ళేందుకు ఈ ప్రమాదకరమైన వలస మార్గాన్ని ఎంచుకుంటారు. ఈ మార్గంలో మానవ అక్రమ రవాణాకు సంబంధించి అంతర్జాతీయ నెట్‌వర్క్ పనిచేస్తుంటుంది. చాలా దేశాలు ఈ వ్యవస్థను నిర్మూలించినట్లు ప్రకటించుకున్నాయి కానీ, ఈ నెట్‌వర్క్ కొనసాగుతూనే ఉంది. అనేక మంది యువకులు అమెరికాకు వెళ్ళాలనే ఆశతో ప్రాణాలు కూడా పోగొట్టుకుంటున్నారు. "డంకీ ట్రావెల్" (అక్రమ రవాణా) సమస్య ఎంత తీవ్రంగా వుందనేది దీన్నిబట్టి అర్థమౌతుంది.



పి. సతీష్

సరిగ్గా ఈ సినిమాలో చూపించిన విధంగా ఫ్రాన్స్‌లో ఈ మధ్య ఒక సంఘటన జరగడం గమనార్హం. ఇటీవల ఫ్రాన్స్‌లో ఒక విమానాన్ని అక్రమ రవాణా అనే అనుమానంతో ఫ్రాన్స్ అధికారులు వారం రోజులు నిలిపివేశారు. దుబాయ్ నుండి బయల్దేరే ఈ విమానంలో 303 మంది భారత్ ప్రయాణీకులు మెక్సికోకు, అక్కడ నుండి అక్రమంగా అమెరికా వెళ్ళడానికి దళారీలకు భారీగా ముట్టచెప్పారు. విషయం తెలుసుకున్న ఫ్రాన్స్ అధికారులు ఆ విమానాన్ని తిరిగి ముంబైకి పంపివేశారు. గత కొన్నేళ్లుగా ఇలాంటి సంఘటనలు అడపా దడపా జరుగుతూనే ఉన్నాయి.

మేధో వలసలు

మేధో వలసలు ఎన్నో దశాబ్దాల కాలం నుంచీ ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాలకు పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన యువకులు విద్యాభ్యాసం కోసమో, ఉద్యోగాల కోసమో వలసలు వెళ్తుండడం మనం చూస్తున్నాం. దీన్నే బ్రెయిన్ డ్రైన్ (మేధో వలసలు)గా పరిగణిస్తారు. మన ప్రధాని ఈ మధ్య దీనిని బ్రెయిన్ గైన్ (మేధో బ్యాంక్)గా పరిగణించాలన్నారు. అయితే, ఇప్పుడు ఈ వలసలు అక్రమ మార్గాలలో కూడా కొనసాగుతుండటం ఆందోళనకరం. మన దేశానికి చెందిన సుమారు 1.8 కోట్ల మంది ప్రవాస భారతీయులు ప్రపంచంలోని అనేక దేశాల్లో నివసిస్తున్నారు. అయితే, వీరిలో చాలా మంది అక్రమ మార్గాలలో ఆయా దేశాలకు రవాణా అవుతుండడం శోచనీయం. తాజాగా 'ప్యూ' రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన ఓ అధ్యయనంలో అమెరికాలో నివసిస్తున్న అక్రమ వలసదారుల జనాభాలో భారతీయులు మూడో స్థానంలో ఉన్నట్లు తేలింది. వాషింగ్టన్‌కు చెందిన థింక్ ట్యాంక్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం అమెరికాలో ప్రస్తుతం 7.25 లక్షల మంది భారతీయలు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నివసిస్తున్నారని తేలింది.

2022 అక్టోబరు 1 నుంచి 2023 సెప్టెంబరు 30 మధ్య అమెరికాకు 96,917 మంది భారతీయులు ఎలాంటి అనుమతులు లేకుండా సరిహద్దు దాటేందుకు ప్రయత్నించి దొరికిపోయారని, వారిని అరెస్టు చేశామని అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఈ 97 వేల మందిలో 30 వేల మంది కెనడా సరిహద్దు దగ్గర దాదాపు 42 వేల మంది మెక్సికో సరిహద్దుల్లో పట్టుబడినట్లు తెలి పింది. జనవరి 2022లో అమెరికా-కెనడా సరిహద్దుల దగ్గర భారత దేశానికి చెందిన నలుగురు సభ్యులు మంచుకి గడ్డకట్టి చనిపోయారని, అమెరికా కెనడా బోర్డర్ దగ్గర నలుగురు కుటుంబ సభ్యులు బోటు మునిగిపోవడం కారణంగా చనిపోయారని వార్తలు కూడా వచ్చాయి. అలాగే బ్రిటన్‌లో దాదాపు లక్ష మంది భారతీయులు అక్రమంగా నివసిస్తున్నారు. మన దేశ ప్రజల అక్రమ రవాణాతో సంబంధం ఉన్న 2925 ట్రావెల్ ఏజెంట్లను గుర్తించామని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నప్పటికీ, వారిపై కఠిన చర్యలు లేవు.

వలసలు ఎందుకు పెరుగుతున్నాయి?

గతంలో మన దేశం నుంచి విదేశాలకు వెళ్లే ప్రవాస భారతీయులలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉండేవారు. వీరు మన దేశంలో రీసెర్చ్, ఇతర సదుపాయాలు లేని కారణంగా ఇతర దేశాల్లో చదువుకోడానికి లేదా పరిశోధన చేయడానికి వెళ్లేవారు. ఇప్పుడు వీరితో పాటుగా, మంచి ఉద్యోగాల కోసం, మెరుగైన జీవన ప్రమాణాల కోసం పెద్ద ఎత్తున మన దేశం నుండి ఇతర దేశాలకు వలసలు వెళ్తున్న వారి సంఖ్య పెరుగుతోంది.

విదేశాలకు అక్రమ వలసలు వెళ్లే వారిలో గుజరాత్, హరియాణా, పంజాబ్‌లకు చెందిన వారు ఉండడం గమనిస్తే గుజరాత్ అభివృద్ధి నమూనా డొల్లతనం మనకు అర్థం అవుతుంది. ఉద్యోగాల లేమి, కనీస జీతాలు లేకపోవడం, కఠిన ఆర్థిక పరిస్థితులు, సామాజిక అణిచివేత కారణంగా కూడా వలసలు పెరుగుతున్నాయి. ఇదిలా వుండగా 2023 హాండ్లీ ప్రైవేట్ వెల్త్ మైగ్రేషన్ రిపోర్ట్ వారి నివేదిక ప్రకారం 6,500 మంది ధనికులు (హెచ్.ఎన్.ఐ) మన దేశం నుండి విదేశాలకు తమ మకాం మార్చారు. ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం ప్రవాస భారతీయులు 2023లో 125 బిలియన్ డాలర్ల మొత్తాన్ని మన దేశానికి పంపించారు. ప్రభుత్వాలు అనేక పథకాల ద్వారా ప్రవాస భారతీయులను ఆకర్షించే పని చేపట్టాయి. వారికి కొన్ని ప్రత్యేకమైన రాయితీలు కూడా ప్రకటించాయి. అయితే, అక్రమ వలసలు పెద్ద ఎత్తున పెరుగుతుండడం ఆందోళనకరం.

మన దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి సంఖ్య క్రమేపీ తగ్గుతోందని ప్రభుత్వం చెబుతుండగా, కార్మికులు అక్రమ వలసలకు పాల్పడటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? కరోనా కారణంగా దెబ్బతిన్న మన దేశ ఆర్థిక వ్యవస్థ ఇంకా పూర్తిగా గాడిలో పడలేదు. ఆర్థికవేత్తలు మన దేశ ఆర్థిక వ్యవస్థలో నమూనా రికవరీ (ధనికులకు భారీ వృద్ధి వుండగా, కింది స్థాయి వారి పరిస్థితి దిగజారుతోందని) ఉందని చెప్తున్నారు. ప్రపంచ అసమానతల నివేదిక 2022 ప్రకారం భారతదేశంలో ఆదాయ, సంపద అసమానతలు తీవ్రతరం అయ్యాయి.

ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం కరోనా కాలంలో భారత దేశంలోని ధనికుల సంఖ్య 102 నుంచి 142 కు పెరిగింది. అది నేడు దాదాపు 170 కు చేరుకుంది. గౌతం అదానీ సగటు దినసరి ఆదాయం రూ. 1600 కోట్లు కాగా, మన దేశంలో 22 కోట్ల కష్ట జీవుల రోజువారీ ఆదాయం కేవలం రూ.375 మాత్రమే. భారత దేశంలో ఆదాయాల వ్యత్యాసం మునుపెన్నడూ చూడని దారుణ స్థితిలో ఉంది. పైస్థాయిలోని పది శాతం మంది 77 శాతం దేశ సంపదను కలిగి ఉన్నారు. జనాభాలో కింది సగానికి పైగా ఉన్న అట్టడుగు పేదలందరూ దేశ సంపదలో 3 శాతం వాటాను మాత్రమే కలిగి ఉన్నారు. మరో పక్క భారత దేశంలో ఉన్న 86 శాతం కుటుంబాల నికర ఆదాయం పడిపోయింది. 80 కోట్ల మంది ప్రభుత్వం ఇస్తున్న 5 కేజీల తిండి గింజలు కోసం ఎదురు చూసే పరిస్థితి ఉంటే, వారు పేదరికం నుంచి ఎలా బయటబడినట్లు? ప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా దేశంలో 21 శాతం పైబడి (34.6 కోట్ల) పేదలు ఉండడం గమనార్హం!! ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కోసం దరఖా స్తు చేసుకున్న వారిలో 14 శాతం మందికి సంవత్సరకాలంలో సగటు పని దినాల్లో పని చేసే అవకాశం లేకుండా పోయింది.

నిరుద్యోగ సమస్య నేడు చాలా జఠిలంగా మారింది. యువకుల్లో నిరుద్యోగిత తారా స్థాయికి చేరింది. వియత్నాం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో లేబర్ పార్టిసిపేషన్ 70 శాతం నుండి 80 శాతం ఉంటే, మన దేశంలో అది గరిష్టంగా 58 శాతం మాత్రమే. మహిళా కార్మికులలో ఇది 37 శాతం ఉంది. కోట్లాది కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదు. గుజరాత్‌లో కనీస వేతనం కేవలం రూ. 220.30 మాత్రమే. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఉన్న కేరళ రాష్ట్రంలో అది రూ. 726.80. నేడు గ్రామీణ భారతంలో 65 శాతం ప్రజలు ఆధారపడే వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంది. పెద్దనోట్ల రద్దు, జి.ఎస్.టి అసమగ్ర అమలు వంటి వాటి కారణంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. దీని మూలంగా లక్షలాది మంది కార్మికులు దేశంలో అంతర్గతంగా వలస బాట పట్టారు.

ఇకనైనా ప్రభుత్వం ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టాలి. ఆదాయ, సంపద అసమానతలు తగ్గించాలి. కార్పొరేట్లపై పన్నులు వేసి, సామాన్యులకు ధరాభారం నుంచి ఉపశమనం కల్గించాలి. గ్రామీణ భారతంలో నెలకొని ఉన్న సంక్షోభాన్ని రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలి. పంటలకు కనీస మద్దతు ధర చెల్లించాలి. కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలి. విదేశాలకు అక్రమ రవాణా చేసే ట్రావెల్ ఏజెన్సీలను, దళారీలను కఠినంగా శిక్షించాలి. అప్పుడు అక్రమ వలసలను నియంత్రించేందుకు అవకాశం ఉంది.

/ వ్యాసకర్త ఎల్.ఐ.సి ఉద్యోగ సంఘ నాయకులు,
సెల్ : 9441797900 /

యువకుల్లో నిరుద్యోగిత తారా స్థాయికి చేరింది. వియత్నాం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో లేబర్ పార్టిసిపేషన్ 70 శాతం నుండి 80 శాతం ఉంటే, మన దేశంలో అది గరిష్టంగా 58 శాతం మాత్రమే. మహిళా కార్మికులలో ఇది 37 శాతం ఉంది. కోట్లాది కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదు. గుజరాత్‌లో కనీస వేతనం కేవలం రూ 220.30 మాత్రమే. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఉన్న కేరళ రాష్ట్రంలో అది రూ. 726.80. నేడు గ్రామీణ భారతంలో 65 శాతం ప్రజలు ఆధారపడే వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంది. పెద్దనోట్ల రద్దు, జి.ఎస్.టి అసమగ్ర అమలు వంటి వాటి కారణంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. దీని మూలంగా లక్షలాది మంది కార్మికులు దేశంలో అంతర్గతంగా వలస బాట పట్టారు.



కవిత్వం



ఆట కదా నితీషు...

ఆట కదరా బాసూ, ఆట కద నితీషు
ఆట కదరా నీకు సీయమ్ము పోస్టు
ఆట కదరా బాసూ..ఆట కదా నితీషు.
ఆట కదా జంపింగు, ఆట కదా డంపింగు
మధ్యలో షిఫ్టింగు ఆట నీకు.
ఆట కదా కూటమి, ఆట కదా కూరిమి
సీటుకై యూ టర్న్ ఆట నీకు
ఆట కదరా బాసూ, ఆట కద నితీషు.
ఆట కదా యుద్ధాలు, ఆట కదా గగ్గోలు
అంతలోనే పగ్గాలు ఆట నీకు
ఆట కదరా బాసూ, ఆట కద నితీషు
ఆట కదరా నీకు సీయమ్ము పోస్టు
బీహారు సీయమ్ము పోస్టు.

(గత పదేళ్ళలో ఐదు సార్లు పార్టీ కూటములు మార్చి మార్చి, 9వ సారి బీహార్ సి.ఎం గా పదవి చేపట్టిన జేడీయూ నేత నితీశ్ కుమార్‌ని ఉద్దేశించి 'మిథునం' సినిమాలో 'ఆట కదరా శివా' పాటకు పేరడీ)

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ., విజయనగరం.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

భూహక్కులు కల్పించాల్సిందే

గ్రేటర్ నోయిడాలో రైతుల పోరాటం పునఃప్రారంభం • వేలాదిగా చేరుకున్న అన్నదాతలు

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ : వేలాదిమంది రైతులు యోగి ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. భూహక్కులు కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ (జిఎన్‌ఐడిఎ) కార్యాలయం ఎదుట రైతులు మళ్లీ పోరాటాన్ని ప్రారంభించారు. గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ (జిఎన్‌ఐడిఎ) లిఖితపూర్వక హామీని అమలు చేయాలని ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు కల్పిస్తామని, ఇతర డిమాండ్‌లతో అథారిటీ గత ఏడాది సెప్టెంబర్ 16న లిఖితపూర్వక ఒప్పందం చేసుకుంది. అయినప్పటికీ, గత నాలుగు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకోలేదు.

సర్కిల్ ధరల సవరణ, అధిక పరిహారం, భూ నిర్వాసితులకు 40 చదరపు మీటర్ల ఇళ్ల స్థలాలు, బాధిత కుటుంబాలకు ఉపాధి, 10% అభివృద్ధి చేసిన భూములు తిరిగి ఇచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని రైతులు ప్రకటించారు. సాగుదారులకు భూమిపై హక్కు కల్పించడంలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు విఫలమయ్యారని విమర్శించారు. యోగి ప్రభుత్వం హామీలు అమలు చేసే వరకు ఎంపీ, ఎమ్మెల్యేలు, బిజెపి నాయకులను గ్రామాల్లోకి రానివ్వబోమని ప్రకటించారు.



గ్రేటర్ నోయిడా కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పోరాటాన్ని ఉద్దేశించి ఎఐకెఎస్ నాయకులు పి కృష్ణప్రసాద్, సమాజ్ వాదీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ భట్టి, కాంగ్రెస్ నాయకులు అజయ్ చౌదరి, ఎఐకెఎస్ సభ్యుడు పుష్పేంద్ర త్యాగి, సికెసి సభ్యుడు, డాక్టర్ రూపేష్ వర్మ తదితరులు మాట్లాడారు. వేలాదిమంది మహిళలు, యువకులు పాల్గొన్నారు. నిరవధికంగా ఆందోళన కొనసాగిస్తామని రైతులు తెలిపారు. రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు అన్ని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని అన్నదాతలు కోరారు.

కౌలు రైతుకు మిగిలేది కష్టమే..

- ఏటా పెరుగుతున్న పెట్టుబడి
- విత్తనాలు, ఎరువుల ధరలు రెట్టింపు
- సకాలంలో అందని రుణాలు



ప్రజాశక్తి - రాజోలు (కోనసీమ)

దాళ్వా సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యారు. వరి సాగు చేసే రైతులకు వాతావరణం అనుకూలంగా ఉంది. ఇంత వరకూ బాగున్నా.. పెట్టుబడుల విషయానికొచ్చేసరికి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గతంతో పోల్చితే అన్ని ధరలూ పెరిగి పోవడంతో రైతులు వ్యవసాయం చేసేందుకు భయపడుతున్నారు. రెండేళ్లకే ఇప్పటికే పెట్టుబడుల్లో భారీ వ్యత్యాసం రావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం కొన్న అవే రకం ఎరువులు, విత్తనాలు ధరలు ఆకాశాన్నంటాయి. కూలి రేట్లు అమాంతం పెరిగిపోవడంతో రైతు వ్యవసాయం చేసేందుకు వెనుకడుగు వేస్తున్నాడు. ఇంత ఖర్చు పెట్టి పొలంలో దిగితే సాగు చేసిన నాటి నుండి ఫల సాయం చేతికి అందే వరకు రైతుకు కంటి నిండా కునుకు ఉండదు. రూ.వేలల్లో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో చీడ పీడలు, ప్రకృతి వైపరీత్యాలు వల్ల నష్టపోయిన రైతులు ఎంతో మంది ఉన్నారు. జిల్లాలో ఆయకట్టు దిగువన ఉన్న సముద్ర తీరంలోనే కాక ఎగువన ఉన్న బ్యారేజ్ సమీపంలోని పంట పొలాలు సైతం ముంపు బారిన పడుతున్నాయి. దీనివల్ల దాళ్వా సాగు రైతులకు జూదంగా మారిపోయింది. ఈ ఏడాది జిల్లాలో 1,83,000 ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతోందని అంచనా.

రెట్టింపైన పెట్టుబడులు

గడిచిన రెండేళ్లతో పోలిస్తే వ్యవసాయ పెట్టుబడులు రెట్టింపయ్యాయి. డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో వ్యవసాయ రంగంపై దీని ప్రభావం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. రెండేళ్ల క్రితం ఒక ఎకరం పొలంలో వరిసాగు చెయ్యాలంటే రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకు పెట్టుబడులు పెట్టేవారు. ప్రస్తుతం ఎరువుల ధరలు, ట్రాక్టర్ అద్దెలు, పురుగు మందులు ధరలు, కూలీలకు ఇచ్చే కూలిరేట్లు పెరగడం వల్ల ఒక ఎకరా వరిసాగుకు రూ.29 వేల నుంచి రూ.30 వేల వరకూ వెచ్చించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. గతంలో ట్రాక్టర్ గంట సేపు దున్నడానికి రూ.800 తీసుకునేవారు. ప్రస్తుతం డీజిల్ రేట్లు పెరగడంతో గంటకు రూ.1100 నుండి రూ.1200 తీసుకొంటున్నారు. రెండేళ్ల క్రితం కంటే ఇప్పుడు డిఎపి, గ్రోమోర్ 28-28-0, పొటాష్ వంటి ఎరువులపై ఒక్క బస్తాకు రూ.200 నుండి రూ.300 వరకు పెరగడంతో పాటు కూలీల రేట్లు పెరగడంతో పెట్టుబడులు అధికమవుతున్నాయి. ఎకరం పొలంలో వరి పంట బాగా పండితే 22 క్వింటాలు ధాన్యం దిగు బడులు వస్తాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు మిల్లర్లు ధాన్యం గ్రేడింగ్ నిర్ణయించి ధర నిర్ణయిస్తారు.

కౌలు రైతులకు మిగిలేదేమిటి..?

ఇక జిల్లాలో 75 శాతం మంది కౌలు రైతులే వాస్తవ సాగుదారులుగా ఉన్నారు. ఇప్పుడు పెరిగిన ధరలు వారిని ఆందోళనకు గురి చేస్తున్నాయి. పంట పండించినా మిగిలేది ఏమీ కనబడటం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. కౌలు రైతులు పంటకు సరాసరిన 15 బస్తాలు కౌలు కింద ఇవ్వాల్సి వస్తుంది. దిగుబడులు ఆశాజనకంగా లేక పోవడంతో కౌలు ఖర్చులు తీసివేస్తే ఎకరాకు వచ్చే ఆదాయం 21 నుంచి 28 వేల రూపాయలు వరకు మాత్రమే ఉండగా పెట్టుబడులు మాత్రం రూ.35 వేల వరకు అవుతోందనే భావన కౌలు రైతుల్లో కనిపిస్తోంది.

సాగు ఖర్చులు ఎకరాకు రూ.80 వేల పైనే

ఒక ఎకరా సాగు చేసేందుకు సార్వాకు దాదాపు రూ.38,700 దాకా ఖర్చులు అవుతాయి. దాళ్వాకు రూ.10 అదనంగా ఖర్చవుతోంది. ఆకుమడి, విత్తనాలు, ఎరువులకు రూ.1500, దమ్ముకి రూ.3600, లంకల బాగుచేతకి రూ.1000, ఊడ్పులు, ఆకుతీతకు రూ.4700, కలుపుమందు చల్లినందుకు కూలీ రూ.1200, కలుపుతీతకు, గడ్డికోతకి రూ.1000, ఎరువులు రెండు ధపాలకు రూ.5000, చిరు పొట్ట దశల్లో పొటాష్, గుళికలకు రూ.1200, పురుగుమందు స్ప్రేయర్లు, నాలుగుసార్లకు రూ.11 వేలు, ఎలుకల నివారణకు రూ.500, కోతమిషన్, ట్రాక్టర్‌కు రూ.6 వేలు, ధాన్యం ఆరబోత, పట్టుబడికి రూ.2 వేలతో కలిపి 38,700 అవుతుందని జిల్లా కౌలు రైతు సంఘాలు అంచనా వేశాయి. రెండు పంటలకు కలిపి మొత్తం రూ.87,400 వరకు ఖర్చులు అవుతాయని అంచనా వేశారు. ఇక కౌలు రెండు పంటలకు మెట్ట ప్రాంతంలో రూ.35 వేలు వరకు, డెల్టా ప్రాంతంలో ఇంకా ఎక్కువగా ఉంటుంది. పంట పొలాలలో దమ్ము చేసిన అనంతరం పొలాన్ని చదును చేసే ఖర్చులు కూడా పెరిగాయి. నారు వేసేందుకు, తీసేందుకు అయ్యే ఖర్చులు కూడా పెరిగాయి. ఇలా ఖర్చులు పెరుగుతున్నా వీటికి తగ్గట్టుగా పంటలకు గిట్టుబాటు ధర రాని పరిస్థితి ఉండటంతో ఆదాయం అంతంత మాత్రంగానే లభిస్తోంది. వరి కోత మిషన్‌కు గతేడాది గంటకు రూ.2300 ఉండగా ఇప్పుడు రూ.3300 చేరింది.

ఆరెస్సెస్, బిజెపి హిందువులకు శత్రువులు

అశోక్ వాజ్‌పేయి

త్రిసూర్: నిజమైన హిందూ మతానికి, విశ్వాసానికి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు ముప్పు అని హిందీ కవి అశోక్ వాజ్‌పేయి అన్నారు 'అంతర్జాతీయ సాహిత్య ఉత్సవంలో భారతదేశ భావజాలం' అనే అంశంపై అశోక్ వాజ్‌పేయి మాట్లాడుతూ నిమ్న కులాలకు చెందిన వారు తాము హిందూ మతానికి వెలుపల ఉన్నామనే భావనలో ఉన్నారని అన్నారు. అతివాద హిందుత్వం ఉన్నవారి వల్ల హిందూ మతానికి ముప్పు. గాంధీజీని ఏం చేశారనడానికి ఇదే నిదర్శనం. భారతదేశం, బహుళ జాతులతో కూడినది. భిన్నత్వంలో ఏకత్వమే దాని బలం. అయితే, బహుళత్వాన్ని విచ్ఛిన్నం చేసి హిందూ దేశంగా మార్చి ఏకీకృత రూపం ఇచ్చే ప్రయత్నం జరుగుతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం అది మత విద్వేషాలను రెచ్చగొడుతోంది. దేశాన్ని విద్వేషం నుండి కాపాడేందుకు సాహిత్యం కళల ద్వారా పోరాడేందుకు ప్రయత్నించాలని అన్నారు.సంప్రదాయ లౌకిక విలువలకు భిన్నంగా రామమందిరాన్ని నిర్మించారు. పార్లమెంటులో సన్యాసులు పూజలు చేయడం, రామమందిర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ప్రధాని పాల్గొనడం దీనికి సంకేతాలు. దేశానికి మూలస్తంభమైన మహాత్మాగాంధీని మరిచిపోయేలా చేయాలని చూస్తున్నారు. దీంతో గాంధీని, ఆయన ఆలోచనలను పదే పదే స్మరించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేరళ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు సచ్చిదానందన్ ఈ సాహితీ ఉత్సవానికి మోడరేటర్‌గా వ్యవహరించారు.

బెంగాల్‌లో సిఎఎను అనుమతించను : మమత

కొల్‌కతా : తాను ప్రాణాలతో ఉన్నంతకాలం పౌరసత్వ (సవరణ) చట్టం (సిఎఎ)ను పశ్చిమబెంగాల్‌లో అనుమతించనని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు.ఉత్తర దినాజ్‌పూర్ జిల్లా రాయ్‌గంజ్‌లో మంగళవారం జరిగిన ప్రజా పంపిణీ కార్యక్రమంలో మమతా ఈ వ్యాఖ్యలు చేశారు. 'లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి మళ్లీ సిఎఎ అంశాన్ని లేవనెత్తింది. నేను ప్రాణాలతో ఉన్నంత వరకూ పశ్చిమ బెంగాల్‌లో సిఎఎను అనుతించబోను' అని మమత తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో నివాసితులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేస్తుందనే వార్తలను ప్రస్తావిస్తూ 'ఇలాంటి కార్డులను అంగీకరించవద్దు. ఇది ఒక ఉచ్చు' అని మమతా బెనర్జీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

లౌకిక విలువలు కాపాడండి

- ప్రజలకు కేరళ సిఎం పినరయి విజ్ఞప్తి
- జాతిపితకు ఘన నివాళి

తిరువనంతపురం : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. గతంలో కంటే ఇప్పుడు శాంతిని, సామరస్యాన్ని కాపాడడం ఎంతో కీలకంగా మారాయని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన అభిప్రాయపడ్డారు. 'దేశంలో లౌకిక విలువలను కాలరాసేందుకు మతతత్వ శక్తులు ప్రయత్నిస్తున్నాయి. విభజనకు వ్యతిరేకంగా గాంధీ చేసిన హెచ్చరికలను మనం ఇప్పుడు గమనంలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. సమానత్వం కోసం సంఘటితంగా నిలవాలి. మహాత్మా గాంధీ ప్రాణాలను హరించిన మతోన్మాద శక్తుల కబంధ హస్తాల నుండి లౌకిక సామాజిక విలువలను కాపాడతామని మనమంతా ప్రతిజ్ఞ చేయాలి' అని పినరయి కోరారు.

కేరళ బిజెపి నేత హత్య కేసులో 15మందికి మరణశిక్ష

అలప్పూజ : బిజెపి నేత రంజిత్ శ్రీనివాసన్‌ను హత్య చేసిన కేసులో 15మందికి మరణ శిక్షను విధిస్తూ మావెలికారా అదనపు జిల్లా సెషన్స్ కోర్టు-1 మంగళవారం తీర్పు వెలువరించింది. న్యాయవాది, బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌ను 2021 డిసెంబరు 19న ఆయన నివాసంలో కుటుంబ సభ్యుల ఎదుటే హత్య చేశారు. అత్యంత అరుదైన కేసుల కేటగిరీలోకి ఈ హత్య వస్తుందంటూ న్యాయమూర్తి శ్రీదేవి 15మందికి మరణ శిక్ష విధించారు. అలప్పూజలోని వివిధ ప్రాంతాలకు చెందిన వీరందరూ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ), దాని రాజకీయ విభాగమైన సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ)కి చెందినవారే. అంతకుముందు రోజు అంటే డిసెంబరు 18 రాత్రి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఎస్‌డిపిఐ రాష్ట్ర కార్యదర్శి కెఎస్ షాన్‌ను హత్య చేయడంతో, అందుకు ప్రతీకారంగా రంజిత్ హత్య జరిగిందని విచారణాధికారులు తెలిపారు. షాన్ హత్యకు ముందు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తను ఎస్‌డిపిఐ సభ్యులు హతమార్చారు.

బిజెపితో పొత్తుండదు : అన్నాడిఎంకె

చెన్నయ్ : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపితో ఎలాంటి పొత్తు ఉండబోదని అన్నా డిఎంకె నాయకుడు డి.జయకుమార్ తెలిపారు. గత సంవత్సరం ఆగస్టులోనే ఎన్‌డిఎ కూటమి నుండి అన్నా డిఎంకె బయటకు వచ్చింది. రెండు కోట్ల మంది పార్టీ కార్యకర్తల మనోభావాలను, ఆకాంక్షలను గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. లోక్‌సభ ఎన్నికల కోసం సీట్ల సర్దుబాటుపై వివిధ పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని, దీనిపై సరైన సమయంలో ప్రకటన చేస్తామని జయకుమార్ చెప్పారు. సీట్ల సర్దుబాటుపై చర్చించేందుకు ఒక కమిటీని, ఎన్నికల ప్రచార కమిటీని అన్నా డిఎంకె ఏర్పాటు చేసింది.

కొనసాగుతున్న డోలీ కష్టాలు!

ప్రజాశక్తి -అనంతగిరి

మన్యంలో గర్భిణులు, రోగులకు అత్యవసర వైద్యానికి డోలి కష్టాలు తప్పడం లేదు. అనంతగిరి మండలం మారుమూల గిరిజన గ్రామాలలో తరచూ ఇటువంటి ఘటనలే పునరావృతమౌతూ, మన్యవాసులు అష్టకష్టాలు పడుతున్నా పట్టించుకునే దిక్కు లేదని వాపోతున్నారు. కనీస రోడ్డు సౌకర్యాలు లేకపోవడం, అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు మారుమూల గ్రామాలకు వెళ్లలేని పరిస్థితిలో రోగులను డోలి సాయంతో వైద్యం కోసం సమీప ఆసుపత్రులకు తీసుకెళ్లాలి. ఈలోగా అన్నీ సవ్యంగా సాగితే సరేసరి, లేకుంటే ప్రాణాలు పోయిన ఘటనలు అనేకం చోటుచేసుకుంటూనే ఉన్నాయి. తాజాగా మంగళవారం ఉదయం పెద్దకొట పంచాయతీ సిదుగులపాడు గ్రామానికి చెందిన జన్ని, కుమారికి పురిటి నొప్పులు రావడంతో, దుప్పటితో డోలికట్టి, బండరాళ్లలో ఇరుకైన కొండ మార్గంలో రెండు కిలోమీటర్లు మోసుకొచ్చి, మెయిన్ రోడ్డుకు తరలించారు అక్కడనుండి వైద్యం కోసం అనకాపల్లి జిల్లా కె కోటపాడు ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారు ఈనెలలోనే 20వ తేదీన పిన్నకోట పంచాయతీ రాసకిలం గ్రామానికి చెందిన అనారోగ్య పీడితుడు సూకూరు బాబూరావు, ఈనెల 22న అదే గ్రామానికి చెందిన సూకూరు, చిన్నాలమ్మ అనే గర్భిణిని వారి కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం డోలీ మోతలతో ఆసుపత్రులకు తరలించారు. డోలిమోతతో ఆసుపత్రికి తరలించే క్రమంలో సకాలంలో ఆసుపత్రికి చేరుకోలేని దుస్థితిలో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ తరచూ చోటుచేసుకుంటున్నాయి రోగిని తీసుకెళ్లిన డోలిలోనే, కొందరి మృతదేహాలను తిరిగి గ్రామాలకు తీసుకు రావాల్సిన దౌర్భాగ్య పరిస్థితులను ఉంచి గట్టెక్కించాలని గిరిజనం కోరుతున్నారు.

కాటన్ బ్యారేజీపై రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరంలోని కాటాన్ బ్యారేజీపై రాకపోకలను ఫిబ్రవరి 1 నుంచి పదిరోజుల పాటు నిలిపేయనున్నట్టు ఇఇ కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. ఈ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. బ్యారేజీ రోడ్డు మరమ్మతుల నిమిత్తం డిసెంబర్ నెలలో పనులు ప్రారంభించారు. ఈ పనులు ఇంకా పూర్తికాలేదు. దీంతో రాకపోకలను మరో పదిరోజుల పాటు నిలిపేస్తున్నట్టు ఆయన తెలిపారు. .

మరో హైజాక్ యత్నం భగ్నం

19 మంది పాక్ సిబ్బందిని రక్షించిన ఐఎన్‌ఎస్ సుమిత్ర

న్యూఢిల్లీ : 36 గంటల వ్యవధిలోనే మరొక హైజాక్ యత్నాన్ని భారత నౌకదళానికి చెందిన యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ సుమిత్ర భగ్నం చేసింది. పాకిస్థాన్‌కు చెందిన 19 మంది సిబ్బందిని రక్షించింది. మంగళవారం ఉదయం నౌకా దళం విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం ఈ నెల 29న ఇరాన్ జెండాతో ఉన్న చేపలు పట్టే నౌకను దక్షిణ అరేబియా సముద్రంలో హైజాక్ చేయడానికి 11 మంది సోమాలియా సముద్రపు దొంగలు ప్రయత్నించారు. నౌకలో ఉన్న 19 మంది సిబ్బందిని బందీలుగా చేసుకున్నారు. సమాచారం అందుకున్న భారత నౌక దళ అధికారులు గల్ఫ్ ఆఫ్ అడెన్ ప్రాంతంలో మోహరించివున్న ఐఎన్‌ఎస్ సుమిత్రను రంగంలోకి దించారు. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ఐఎన్‌ఎస్ సుమిత్ర హైజాక్ యత్నాన్ని భగ్నం చేసింది. 19 మంది సిబ్బందిని సురక్షితంగా విడిపించింది. 17 మంది సిబ్బందితో ఉన్న ఇరాన్ నౌకను సముద్రపు దొంగలు హైజాక్ చేయకుండా ఐఎన్‌ఎస్ సుమిత్ర నిరోధించిన సంగతి తెలిసిందే. ఈ రెండు సంఘటనలు కొచ్చికి పశ్చిమంగా సుమారు 850 నాటికల్ మైళ్ల దూరంలోని దక్షిణ అరేబియా సముద్రంలో సంభవించాయి.

కష్టాల్లో ఖజానా



- ఆదాయం అంచనా రూ.2.79 లక్షల కోట్లు
- డిసెంబరు నాటికి వచ్చింది రూ.1.88 లక్షల కోట్లే
- కేంద్రం నుంచి వచ్చిందీ సగమే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వార్షికాంతానికి చేరువవుతున్నా... రాష్ట్ర ఖజానా కష్టాలు మాత్రం తొలగడం లేదు. సొంత ఆదాయం తగ్గడం, కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లలో కోతలు, పెరుగుతున్న ఖర్చులు ఖజానాపై ఒత్తిడి పెంచుతోంది. ఈ కారణంగానే తొలి తొమ్మిది నెలల్లోనే రూ.90 వేల కోట్ల వరకు లోటు నెలకొంది. అప్పులు చేస్తున్నా, కేంద్రం నుంచి వస్తున్న నిధులు 50 శాతం వరకే ఉండడంతో దాని ప్రభావం ఎక్కువగానే కనిపిస్తోంది. తాజాగా రిజర్వ్‌బ్యాంకు వెల్లడించిన నివేదిక మేరకు ఏడాది చివరకు అంచనా ఆదాయాన్ని సాధించడం కష్టమేనన్న భావాన్ని ఆర్థికశాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరు నెలాఖరు వరకు నమోదైన ఆదాయ, వ్యయాలపై రిజర్వ్‌బ్యాంకు తాజాగా నివేదిక సిద్ధం చేసింది. 12 నెలల కాలానికి గానూ బడ్జెట్‌లో ఆమోదించిన గణాంకాలకు, డిసెంబరు వరకు వచ్చిన గణాంకాలకు మధ్య పొంతన లేదు. ఏడాదికి రూ.2,79,279 కోట్లు ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో పొందుపరచగా, తొలి తొమ్మిది నెలల్లో కేవలం రూ.1,88,862 కోట్లు వచ్చినట్లు తేలింది. ఇందులో సొంత పన్నుల ద్వారా వచ్చే ఆదాయం రూ.1,02,651 కోట్లుగా అంచనా వేయగా, ఇప్పటి వరకు రూ.91,136 కోట్లు మాత్రమే చేతికందింది. పన్నేతర ఆదాయం రూ.15,400 కోట్లకు గానూ, రూ.3,971 కోట్లు మాత్రమే వచ్చినట్లు తేలింది.

కేంద్రం నుంచి రావాల్సిన వాటిలో కోతలు

కేంద్రం నుంచి గ్రాంట్ల రూపేణా రావాల్సిన నిధుల్లో గణనీయంగా కోతలు పడడం ఖజానాకు సమస్యగా మారింది. ఏడాది మొత్తానికి రూ.46,836 కోట్లు వస్తుందని అంచనా వేసుకున్నప్పటికీ తొమ్మిది నెలల్లో కేవలం రూ.24 వేల కోట్లే రావడంతో అధికారులు కంగుతిన్నారు. చివరి మూడు నెలల్లో మరికొంత నిధులు వచ్చినప్పటికీ అవి అంచనా స్థాయిలో ఉండబోవని అధికారులు చెబు తున్నారు. రుణాలు కూడా అనుకున్న స్థాయి కన్నా ఎక్కువగానే సేకరించుకోవడం గమనార్హం. సంవత్సరం మొత్తానికి అన్ని రుణాలు కలిపి రూ.72 వేల కోట్లు సేకరించాలని నిర్ణయించగా, ఇప్పటికే రూ.69,716 కోట్లు సేకరించారు. రుణాల రూపేణా సేకరించిన మొత్తమే లోటుగా చూపిస్తున్నారు.

డిసెంబరు 31 నాటికి రాష్ట్ర ఖజానా పరిస్థితి (రూ.కోట్లలో)

విభాగం	బడ్జెట్ అంచనా	వచ్చిన ఆదాయం
ట్యాక్స్ ఆదాయం	1,02,651	91,136
నాన్ ట్యాక్స్ ఆదాయం	15,400	3,971
గ్రాంట్స్ ఇన్ ఎయిడ్	46,834	24,018
రుణాలు ద్వారా	72,022	69,716
మొత్తం(ఇతరాలతో)	2,79,279	1,88,862
విభాగం	**బడ్జెట్ అంచనా**	**చేసిన వ్యయం**
రెవెన్యూ వ్యయం	2,28,540	1,69,122
పెట్టుబడి వ్యయం	31,061	19,202
అంతర్‌రాష్ట్ర చెల్లింపులు	----	538
మొత్తం (ఇతరాలతో)	2,79,279	1,88,862
ఆదాయ లోటు	22,316	49,996
ద్రవ్య లోటు	54,587	69,716

పల్నాడులో రెచ్చిపోయిన వైసిపి శ్రేణులు

- 200 మంది కర్రలతో ప్రదర్శన.. దాడి


కర్రలతో హల్‌చల్ చేస్తున్న వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - క్రోసూరు (పల్నాడు జిల్లా)

వైసిపి ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో విమర్శలు చేసినందుకు ఆ పార్టీ శ్రేణులు రెచ్చిపోయారు. సుమారు 200 మంది కర్రలు చేతపట్టుకుని ప్రదర్శన చేపట్టారు. అడ్డుకోవాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం పీసపాడుకు చెందిన కంచేటి సాయి పెదకూరపాడు వైసిపి ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు సన్నిహితంగా మెలిగేవారు. ఎమ్మెల్యేతో విభేదాల కారణంగా ఆయన్ను వైసిపి నుంచి బహిష్కరించారు. దీంతో ఆయన టిడిపిలో చేరారు. ఫేస్‌బుక్ వేదికగా ఇసుక విషయంలో ఎమ్మెల్యేపై విమర్శలు చేశారు. దీనికి వైసిపి శ్రేణులు ప్రతివిమర్శలు చేశారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఆడుదాం ఆంధ్ర పోటీల్లో విజేతలకు బహుమతులు ఇచ్చేందుకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు క్రోసూరుకు వచ్చారు. ఆయన వెళ్లిపోయిన అనంతరం నాలుగు గంటల తర్వాత వైసిపి శ్రేణులు దాదాపు 200 మంది కర్రలు పట్టుకుని 20 నిముషాల పాటు హల్‌చల్ చేశారు. సాయికి అనుచరుడిగా ఉంటూ జనసేనలో చేరిన క్రోసూరుకు చెందిన కంభంపాటి రాము కన్సల్టెన్సీ కార్యాలయంపై దాడికి దిగారు. కంప్యూటర్, ఫర్నీచర్‌తోపాటు ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. అనంతరం నాలుగు కిలోమీటర్ల దూరంలోని పీసపాడుకు కర్రలతో ద్విచక్రవాహనాలపై తిరుగుతూ బీభత్సం సృష్టించారు. కంచేటి సాయి ఇంటి ఎదుట హెచ్చరికలు చేశారు. దాడిపై ఫిర్యాదు చేసేందుకు కంభంపాటి రాము కుటుంబీకులు క్రోసూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఎస్ఐ లేకపోవడంతో వెనుదిరిగారు. మరోవైపు దాడికి ముందు కంచేటి సాయి క్రోసూరులో ప్రెస్‌మీట్ పెట్టేందుకు వస్తుండగా బెల్లంకొండ అడ్డరోడ్డు వద్ద పోలీసులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు.



విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ జట్టుతో పోలీసు ఉన్నతాధికారులు

పోలీస్ కమాండో పోటీల విజేత ఆంధ్రప్రదేశ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

14వ అఖిల భారత పోలీస్ కమాండో కాంపిటీషన్స్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 22 నుంచి విశాఖ గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రంలో నేవిగేషన్, స్కిల్, ప్లానింగ్ అండ్ ప్రజెంటేషన్, ఫిజికల్, ఫైరింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 16 రాష్ట్రాల జట్లు, ఏడు కేంద్ర పోలీసు సంస్థల జట్లు నుంచి 597 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మంగళవారం జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఇంటెలిజెన్స్ బ్యూరో అడిషనల్ డైరెక్టర్ మహేష్ దీక్షిత్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీలు క్రీడాకారుల అంకితభావం, కృషి, పట్టుదలకు వేదికగా నిలిచాయన్నారు. గ్రేహౌండ్స్ అదనపు డిజిపి (ఆపరేషన్స్) రాజీవ్ కుమార్ మీనా మాట్లాడారు. కార్యక్రమంలో ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ పివి.సునీల్, జార్ఖండ్ ఎడిజిపి పివికె.ప్రసాద్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఎ.రవి శంకర్ అయ్యర్ పాల్గొన్నారు.

విజేతలు

ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు 300 పాయింట్లకుగాను 267.2 పాయింట్లు సాధించి ఓవరాల్ విజేతగా నిలిచింది. రెండో స్థానంలో మహారాష్ట్ర (252.9 పాయింట్లు), మూడో స్థానంలో రాజస్థాన్ (248.9 పాయింట్లు) నిలిచాయి. విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ జట్టులోని 11 మంది ఆటగాళ్లకు, ఇద్దరు మేనేజర్లకు ఒక్కొక్కరికీ రూ.ఐదు లక్షల నగదు ఇవ్వడంతో పాటు మూడు సర్వీస్ ఇంక్రిమెంట్లను వారి సర్వీసులో కలపనున్నట్టు గ్రేహౌండ్స్ ఆపరేషన్స్ డిఐజి ప్రవీణ్ ప్రకటించారు.

ఎ గ్రేడ్ సాధించిన డిస్కంలు

- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులకు అందించే సేవల్లో డిస్కంల పనితీరు మెరుగుపడిందని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ అన్నారు. విద్యుత్ వినియోగదారులకు అందించే సేవలపై 2022-23 ఆర్థిక సంవత్సరానికి డిస్కంల పనితీరుపై నివేదికను కేంద్ర విద్యుత్‌శాఖ మంగళవారం విడుదల చేసిందని ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో డిస్కంలు ఎ గ్రేడ్‌లో నిలిచాయని పేర్కొన్నారు. కార్యాచరణ, విశ్వసనీయత, కనెక్షన్లు ఇతర సర్వీస్లు, మీటరింగ్, బిల్లింగ్ వసూలు, తప్పులు సరిదిద్దడం, ఫిర్యాదుల పరిష్కారంలో జాతీయ స్థాయిలో ఎపిసిపిడిసిఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్ సంస్థలు గుర్తింపు పొందాయని తెలిపారు. మూడు డిస్కంల సిఎమ్‌డిలు ఐ పృథ్వీతేజ్, కె సంతోషరావు, డిస్కంల ఇంజినీర్లు, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. 2017-18లో 6.70 శాతంగా ఉన్న పంపిణీ నష్టాలను ఇప్పుడు 5.31 శాతానికి తగ్గించాయని పేర్కొన్నారు. నిరంతర నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందిస్తున్నాయని తెలిపారు. అర్బన్ ప్రాంతాల్లో నిరంతరం విద్యుత్ అందించే విషయంలో ఎపిఎస్‌పిడిసిఎల్-42, ఎపిఇపిడిసిఎల్-79.68, ఎపిసిపిడిసిఎల్-103.86 ర్యాంకులు సాధించాయని వివరించారు.

గాంధీజికి చంద్రబాబు నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధులు, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. ఉండవల్లిలోని తన నివాసంలో గాంధీ చిత్రపటానికి పూలు వేసి మంగళవారం నివాళులర్పించారు. గాంధీ వర్ధంతిని అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్న సందర్భంగా దేశం కోసం మహోన్నత త్యాగాలు చేసిన వారిని స్మరించుకుందామని తెలిపారు. బ్రిటీష్ వారిని పారద్రోలేందుకు జాతిపిత అనుసరించిన బాటలోనే నేడు పోరాటం చేసి రాష్ట్రంలో విధ్వంస పాలనకు ముగింపు పలకాలని పేర్కొన్నారు.

టిడిపి కార్యాలయంలో..

గాంధీ వర్ధంతి కార్యక్రమం టిడిపి కార్యాలయంలో జరిగింది. గాంధీ చిత్రపటానికి ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాల్వ శ్రీనివాసులు, నేతలు దారపనేని నరేంద్రబాబు, ఎవి రమణ, పరుచూరి కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టిడిపి నాయకుల కంపెనీలపై జగన్ దాడులు : వర్ల రామయ్య

తమ పార్టీకి చెందిన నాయకుల కంపెనీలపై దాడులు చేయించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అలవాటుగా మారిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయ ప్రత్యర్థుల కంపెనీలపై దాడులు చేయించి రూ.కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. పోలీస్, డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్‌తో కలిసి తమ పార్టీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై తప్పుడు కేసు నమోదు చేసి వేధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలిచ్చిన అధికారం, ప్రజాధనంతో జగన్ తన దురుద్దేశాలు, రాజకీయ కక్షసాధింపులు నెరవేర్చుకుంటున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాల్వ శ్రీనివాసులు విమర్శించారు. జగన్ ప్రభుత్వం ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో తమ పార్టీ అధినేత చంద్రబాబు ప్రతిష్టను దెబ్బతీయాలన్న దురుద్దేశంతోనే బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టును ఆశ్రయించిందని పేర్కొన్నారు.

'యానిమల్'పై నెటిజన్ల ఫైర్



బాలీవుడ్ నటుడు రణబీర్ కపూర్ నటించిన 'యానిమల్' చిత్రంపై ఇప్పటికే పలువురు విమర్శలు గుప్పించారు. ఈ చిత్రం ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కావడంపై నెటిజన్లు మండిపడుతున్నారు. మహిళల గౌరవాన్ని కించపరిచేలా ఉన్న ఈ చిత్రాన్ని ఎలా స్ట్రీమింగ్ చేశారు? తక్షణమే ఈ చిత్రాన్ని నిలిపేయాలని పోస్ట్ చేస్తున్నారు. ఓ నెటిజన్ తన పోస్టులో 'నేను యానిమల్ చిత్రం చూసి కలత చెందా. ఈ సినిమా భారతీయ మహిళలను కించపరిచేలా ఉంది. ఒక వ్యక్తికి ఒకే భార్య అన్న భావనకు ఈ చిత్రం భంగం కల్గిస్తోంది. ఈ సినిమా స్ట్రీమింగ్ ఆపండి." అని రాసుకొచ్చారు. మరో నెటిజన్ 'నయనతార నటించిన 'అన్నపూర్ణి' చాలా బాగుంది. అలాంటి సినిమాను నెట్‌ఫ్లిక్స్ తొలగించింది. కానీ.. యానిమల్ చిత్రాన్ని ఎందుకు తొలగించడం లేదు?' అని ప్రశ్నించాడు. దర్శకుడు సందీప్ వంగా తెరకెక్కించిన 'యానిమల్' చిత్రంలో రణబీర్ కపూర్, రష్మిక మందన్నా హీరోహీరోయిన్లుగా నటించారు. ఈ సినిమాలో నటనకుగాను రణబీర్‌కి ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు వరించింది.

'చిరు'కు వినూత్న అభినందనలు



పద్మవిభూషణ్ పురస్కారం పొందిన సందర్భంగా సినీనటుడు చిరంజీవికి ప్రవాస భారతీయుడు కుందవరపు శ్రీనివాస్ వినూత్నంగా అభినందనలు తెలిపారు. న్యూయార్క్ టైం స్క్వేర్‌పై చిరంజీవి ఫొటో ప్రదర్శించి తన అభిమానాన్ని చాటుకున్నారు.

విజయంపై పూర్తి నమ్మకం : సుహాస్



సుహాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'అంబాజీ పేట మ్యారేజి బ్యాండు'. ఫిబ్రవరి 2వ తేదీ ఈ చిత్రం రిలీజ్‌కు సిద్ధమవుతోంది. జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించారు. దర్శకుడు దుశ్యంత్ కటికినేని రూపొందించారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న సుహాస్ తాజాగా చిత్ర విశేషాలు ముచ్చటించారు. 'ఈ సినిమాకి ఎక్కువ రోజులు ప్రిపేర్ అయ్యాం. బ్యాండ్ కొట్టడం నేర్చుకున్నా. కథలో బాగా కనెక్ట్ అవ్వాలని రెండు సార్లు గుండు గీయించుకున్నా. రెండేళ్ల కష్టం సక్సెస్ రూపంలో మంచి ఫలితాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాం. మా టీమ్ అంతా స్క్రిప్ట్ మీద నమ్మకంతో వర్క్ చేశాం. ఈ సినిమాలో కులాల ప్రస్తావన ఉంటుంది కానీ సినిమా అసలు నేపథ్యం కులాల గురించి కాదు. మనుషుల మధ్య అహం ఎలాంటి అడ్డుగోడలు సృష్టిస్తుంది అనేది మెయిన్ పాయింట్. కథలోని చాలా సీన్స్‌కు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు' అని అన్నారు.

కుటుంబమంతా కలిసి చూసే సినిమా



కుటుంబ సభ్యులంతా కలిసి చూసే సినిమా 'హ్యాపీ ఎండింగ్' అని హీరోయిన్ అపూర్వరావ్ అన్నారు. హీరో యష్ పూరి హీరోగా నటించిన ఈ సినిమా ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. 'మాది ఒంగోలు. నాన్న ఉద్యోగరీత్యా గుజరాత్‌కు వెళ్లిపోయాం. అక్కడి రిలయన్స్ ఆయిల్ ఇండస్ట్రీస్‌లో నాన్న పనిచేసేవారు. నా బాల్యమంతా గుజరాత్‌లో గడిచింది. అక్కడి నుంచి కొన్నాళ్లు కువైట్ వెళ్లాం. అక్కడ ప్రైమరీ ఎడ్యుకేషన్ కంప్లీట్ చేశాను. తిరిగి భారతదేశం వచ్చాక గ్రాడ్యుయేషన్ చేసి కొంతకాలం ఉద్యోగం చేశాను. కొన్నాళ్లకు యాక్టింగ్ వైపుకు రావాలని నిర్ణయించుకుని హైదరాబాద్‌కు వచ్చేశాను. ఆడిషన్స్‌కు వెళ్లగా ఈ సినిమాలో నన్ను ఎంపికచేశారు. హ్యాపీ ఎండింగ్ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. అందరూ ఆదరించాలని కోరుతున్నా'. హమ్స్ టెక్ ఫిలింస్, సిల్లీ మాంక్స్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించాయి. యోగేష్‌కుమార్, సంజయ్‌రెడ్డి, అనిల్ పల్లా నిర్మాతలు. కౌశిక్ భీమిడి దర్శకత్వం వహించారు.

థియేటర్‌లోనే చూడండి



'బిగ్‌బాస్' ఫేమ్ సోహెల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్, కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎం.డీ పాషా నిర్మిస్తున్నారు. మేఘ లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రహ్మానందం, సందీప్ కిషన్, మంచు మనోజ్, రోషన్ కనకాల, దర్శకులు శ్రీకాంత్ ఓదెల, సాయి రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సోహెల్ మాట్లాడుతూ 'ఈ సినిమా నిర్మాత పాషా మధ్య తరగతి కుటుంబం నుంచే వచ్చారు. సినిమా అంటే ప్యాషన్‌తో చాలా హార్డ్ వర్క్ చేసి సినిమాని నిర్మించారు. మధ్యలో ఫైనాన్షియర్ ఇబ్బందులు పెట్టడంతో మా నాన్న రిటైర్మెంట్ పైసలు, నేను సంపాదించిన పైసలు ఇల్లు కొనుక్కుందామని ఉంచుకున్నవి అన్నీ ఈ సినిమాకు పెట్టాను. ఈ సినిమాతో నిర్మాతల కష్టాలు మరింతగా అర్థమయ్యాయి. ఈ చిత్రాన్ని థియేటర్‌లోనే చూడండి' అని అన్నారు.

నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి వాటిపై

పోరు ఉధృతం

• ప్రత్యర్థులపై ఇడి దాడులను ఆపాలి • గ్రామీణ బంద్‌కు మద్దతు • ఇవిఎంల రీ సీక్వెన్సింగ్ కోసం దేశ వ్యాపిత ప్రచారం

సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు

తిరువనంతపురం : అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమం లౌకికవాదానికి మృత్యు ఘంటికగా పరిణమించిందని సిపిఐ(ఎం) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆరాధనా స్థలాల చట్టం-1991ని అటకెక్కించి, కాశీ, మథుర వివాదాలను మళ్ళీ తెరపైకి తీసుకువచ్చే ప్రయత్నాలను అది తీవ్రంగా వ్యతిరేకించింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రత్యర్ధులను లక్ష్యంగా చేసుకుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇడిని, ధన బలాన్ని ప్రయోగించడాన్ని కేంద్ర కమిటీ తీవ్రంగా విమర్శించింది. మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని పార్టీ రాష్ట్ర శాఖలన్నిటికీ కేంద్రకమిటీ పిలుపునిచ్చింది. జనవరి 28-30 తేదీల్లో ఇక్కడ సమావేశమైన పార్టీ కేంద్ర కమిటీ మంగళవారం నాడిక్కడ ఈ కింది ప్రకటన విడుదలజేసింది.

అయోధ్యలో రామ మందిర ప్రారంభం

జనవరి 22న అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రభుత్వం, పాలనా వ్యవహారాలు, రాజకీయాల నుండి మతాన్ని వేరు చేసి చూడాలని నిర్వచిస్తున్న లౌకికవాద భావజాలానికి మృత్యు ఘంటికలు మోగించింది. ప్రధాని, యుపి ముఖ్యమంత్రి, యుపి గవర్నర్ నేరుగా జోక్యం చేసుకున్నారు. ఇదంతా ప్రభుత్వ ప్రాయోజిన కార్యక్రమంలా సాగింది. 'చేసిన ప్రతిన నెరవేర్చారు', 'నాగరికతా ప్రస్థానంలో గమ్యాన్ని చేరుకునేందుకు భారత్ యత్నం' వంటి పొగడ్తలతో ప్రధానికి భారత రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి శుభాభినందన సందేశాలు పంపారు. ప్రభుత్వానికి ఎలాంటి మతపరమైన అనుబంధం కానీ, ప్రాధాన్యత కానీ వుండరాదని భారత రాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది. భారత ప్రభుత్వ పాలనా వ్యవహారాలకు ఇది ప్రాథమిక సూత్రంగా ఉండాలని సుప్రీం కోర్టు పదే పదే ఉద్ఘాటించింది. వీటిన్నిటిని బాహాటంగా ఉల్లంఘిస్తూ ఈ మొత్తం కార్యక్రమం సాగింది.

రాజకీయ, ఎన్నికల ప్రయోజనాలే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముందుగా ఆర్ఎస్ఎస్, బిజెపి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాయి. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారానికి వీలుగా వివిధ ప్రాంతాల్లో బహిరంగంగా పెద్ద పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేశాయి. ఆ రోజు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాయి. ఉద్యోగులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వీలుగా అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను మధ్యాహ్నం 2.30గంటల వరకు మూసివేశారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థల కార్యాలయాలు, సంస్థలు, బ్యాంకులదీ అదే పరిస్థితి. ప్రతి రాష్ట్రం నుండి, పార్లమెంటరీ నియోజకవర్గం నుండి ఆలయాన్ని సందర్శించేలా ప్రజలను తరలించేందుకు పథక రచన చేశారు. ఇలా మార్చి వరకు అంటే ఎన్నికల వరకు సాగేలా ఏర్పాటు చేశారు.

అయోధ్య మినహా అన్ని మతపరమైన ఆరాధనా స్థలాల్లో 1947 ఆగస్టు 15 నాటి ముందున్న పరిస్థితే యథాతథంగా కొనసాగించాలని ఆదేశిస్తున్న ఆరాధనా స్థలాల చట్టం, 1991ని అటకెక్కిస్తున్నారన్న సంకేతాన్ని కూడా ఈ ఘటన ఇస్తోంది. అక్కడక్కడా న్యాయపరమైన లోపాయికారీ మద్దతుతో కాశీ, మధురలో వివాదాలను మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నారు. అయోధ్యపై తీర్పు ఇచ్చినందుకు ప్రధాని మోడీ, సుప్రీం కోర్టుకు కృతజ్ఞతలు తెలియచేశారు.

మతం అనేది వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించినది. తమకు నచ్చిన విశ్వాసాన్ని అనుసరించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఈ హక్కును గౌరవించాలన్నది సిపిఎం విధానం. అయితే, అదే సమయంలో ప్రజల మత విశ్వాసాలను రాజకీయ ప్రయోజనాల కోసం అలాగే ప్రభుత్వంతో మిళతం చేస్తూ, రాజకీయ లబ్ధికి దీనిని ఒక సాధనంగా దుర్వినియోగం చేసే ఎలాంటి యత్నాన్ని అయినా సిపిఎం గట్టిగా వ్యతిరేకిస్తుంది.

అసెంబ్లీ ఎన్నికలు

గతంలో రెండు విడతలుగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో బిజెపి విజయాలను నమోదు చేయగా, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణాల్లో కాంగ్రెస్ గెలుపొందింది.

హిందూత్వ ఓటును సంఘటితపరచడంతో పాటు కుల మనోభావాలను ప్రమాదకరమైన రీతిలో వాడుకోవడమే బిజెపి విజయాల్లో కీలకంగా వుంది.

ఇలా హిందూత్వ మతోన్మాద భావాలను సంఘటితపరచడాన్ని సూటిగా, నిక్కచ్చిగా ఎదుర్కొనాల్సి వుంది. హిందూత్వకు పోటీగా మెతక హిందూత్వను అనుసరించడం, లేదా తేలికగా తీసుకోవడం వంటి వైఖరులు ప్రజల్లో గణనీయమైన సెక్షన్లపై హిందూత్వ ప్రభావం బలపడేందుకే దారి తీస్తుంది. ఇది, సమాజంలో మరింతగా మతోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి, మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడానికి ఆర్ఎస్ఎస్, బిజెపిలకు, ఇతర హిందూత్వ సంస్థలకు ఇది అవకాశమిస్తుంది.

ఇండియా బ్లాక్

ఇండియా బ్లాక్ నుండి జెడి(యు) వీడి బిజెపితో కుమ్మక్కైనప్పటికీ, 'ఇండియా' బ్లాక్‌ను మరింత బలోపేతం గావించేందుకు, అలాగే మన రాజ్యాంగబద్ధమైన రిపబ్లిక్ లౌకిక, ప్రజాతంత్ర స్వభావాన్ని కాపాడుకునేందుకు బిజెపిని ఓడించే లక్ష్యంతో సిపిఎం తన కృషిని మరింత ముమ్మరం చేస్తుంది.

ఇండియా బ్లాక్ భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటుపై రాష్ట్ర స్థాయిలో చర్చలు సాధ్యమైనంత త్వరగా ముగించడంపై దృష్టి పెట్టాలి. వెంటనే ప్రజల జీవనోపాధులను మెరుగుపరిచేందుకు సంబంధించిన మౌలిక సమస్యలను, రాజ్యాంగ విలువలను పరిరక్షణకు సంబంధించిన అంశాలతో ప్రజల చెంతకు వెళ్లాలి.

కేరళ

నవ కేరళ సదస్ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా పూర్తి చేసినందుకు కేరళ ప్రజలకు, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి కేంద్ర కమిటీ అభినందనలు తెలియచేసింది. దేశంలో ఒక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం విశిష్టమైనది.

గవర్నర్ - ఆ పదవికి తగరు : ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వంపై, వరుసగా రాజకీయ దాడులు చేస్తూ, తన తప్పుడు ప్రవర్తనతో కేరళ గవర్నర్ అన్ని హద్దులను దాటేశారు. ఈ క్రమంలో తాజాది రోడ్డుపై ధర్నా చేయడం. శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థులు చేస్తున్న నిరసన ప్రదర్శనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ అవాంఛనీయమైన రీతిలో ధర్నాకు దిగారు. కేంద్ర భద్రతా బలగాలు తనకు రక్షణ కల్పించాలని కోరి, మరీ సంపాదించుకున్నారు. "రాజ్యాంగ యంత్రం కుప్పకూలింది " అంటూ ఆయన చేసిన ప్రకటనలు రాష్ట్ర ప్రభుత్వాన్ని బెదిరించేలా ఉన్నాయి. , వీటిని రాష్ట్ర ప్రజలు నిర్ద్వంద్వంగా తిప్పి కొడతారు.

ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పట్ల కాంగ్రెస్ పార్టీ ప్రతికూల, అప్రజాస్వామిక వైఖరినవలంబిస్తోంది. ముఖ్యమంత్రిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తోంది. కేరళ ప్రజలపై కేంద్రం చేస్తున్న దాడుల పట్ల మాత్రం మౌనం వహిస్తోంది. ఇది, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిజెపి పన్నే కుయుక్తులు, ఎత్తుగడలకు దోహదపడుతోంది.

పశ్చిమ బెంగాల్ : రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు సాగించి, బ్రహ్మాండమైన బ్రిగేడ్ ర్యాలీతో విజయవంతంగా ఇన్సాఫ్ యాత్ర ముగించినందుకు బెంగాల్ యువతకు కేంద్ర కమిటీ అభినందనలు తెలియచేసింది.

త్రిపుర : త్రిపురలో బిజెపి ఏక పార్టీ నిరంకుశ ప్రభుత్వం తన ఫాసిస్ట్ తీవ్రవాద దాడులను ఉధృతం చేసింది. దీంతో స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించడంపై తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. బిజెపి దాడుల్లో సిపిఎం కార్యకర్తలు లక్ష్యాలుగా మారుతున్నారు. దీన్ని ప్రతిఘటించాల్సి వుంది.

ఇడిని, ధన బలాన్ని దారుణంగా దుర్వినియోగం చేస్తున్న బిజెపి

అయోధ్య కార్యక్రమం నేపథ్యంలో తలెత్తిన మతపరమైన మనోభావాలను దారుణంగా దుర్వినియోగం చేస్తున్నా, ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయాలను సాధించినా 2024 ఎన్నికల్లో గట్టెక్కుతామన్న నమ్మకం బిజెపికి ఉన్నట్టు కనిపించడం లేదు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో తన విజయావకాశాలను మెరుగుపరుచుకోవాలన్న ఆశతో బిజెపి, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ఫిరాయింపులకు పాల్పడేందుకు, మాజీ ప్రత్యర్ధులతో పొత్తులు పెట్టుకోవడానికి అత్యంత దారుణమైన రీతిలో, దూకుడుగా ఇడిని దుర్వినియోగపరచడం, ధన బలాన్ని ప్రయోగించడం వంటివి చేస్తోంది. ఇంతకుముందు మహారాష్ట్రలో అది ఈ పని చేసింది. తర్వాత కర్ణాటకలో, ఇప్పుడు బీహార్‌లో అదే పని చేసింది. రాజకీయ లబ్ధి కోసం అనేకసార్లు తన అభిప్రాయాలను, విధానాలను మార్చుకోవడంలో అతి చెత్త రికార్డు కలిగి ఉన్న జెడి(యు)తో పొత్తు కలిసింది. ఈసారి బిజెపి మద్దతుతో నితీష్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా రికార్డు స్థాయిలో 9వ సారి ప్రమాణం చేశారు. బిజెపిని ఓడించిన ఈ రాష్ట్రాల్లోని ప్రజలు అటువంటి ఊసరవెల్లులకు తగిన గుణపాఠం చెబుతారు.

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)

2019 డిసెంబరు నుండి, మోడీ ప్రభుత్వం ఈ చట్టం కింద నిబంధనలను రూపొందించలేదు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని, మతపరమైన భావాలను మరింత రెచ్చగొట్టేందుకు ఈ చట్టాన్ని త్వరగా అమలులోకి తేవడం ద్వారా మత సమీకరణలకు మరింత పదును పెట్టడం ద్వారా ఎన్నికల్లో లబ్ధికి ముఖ్యంగా తూర్పు భారతంలో ప్రయోజనం పొందాలని చూస్తోంది.

కేంద్ర కమిటీ పిలుపు

- మోడీ ప్రభుత్వ విధానాలతో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రజల జీవనోపాధులపై దాడి వంటి వాటికి వ్యతిరేకంగా పార్టీ అన్ని రాష్ట్ర శాఖలు పోరాటాలను ఉధృతం చేయాలి.
- కేరళ పట్ల మోడీ ప్రభుత్వ వివక్షాపూరిత విధానాలకు నిరసనగా, రాష్ట్రాల హక్కులపై, సమాఖ్యవాదంపై దాడులను నిరసిస్తూ ఫిబ్రవరి 8న న్యూఢిల్లీలో కేరళ రాష్ట్ర ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ధర్నాతో పాటే, రాష్ట్రాల్లో అన్ని రాష్ట్ర కమిటీలు నిరసన కార్యక్రమాలు తప్పక నిర్వహించాలి.
- ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా నిరసన కార్యాచరణ నిర్వహించాలంటూ సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక ఇచ్చిన పిలుపునకు కేంద్ర కమిటీ సంఘీభావాన్ని ప్రకటించింది.
- ఇవిఎంల పనితీరుపై విస్తృతంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల్లో - ఓటింగ్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివిపిఎటిల్లో - ఎలక్ట్రానిక్ యూనిట్ల వరుస క్రమాన్ని తిరగదోడాలి. ఓటింగ్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివిప్యాట్‌లను ఒక క్రమంలో ఏర్పాటు చేయాలని పార్టీ దేశవ్యాప్తంగా ప్రచారం చేపట్టనుంది. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లతో కనీసం 50శాతం వివిపిఎటిలు సరిపోలాల్సి వుంటుంది.

కేరళలో అంగన్‌వాడీలకు వేతనాలు పెంపు

- పదేళ్లు సర్వీసున్నవారికి రూ.వెయ్యి, మిగిలిన అందరికీ రూ.500 చొప్పున పెంపుదల
- డిసెంబర్ 2023 నుంచే అమల్లోకి
- 60 వేల మంది సిబ్బందికి లబ్ధి

తిరువనంతపురం : కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం రాష్ట్రంలోని అంగన్‌వాడీలకు వేతనాలు పెంచినట్లు రాష్ట్ర ఆర్థిక మంత్రి బాలగోపాల్ తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని దాదాపు 60 వేల మంది అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. పదేళ్ల సర్వీసు దాటిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు రూ.1,000 చొప్పున పెంచినట్లు తెలిపారు. మిగిలిన వర్కర్లు, హెల్పర్లకు రూ.500 చొప్పున పెంచినట్లు చెప్పారు. జీతాల పెంపు 2023 డిసెంబరు నుంచి అమల్లోకి వచ్చింది. జీతాల పెంపుపై అంగన్‌వాడీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీలకు అత్యధిక జీతాలు ఇస్తున్న రాష్ట్రాల్లో కేరళ ఇప్పటికే ఒకటిగా ఉంది.



రాంచీలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం సొరేన్, నాయకులు

రాంచీకి హేమంత్ సొరేన్

- నేడు ఇడి విచారణ

రాంచీ : జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ రాష్ట్ర రాజధాని రాంచీ మంగళవారం చేరుకున్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాంచీలోని తన అధికారిక నివాసంలో తనను విచారించుకోవచ్చునని ఇడి అధికారులకు సోరేన్ ఇమెయిల్ చేశారు. ఈ నెల 27న సోరేన్ ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలో ఇడి అధికారులు ఎంత ప్రయత్నించినా సోరేన్‌ను విచారించలేకపోయారు. సోరేన్ కోసం ఢిల్లీలోని ఆయన నివాసం, జార్ఖండ్ భవన్, ఇతర ప్రదేశాలకు ఇడి అధికారులు సోమవారం వెళ్లినా ఫలితం లేకపోయింది. ఢిల్లీ వెళ్లిన సోరేన్ తన తండ్రి శిబూ సోరేన్‌ను కలుసుకోవడం కోసం రోడ్డు మార్గం ద్వారా సోమవారం అర్ధరాత్రి రాంచీకి చేరుకున్నారు.

మంగళవారం రాంచీలోని బాపు వాటిక వద్ద మహత్మా గాంధీకి నివాళి అర్పించారు. తరువాత తమ పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సతీమణి కల్పన సోరేన్ కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితిపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. 2020 నుంచి 2022 మధ్యకాలంలో నకిలీ పత్రాలను సృష్టించి గిరిజనుల భూమిని కొనుగోలు చేసి, విక్రయించినట్లు సోరేన్‌పై ఇడి అభియోగాలు మోపింది. ఈ కేసులో ఇప్పటి వరకూ ఎనిమిదిసార్లు ఇడి సోరేన్‌కు సమన్లు జారీ చేయగా, ఆయన గైర్హాజరయ్యారు.

సోరేన్ ఢిల్లీ నివాసంలో రూ.36 లక్షలు, ఎస్‌యువి స్వాధీనం

ఢిల్లీలో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌కు చెందిన నివాసం నుంచి రూ.36 లక్షలు నగదు, ఒక ఎస్‌యువి, కొన్ని విలువైన పత్రాలను ఇడి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దక్షిణ ఢిల్లీలోని 5/1 శాంతినికేతన్ నివాసంలో సోమవారం 13 గంటల పాటు ఇడి అధికారులు సోదాలు నిర్వహించారు.

ఒత్తిడితోనే నితీష్ వెళ్లిపోయారు

- మాకు ఆయన అవసరం లేదు
- మోడీ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచింది
- బీహార్ యాత్రలో రాహుల్



అరారియా జిల్లాలో భారత్ జోడో న్యాయ్ యాత్ర శిబిరం వద్ద మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాహుల్ గాంధీ

పాట్నా : ఇండియా కూటమి నుండి వైదొలిగి బిజెపితో చేతులు కలిపిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండి పడ్డారు. ఒత్తిడి కారణంగానే ఆయన ఇండియా వేదిక నుండి వెళ్లిపోయారని, ఆయన అవసరం తమకు లేదని అన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా బీహార్‌లోని పూర్ణియా జిల్లాలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగిస్తూ నితీష్‌పై చలోక్తులు విసిరారు. ప్రమాణస్వీకారం అనంతరం తన శాలువాను తీసుకునేందుకు నితీష్ మళ్లీ రాజ్‌భవన్‌కు వెళ్లారంటూ జోక్ చేశారు. దశాబ్ద కాలంలో నితీష్ ఐదుసార్లు విధేయతలు మార్చుకున్నారని గుర్తు చేస్తూ 'నితీష్ రావడం చూసి గవర్నర్ ఆశ్చర్యపడ్డారు. మళ్లీ రాజ్‌భవన్‌కు ఎందుకొచ్చారని ఆయన్ని ప్రశ్నించారు' అని వ్యంగ్యంగా అన్నారు. బీహార్‌లో మహా కూటమి సామాజిక న్యాయం కోసం పోరాడుతుందని రాహుల్ చెప్పారు. ఈ విషయంలో తమకు నితీష్ అవసరం లేదని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2020లో ఆమోదించిన వ్యవసాయ బిల్లులను చీకటి చట్టాలుగా వర్ణించారు. రైతుల నుండి భూములు లాక్కొని అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారని విమర్శించారు. వ్యవసాయ చట్టాలను ప్రతిఘటించి అలుపెరుగని పోరాటం చేసిన అన్నదాతలను అభినందించారు.

దేశంలో కులగణన ఆవశ్యకతను రాహుల్ నొక్కి చెప్పారు. 'మన సమాజంలో వెనుకబడిన తరగతులు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు ఉన్నారు. ఒబిసిల జనాభా అధికంగా ఉంది. ఒబిసిలు ఎంత మంది ఉన్నారని నేను ప్రశ్నిస్తే మీ దగ్గర సమాధానం లేదు' అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తోందని, ఈ అంశాన్ని తాను పార్లమెంటులో లేవనెత్తగలనని, ప్రధాని ఏమైనా చేస్తారని మాత్రం గ్యారంటీ ఇవ్వలేనని అన్నారు. ఎరువులు, విత్తనాలు పొందడానికి రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కోటీశ్వరులకు చెందిన రూ.14 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం రైతుల రుణాలను రద్దు చేయడం లేదని విమర్శించారు.

వైద్య సిబ్బందిలా వచ్చి ముగ్గురు పాలస్తీనియన్ల కాల్చివేత

- అండర్ కవర్ ఆపరేషన్ అంటూ ఇజ్రాయిల్ ప్రకటన

గాజా : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ నగరంలో ఒక ఆస్పత్రిలోకి వైద్య సిబ్బందిలా వచ్చిన ఇజ్రాయిల్ సైనికులు ముగ్గురు పాలస్తీనియన్లను కాల్చి చంపారు. ఐబిన్ సినా ఆస్పత్రిలో ఆ ముగ్గురు వ్యక్తులు నిద్రపోతుండగా, అండర్ కవర్ ఆపరేషన్‌లో భాగంగా ఈ హత్యలు జరిగాయని పాలస్తీనా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. దీనిపై ఇజ్రాయిల్ ఆర్మీ ఒక ప్రకటన చేస్తూ, హమస్ తీవ్రవాద సెల్‌కు చెందిన వారు ఆస్పత్రిలో దాగుండగా, తమ సైనికులు వారిని చంపేశారని తెలిపింది. ఇందుకు సంబంధించి సెక్యూరిటీ కెమెరా ఫుటేజీ ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది. దాదాపు 12మంది వ్యక్తులు ముసుగులు వేసుకుని ఆస్పత్రిలో తిరగడం కనిపిస్తోంది. వారిలో ముగ్గురు మహిళల దుస్తుల్లో వున్నారు. ఇద్దరు వైద్య సిబ్బంది దుస్తుల్లో వున్నారు. అసాల్ట్ రైఫిళ్లతో వారు అక్కడి వారిపై విరుచుకుపడడం కనిపిస్తోంది. ఇజ్రాయిల్ సైన్యం గాజా నుండి జెనిన్ వరకు మా ప్రజలపై వారు పాల్పడే నేరాలకు అంతం లేకుండా పోతోందని హమాస్ ఒక ప్రకటనలో పేర్కొంది.

కేంద్ర ఏజెన్సీల దాడి ఆపాలి

- అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల డిమాండ్
- సభ సజావుగా జరిగేందుకు సహకరించాలి : ప్రభుత్వం
- నేడు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం



అఖిలపక్ష సమావేశానికి హాజరైన నాయకులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు ముందు మంగళవారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ప్రభుత్వం ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశానికి 30 పార్టీల నుంచి 45 మంది నేతలు హాజరయ్యారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరిగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని ప్రభుత్వం కోరింది. కాంగ్రెస్, టిఎంసి, ఆర్‌జెడి, ఎస్‌పిలతో సహా కనీసం సగం మంది ప్రతిపక్ష నాయకులు 'కేంద్ర ఏజెన్సీల దుర్వినియోగం' అంశాన్ని లేవనెత్తారు. జెఎంఎం అధ్యక్షులు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వంటి నాయకులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడిని ఎత్తి చూపారు. బీహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్, హర్యానా కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడాపై కేంద్ర ఏజెన్సీల దాడిని ప్రతిపక్ష నేతలు ప్రశ్నించారు. అసోంలో రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రపై 'హింసాత్మక దాడి', రాష్ట్ర ప్రభుత్వ ఆంక్షల అంశాన్ని కాంగ్రెస్ ఎంపి ప్రమోద్ తివారీ లేవనెత్తారు. దేశంలో 'అలిఖిత నియంతృత్వం' ఉంది. 'దేశ రాజ్యాంగ చట్రం ప్రమాదంలో ఉంది. మేము దాని గురించి నిజంగా ఆందోళన చెందుతున్నాము. హేమంత్, లాలూ ప్రసాద్ వంటి ప్రతిపక్ష నేతల తర్వాత ఏజెన్సీల తీరుపై మేము కేంద్ర ప్రభుత్వం నుంచి సమాధానాలు కోరుతున్నాం' అని అన్నారు. హేమంత్ సోరెన్, రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ వంటి ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్రప్రభుత్వం సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వంటి దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలను సంప్రదించిన తర్వాత తాను ఈ అంశాలను లేవనెత్తుతానని తివారీ చెప్పారు.

'ప్రతిపక్ష నేతలపై ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య చాలా తీవ్రమైనది' అని ఆర్‌జెడి ఎంపి అమరేంద్ర ధరిసింగ్ అన్నారు. 'మేము మా ఆందోళనల గురించి ప్రభుత్వానికి, ముఖ్యంగా రాజ్‌నాథ్ సింగ్‌కు తెలిపాం. రాష్ట్రానికి ఆర్థికసాయం కోరుతూ మా సిఎం నిరసనలో కూర్చుంటారని చెప్పాం. దురదృష్టవశాత్తు, రాజ్‌నాథ్ సింగ్ కూడా నిర్దిష్ట హామీ ఏమీ ఇవ్వలేదు' అని టిఎంసి ఎంపి సుదీప్ బందోపాధ్యాయ అన్నారు.

ప్రజా సమస్యలపై చర్చించాలి : ఎలమరం కరీం

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో వివిధ రాష్ట్రాల్లోని సిబిఐ, ఇడి, ఐటి వంటి కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించుకుని బిజెపి చేస్తున్న రాజకీయ విధ్వంసక ఎత్తుగడలపై చర్చించేందుకు ప్రతిపక్షాలకు సమయం ఇవ్వాలని సిపిఎం రాజ్యసభ పక్షనేత ఎలమరం కరీం డిమాండ్ చేశారు. రాష్ట్రాల అధికారాలపై కేంద్రం దాడి, దేశాన్ని సమూలంగా మార్చడం, రైతులు, కార్మికుల ఆందోళనలు, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌పైనా చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం వివక్షకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 8న ఢిల్లీలో కేరళ ప్రభుత్వం ధర్నా చేస్తోందని కరీం తెలిపారు. పార్లమెంట్‌పై దాడి గురించి ప్రభుత్వం మౌనం వీడాలని సిపిఐ ఎంపి పి సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో శాంతియుత జీవితం ఎప్పుడు ఉంటుందో ప్రభుత్వం చెప్పగలదా? అని ఆయన ప్రశ్నించారు.

చర్చకు సిద్ధం : కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

ప్రతి అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. 'రాష్ట్రపతి ఉభయ సభలనుద్దేశించి ప్రసంగం, బడ్జెట్‌ను సమర్పించే ఈ ముఖ్యమైన సెషన్‌లో ప్రతిపక్ష ఎంపిలందరి సహకారం మేము కోరాం. నినాదాలు చేయవద్దని, ప్లకార్డులు తీసుకురావద్దని ప్రతిపక్ష ఎంపిలను మళ్లీ అభ్యర్థిస్తాం' అని అన్నారు. ఈ సమావేశంలో కేంద్ర రక్షణ మంత్రి, లోక్‌సభ ఉపనేత రాజ్‌నాథ్‌సింగ్, రాజ్యసభ నేత పీయూష్ గోయల్, సహాయ మంత్రులు అర్జున్‌రామ్ మేఘ్వాల్, మురళీధరన్, అనుప్రియ పటేల్ (అప్నాదళ్), కె సురేష్, ప్రమోద్ తివారీ (కాంగ్రెస్), సుదీప్ బందోపాధ్యాయ, సుఖేందు శేఖర్‌రాయ్ (టిఎంసి), టిఆర్ బాలు, తిరుచ్చి శివ (డిఎంకె), రాహుల్ షెవాలే (శివసేన), ఎలమరం కరీం, పిఆర్ నటరాజన్ (సిపిఎం), సంతోష్ కుమార్ (సిపిఐ), అమరేంద్ర ధారిసింగ్ (ఆర్‌జెడి), ఎస్‌టి హసన్ (ఎస్‌పి), రామ్‌నాథ్ ఠాకూర్ (జెడియు), జయదేవ్ గల్లా, కనకమేడల రవీంద్రకుమార్ (టిడిపి), భీశెట్టి సత్యవతి (వైసిపి), నామా నాగేశ్వరరావు, కె కేశవరావు (బిఆర్ఎస్), సస్మిత్ పాత్ర (బిజెడి), వైకో (ఎండిఎంకె), హస్నైన్ మసూది (నేషనల్ కాన్ఫరెన్స్) తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన విఒఎలు

(మొదటిపేజీ తరువాయి)

కాలపరిమితి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా వారి సభలను జయప్రదం చేసేందుకు డ్వాక్రామహిళలను తరలించడం రివాజుగా మారిందన్నారు.. పిడిఎఫ్ ఆధ్వర్యంలో అధికారుల దృష్టికి తీసుకెళ్తే అసలు విఓఎలు ప్రభుత్వానికి సంబంధంలేదని స్వయం సహాయక సంఘాలు పెట్టుకున్నవారని అధికారులు చెబుతున్నారని, అదే నిజమైతే మూడు సంవత్సరాల కాలపరిమితి ఉత్తర్వులను ప్రభుత్వం ఎలా విడుదల చేసిందని ఆయన ప్రశ్నించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగ్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విఓఎలు ఎంతోమంది మహిళలను నాయకులుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. పెట్టుబడిదారులకు రూ 12లక్షల కోట్లు రుణాలను మాఫీచేసిన పాలకులకు చిరుద్యోగులకు కనీసవేతనాలను అమలు చేసేందుకు ముందుకు రావడంలేదని విమర్శించారు. ఐదేళ్ల క్రితం మన ప్రభుత్వం వస్తుందని, మీ సమస్యలన్నింటికి పరిష్కారం చూపుతానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే చేసిన వాగ్దానాలను, ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. నాలుగేళ్లు ఎదురు చూసినా పట్టించుకోనందునే ఇపుడు రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. మఈ కార్యక్రమంలో వెలుగు విఓఎ(యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడారు. విఓఎలకు కాలపరిమితి ఉత్తర్వులను రద్దు చేయాలని, ప్రతి ఒక్కరికి పదిలక్షల రూపాయల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, రాజకీయ వేదింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధానకార్యదర్శి డి రమాదేవి, యానిమేటర్స్ అసంఘం నాయకులు సిహెచ్ రూపాదేవి, సిఐటియు నాయకులు సీతారాములు, నర్సింహరావు తదితరులు మాట్లాడారు.

అఖిల పక్షపార్టీల సంఘీభావం

వెలుగు యానిమేటర్స్ సమస్యలను పరిష్కరించాలని విజయవాడలోని ధర్నా చౌక్‌లో విఓఎలు చేపట్టిన 36 గంటల దీక్షలకు అఖిలపార్టీల సంఘాల నాయకులు కలిసి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, ఆమ్‌ఆద్మి పార్టీ నాయకులు ఫణిరాజు, ప్రత్యేక హోదా సాదన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ తదితరులు మద్దతును తెలిపారు. పొదుపు సంఘాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న విఓఎలను అకారణంగా తొలగించేలా వున్న ఉత్తర్వులను రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూడేళ్ల కాలపరిమితి జీఓను రద్దు చేస్తామని ఈ సందర్భంగా వర్లరామయ్య హామి ఇచ్చారు.

పార్లమెంట్‌లో నిలదీయండి

(మొదటిపేజీ తరువాయి)

కోశారని, ఆ తర్వాత చడీ చప్పుడు లేకుండా మోడీ చంకలో దూరారని ఫలితంగా రాష్ట్రానికి ఈ మూడు పార్టీలు కూడా అన్యాయం చేసినట్లేనన్నారు. ప్రత్యేక హోదా సాధించుకుంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ పార్లమెంట్‌లో ప్రత్యేకహోదా మీద మాట్లాడినందుకు ఆయన కంపెనీలపై ఇడి దాడులు చేయించారని , మోడీ సూచనలతో రాష్ట్రం నుంచి పరిశ్రమలు బయటకు పోయేలా రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా ఆ మూడు పార్టీలు మోడీ పల్లకి మోస్తున్నారని ఆయన ఆరోపించారు. మోడీ అంటే వణికి పోతున్నారని, ఇటువంటి పార్టీలు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడ లేవన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనా సమితి కన్వీనరు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని నయవంచన చేస్తుంటే నిలదీయలేని స్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. విభజన హామీలు అమలుతోనే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. మోడీ ప్రభుత్వానికి వచ్చే వారం జరుగనున్న పార్లమెంట్ సమావేశాలు ఆఖరివి అని అన్నారు. సమావేశాల నేపథ్యంలో హోదా, విభజనహామీల సాధన కోసం కేంద్రాన్ని గట్టిగా ప్రశ్నించాలని 36మంది ఎంపిలకు లేఖలు రాశామని ఆయన అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏ మాత్రం అన్యాయం జరిగినా ప్రధాని ఇంటి ముందు ఎంపిలు దర్నా చేయాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, పార్లమెంట్‌లో ప్రకటించిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి హామీలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా గురించి పార్లమెంట్‌లో మాట్లాడినందుకు తన కంపెనీపై ఇడి దాడులు జరిగాయని, అందుకే తాను రాజకీయాల నుంచి దూరంగా తప్పుకుంటున్నట్లు ఎంపి గల్లా జయదేవ్ ప్రకటించారన్నారు. . మోడీ ప్రత్యేక హోదా గురించి ప్రకటించలేదని, తిరుపతి సభలో మాట్లాడుతున్న సందర్భంలో ఎవరో చిట్టీ ఇస్తే చదివాడని కేంద్ర మ ంత్రి కిషన్ రెడ్డి చెప్పడం అన్యాయమని అన్నారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ , సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వై. వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు జయరామ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దడాల సుబ్బారావు, ఐద్వా నగర కార్యదర్శి శ్రీదేవి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెనుమత్స్య దుర్గా భవానీ, జిల్లా నాయకులు దోనేపూడి శంకరరావు, నగర కార్యదర్శి కోటేశ్వరరావు, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు ఫణిరాజ్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎ. అశోక్, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ , ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. సభ ప్రారంభంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు దీక్షలో పాల్గొన్న నేతలకు సంఘీభావం తెలిపారు.

ఇమ్రాన్‌ఖాన్‌కు పదేళ్ల జైలు శిక్ష

ఇస్లామాబాద్ : ప్రభుత్వ రహస్యాలను వెల్లడించారని ఆరోపిస్తూ నమోదైన కేసులో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు, ఆయన పార్టీ డిప్యూటీల్లో ఒకరికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ పాకిస్తానీ కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. ఇప్పటికే అవినీతి కేసులో మూడేళ్ల శిక్ష అనుభవిస్తున్న ఖాన్‌కు ఇది మరో ఎదురుదెబ్బ. ఈ తీర్పును అప్పీల్ చేసే హక్కు పార్టీకి వుందని పార్టీ ప్రతినిధి జుల్ఫికర్ బుఖారి తెలిపారు. ఫిబ్రవరి 8న పాక్‌లో పార్లమెంటరీ ఎన్నికలు జరగనుండగా ఈ రూలింగ్ వెలువడింది. ఈ ఎన్నికల్లో ఖాన్ పోటీ చేయడానికి వీల్లేకపోయినా ప్రజలను ప్రభావితం చేయగలిగే రాజకీయ శక్తిగా వున్నారు. ఈ పరిస్థితుల్లో తనపై పెట్టిన కేసులు, వాటిల్లో తీర్పులు చూస్తుంటే ఓటింగ్‌కు ముందు తనను పక్కకు నెట్టే కుట్రే ఇదని ఇమ్రాన్ ఖాన్ ఆరోపిస్తున్నారు. ఖాన్‌పై పెండింగ్‌లో వున్న 150కి పైగా కేసుల్లో సిఫర్ కేసు ఒకటి. అవిశ్వాస తీర్మానం ద్వారా తనను పదవీచ్యుతుడిని చేసిన తర్వాత ఒక ర్యాలీలో ప్రభుత్వ రహస్య పత్రాన్ని బహిరంగంగా ప్రదర్శించారని ఖాన్‌పై ఆరోపణలు వచ్చాయి.



మీ కోసం

పాలు కాచే ముందు ఆ గిన్నెలో కాసిన్ని నీళ్లు పోసి ఉంచాలి. కాసేపటి తరువాత ఆ నీళ్లు పారబోసి పాలు కాస్తే, అడుగున పేరుకుపోకుండా ఉంటుంది.

జీవన సౌరభం

లక్ష్యం అవకాశం కాదు.. ఎదురు చూడాల్సింది కాదు.. ఎన్నుకోవాల్సింది.

చిట్టి - పొట్టి



చిట్టి, పొట్టి పాపలిద్దరు
ఒక్క రోజునే పుట్టారు
చెట్టా పట్టా లేసుకుంటూ
జట్టుగ తిరుగుతుంటారు

పుట్టిన రోజుని ఎంతో గొప్పగ
కలిసే చేసుకుంటారు
తరగతిలో పిల్లలందరికి
బహుమతులను అందిస్తారు.

అందరితో కలిసి మెలిసి
ఆప్యాయతలను పంచేరు
ఆటలు ఆడి పాటలు పాడి
వేడుకలెన్నో చేస్తారు.

ఆ ఏడాది పుట్టిన రోజును
కొత్తగ చేయాలనుకున్నారు.
చిట్టి తండ్రి మొక్కలు తెస్తే,
పొట్టి నాన్న గోతులు తీసే ...

పాఠశాలలో ఓ పక్కన
వనమహోత్సవం పెట్టారు.
నేస్తాలకి మొక్కలు పంచి
గోతులలో నాటించారు.

ప్రతి మొక్కకు పేరును పెట్టి
చక్కగ పెంచాలన్నారు
ఎవ్వరి మొక్క ముందుగా పూస్తే
వారికి బహుమతి అన్నారు

పిల్లలందరూ ఎంతో శ్రద్ధగ
తమ తమ మొక్కలు పెంచారు.
అందరి మొక్కలు ఒక్క రోజునే
రంగుల పువ్వులు పూసాయి!


మిత్రులందరు సంతోషంగా
మొక్కల మధ్యన తిరిగారు.
చిట్టి పొట్టి బహుమతులీయగా
శుభాకాంక్షలు తెలిపారు !

ఉపాధ్యాయులు వరుసగ వచ్చి
పిల్లలను మెచ్చుకున్నారు
పుట్టిన రోజును కొత్తగా చేసిన
చిట్టిని పొట్టిని దీవించారు!

- కూచిమంచి నాగేంద్ర
91821 27880

నేను గీసిన బొమ్మ





కళ్లం కుశాల్‌రెడ్డి
3వ తరగతి
ప్రగతి సెంట్రల్ స్కూల్
ప్రగతి నగర్
హైదరాబాద్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

'ప్రేమ' చికిత్సకు పద్మ శ్రీ

పాటలు పాడడం ఆమెకిష్టం. గొప్ప గాయని కావాలని కలలు కన్నది. స్టేజ్ షోలు ఇచ్చింది. ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఇదే ప్రస్థానం కొనసాగితే ఆమె ఓ నేపథ్య గాయని అయ్యుండేది. కానీ ఇప్పుడామె ప్రముఖ వైద్యురాలిగా, వైద్యసేవలో నిరుపమాన సేవలు అందించినందుకు ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. బెంగళూరుకు చెందిన డా. ప్రేమా ధనరాజ్ గురించే ఇప్పుడు మనం చెప్పుకుంటోంది. గాయని కావాలనుకున్న ప్రేమ వైద్యురాలిగా ఎందుకు మారాల్సి వచ్చింది? ఆమె జీవితాన్ని మలుపుతిప్పిన ఆ సంఘటన ఏంటి?



బెంగళూరు జె.పి.నగర్‌లో నివసిస్తున్న 72 ఏళ్ల ప్రేమా ధనరాజ్ వెల్లూర్ క్రిస్టియన్ మెడికల్ కాలేజి (సిఎంసి) ప్రొఫెసర్‌గా, హెడ్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జరీ నిపుణురాలిగా విధులు నిర్వర్తించి 2010లో రిటైర్ అయ్యారు. 1980లో సిఎంసిలో హౌస్ సర్జన్‌గా మొదలైన ఆమె ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లు. వైద్యురాలిగా ప్రస్థానం మొదలుపెట్టి మూడు దశాబ్దాల కాలంలో అదే విభాగానికి అధిపతిగా మారడం అంత ఆషామాషీ కాదు. కానీ ప్రేమ సాధించారు. ఎంతో దీక్ష, పట్టుదలకు తోడు ఓ ప్రభావంత సంఘటన ఆమెని ఇంత ఉన్నత స్థితికి చేర్చింది.

సరిగ్గా 64 ఏళ్ల క్రితం అంటే ప్రేమకి 8 ఏళ్లప్పుడు అదే విభాగానికి చికిత్స కోసం వచ్చారు. ముఖమంతా 50 శాతం కాలిన గాయాలతో ఆస్పత్రికి వచ్చిన ప్రేమకు ఎన్నో శస్త్రచికిత్సలు చేశారు. 'చికిత్స తీసుకున్న ప్రతిసారీ భరించరాని నొప్పి వచ్చేది. 12 గంటలు ఏకధాటిగా చికిత్స తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. అంతలా బాధపడుతున్న నన్ను అమ్మ ఎంతో ఓదార్చేది. 'ఏడ్వకమ్మా.. నొప్పి తగ్గిపోతుందిలే. రేపు నువ్వు పెద్దాయ్యాక ఆ డాక్టరు సీట్లో కూర్చొందువు గాని. ఈ బాధతో నీ దగ్గరికి ఎవరు వచ్చినా వైద్యం చేద్దువు గాని' అని చెప్పేది. కానీ నా మనసులో వేరే ఆలోచనలు ఉన్నాయి. చిన్నప్పటి నుండి నేను పాటలు బాగా పాడేదాన్ని. పెద్ద గాయని కావాలని కోరుకున్నాను. స్కూల్లో పాటల పోటీల్లో నాకే ఫస్ట్ ప్రైజ్ వచ్చేది. అవన్నీ ఒక్కసారిగా నా కళ్ల ముందు ప్రత్యక్షమయ్యాయి' అని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు ప్రేమ.

ప్రమాదం ఎలా జరిగిందంటే..

చిన్నారి ప్రేమ ఒకసారి ఒక పాటల పోటీలో పాల్గొంది. 'ఆ కార్యక్రమంలో కాసేపు విరామం దొరికింది. కాఫీ తాగాలనిపించి స్టౌ వెలిగించాను. అంతే పెద్ద శబ్దం చేస్తూ స్టౌ అంతెత్తున పైకి ఎగిరింది. అందులోని కిరోసిన్ నా ముఖంపై పడింది. ఒక్కసారిగా నా ముఖమంతా భరించరాని వేడి. అదుపు చేయలేని స్థితిలో మంటలు వ్యాపించాయి. పక్కింటివారి చొరవతో ఎలాగోలా బయటపడ్డా ముఖమంతా కాలిపోయింది. మంటల వల్ల శరీరంపై కూడా లోతైన గాయాలు పడ్డాయి' అని ఆనాటి సంగతి గుర్తుచేసుకున్నారు ప్రేమ.



ఆమె తమ ఇంట నలుగురు పిల్లల్లో పెద్ద సంతానం. చిన్న చిన్న పనులు తానే స్వయంగా చేసుకునే అలవాటుతో ఆరోజు కాఫీ తనే పెట్టుకోవాలనుకుని ప్రమాదానికి గురైంది. ఆ ప్రమాదంతో ఆమె ముఖం కళావిహీనమైపోయింది. 'నా పెదవులు హృదయానికి తాకాయి. మెడ కుంచించుకుపోయింది. ఆకర్షణీయమైన నా ముఖమంతా మాంసముద్దలా మారిపోయింది. మంటలకు చర్మమంతా ఉడికిపోయింది. ఆ స్థితిలో బెంగళూరులో ప్రాథమిక చికిత్స ఇప్పించి, వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీకి తీసుకెళ్లారు. 14 శస్త్రచికిత్సలు చేశారు. ప్లాస్టిక్ సర్జరీ చేసి నా ముఖానికి కొత్త రూపం తీసుకువచ్చారు. మూడేళ్ల స్కూలు రోజులన్నీ ఆస్పత్రిలోనే గడిచిపోయాయి.

ఆ రోజు ఇప్పటికీ గుర్తే..

ఇంటికి వచ్చాక మా బంధువుల పిల్లలు రోజూ నాతో ఆడుకోవడానికి వచ్చేవారు. కొన్ని రోజులకు ఒక్కొక్కరుగా రావడం మానేశారు. ఎందుకు రావడం లేదని అడిగితే మాకు భయమేస్తోంది అని చెప్పారు. నాకేమీ అర్థం కాలేదు. అప్పుడు నా కంటే ఏడాది చిన్నవాడైన నా తమ్ముడు నా వంక అమాయకంగా చూస్తున్నాడు. ఆ తరువాత ఒకసారి ఆడుకుంటూ అమ్మ గదిలోకి వెళ్లాను అక్కడ నిలువెత్తు అద్దంలో నా ప్రతిబింబాన్ని చూసి భయంతో వెక్కివెక్కి ఏడ్చాను. ప్రమాదం జరిగిన నాటి నుండి అద్దంలో నా ముఖాన్ని చూసుకోకుండా ఇంట్లో జాగ్రత్తలు తీసుకున్నారు. అందుకే అంతలా ఏడ్చాను' అంటూ ఆ రోజు సంఘటనని గుర్తుచేసుకున్నారు ప్రేమ.



మానవ సేవలోనూ ముందున్నారు..

ప్రమాదం తరువాత స్కూలుకి వెళ్లినా పిల్లల హేళనలు, అవమానకర మాటలకు భయపడి ఇంటినుండే విద్యాభ్యాసం కొనసాగించారు. ఆ తరువాత 'అమ్మ ఇచ్చిన మానసిక ధైర్యంతోనే వైద్యవిద్య అభ్యసించాను'ని ఆమె ఎన్నో సార్లు చెప్పారు. అలా హుబ్లీ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ పూర్తిచేసి, సిఎంసిలో సర్జన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఒక పక్క వైద్యురాలిగా సేవలందిస్తూనే, తన సోదరి స్థాపించిన 'అగ్ని రక్ష' స్వచ్ఛంద సంస్థ ద్వారా 1999 నుండి ఇప్పటివరకు 25 వేల మంది కాలిన గాయాలకు ఉచిత శస్త్రచికిత్సలు అందించారు. విదేశాల్లోనూ ఆమె సేవలు కొనసాగాయి. ఇథియోపియాలో కాలిన గాయాలకు చికిత్స అందించే విభాగాన్ని నెలకొల్పిన మొదటి భారతీయురాలు ప్రేమ. కెన్యా, టాంజానీయా, నార్వే, ఇథియోపియా దేశాల్లో డాక్టరు విద్య అభ్యసించే వారికి చేయూత అందించారు. యుద్ధ సమయాల్లో బాధితుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స చేసేవారు. 'విదేశాల్లో సేవ చేసినందుకు 1998లో యుఎస్ ప్రభుత్వం ప్రకటించిన బహుమతి సొమ్ముతోనే 'అగ్ని రక్ష' స్థాపించామ'ని ఒక సందర్భంలో ఆమె చెప్పారు.

జీవితాన్ని మలుపు తిప్పింది..

'ఆ రోజు ఆ ప్రమాదం జరగకపోతే నేను ఇంత సాధించేదాన్ని కాదు. ఇది నేను కోరుకున్నదాని కంటే ఎక్కువ తృప్తినిస్తున్న జీవితం. నా ముఖంతో నేను ఇంత దూరం ప్రయాణిస్తానని అనుకోలేదు. ప్రమాదాలు జరిగినప్పుడు, ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు కుంగిపోకుండా నిలబడాలి. మన స్థితిని ఇతరులతో ఎప్పుడూ పోల్చుకోకూడదు. వాస్తవాన్ని ఎదుర్కొనేందుకు, జీవితంలో ముందుకు సాగిపోవడానికే నిరంతరం సిద్ధపడాలి' అంటున్న పద్మ శ్రీ ప్రేమ తన సంస్థ ద్వారా వైద్య సేవలతో పాటు బాధితులు మానసికంగా కుంగిపోకుండా కౌన్సిలింగ్ సెషన్లు కూడా నిర్వహిస్తుంటారు. ప్రమాదం నుంచి కోలుకొని, తన జీవితాన్ని చక్కదిద్దుకోవడమే కాక, ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న ప్రేమ జీవితం అభినందనీయం.

విద్యుత్ భారాలు రద్దు చేయండి

- సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు
- కొనసాగిన ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజా బ్యాలెట్‌తో సిపిఎం నాయకులు సిహెచ్ బాబూరావు, కార్యకర్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదలపై మోపిన వివిధ రకాల విద్యుత్ భారాలను రద్దు చేయాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. డిస్కములు ప్రతిపాదించిన ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ రెండో రోజైన మంగళవారం కూడా కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ నియంత్రణ మండలి(ఎపిఈఆర్‌సి) చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి అధ్యక్షతన ఎపిఈపిడిసిఎల్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమం జరిగింది. బాబూరావు మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్‌ను చౌకగా నిరంతరం అందిస్తామంటూ మూడు దశాబ్దాల క్రితం ప్రారంభించిన విద్యుత్ సంస్కరణలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజలపై భారాలు మోపుతూ రాయితీలకు కోతపెడుతున్న ప్రభుత్వం అదానీ, షిరిడి సాయి వంటి కార్పొరేట్ కంపెనీలకు సబ్సిడీలు ఇస్తోందని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా వ్యవసాయ పంపుసెట్లకు, గృహ వినియోగదారులకు మీటర్లు ఎలా బిగిస్తారని ప్రశ్నించారు. ఈ పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా దోచుకుంటున్నాయని విమర్శించారు. ఈ అంశంపై తమ పార్టీ నిర్వహించిన ప్రజాబ్యాలెట్‌లో పాల్గొన్న వేలాది మంది ప్రజలు మీటర్లను వ్యతిరేకించారని చెప్పారు. రాష్ట్ర విద్యుత్ రంగాన్ని అదానీపరం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో పాలకులకు బినామీ సంస్థగా షిరిడి సాయి కంపెనీ విద్యుత్ రంగంపై పెత్తనం చేస్తూ వినియోగదారులను దోపిడీ చేస్తోందన్నారు. పిపిఎలపై సమీక్ష చేస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు మరలా కొత్త పిపిఎలను చేసుకోవడం సరికాదన్నారు. విద్యుత్ రంగంలో జరుగుతున్న అవినీతిపై ఎపిఈఆర్‌సి విచారణ చేయాలని, లేదంటే స్వతంత్ర దర్యాప్తు సంస్థ ద్వారా విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఉంచి మరింత పటిష్టపరచాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ రంగ నిపుణులు బి తులసీదాస్ మాట్లాడుతూ విద్యుత్ నియంత్రణ మండలి అనుమతి ఇచ్చిన దాని కంటే డిస్కములు విద్యుత్ అధికంగా ప్రైవేట్ మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయని చెప్పారు. ప్రతి ఏటా కూడా ఇలా జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధిక ధరకు మరింత కొనుగోలు చేసే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. స్వల్ప కాలిక కొనుగోలుపై ఎపిఇఆర్‌సి మార్గదర్శకాలు విడుదల చేసిందని, దీనిని కూడా విద్యుత్ పంపిణీ సంస్థలు అమలు చేయడం లేదనే సందేహం తనకు ఉందన్నారు. ఎపిఎస్ఎల్‌డిసికి దేశంలోనే మంచి సమర్థత ఉందన్నారు. ప్రైవేట్ మార్కెట్‌కు ప్రయోజనం చేకూర్చేలా రాష్ట్ర ఎస్ఎల్‌డిసి అంచనాలను మారుస్తున్నారా అనే అనుమానం వ్యక్తం చేశారు. ప్రతి ఏటా విద్యుత్ మార్కెట్ పెరుగుతుందని, 8శాతంగా ఉన్న మార్కెట్ 25శాతానికి కు పెరిగిందన్నారు. కేంద్రప్రభుత్వం ఒక కమిటీ నియమించి మరీ ప్రైవేట్ మార్కెట్‌ను ప్రోత్సాహిస్తుందన్నారు. తాము ప్రజల తరపున ఉన్నామని చెబుతున్న రాష్ట్రప్రభుత్వం ప్రైవేట్ విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ఎస్ఎల్‌డిసిని ఎందుకు నియంత్రించడం లేదని ప్రశ్నించారు. ఎపిఇఆర్‌సి కూడా దీనిపై దృష్టి సారించాలని కోరారు. ఎఫ్‌పిపిసిఎ విధానం చాలా ఘోరమని ఆందోళన వ్యక్తం చేశారు. 30 విద్యుత్ యూనిట్లు వినియోగించే పేదలపై 21శాతం భారం మోపుతూ 400 యూనిట్లు దాటిన వారిపై 5శాతం మోపుతున్నారని వివరించారు. ట్రూఅప్ పేరుతో మరో అదనపు భారం మోపుతున్నారి తెలిపారు. నిరుపేదలను కొట్టి సంపన్నులకు రాయితీలు అందించే ఈ విధానం సరికాదన్నారు. ఎఫ్‌పిపిసిఎ, ట్రూఅప్ విధానం రద్దు చేయాలని, లేదంటే పేదలకు ఈ విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లు అవసరం లేదన్నారు. డిమాండ్‌ను తెలుసుకోవాలి అనుకుంటే డిస్ట్రిబ్యూటర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిలో అమర్చుకోవచ్చునని చెప్పారు. రాష్ట్రంలో 2వేల స్మార్ట్ మీటర్లు కొన్ని గ్రిడ్, ట్రాన్స్‌ఫార్మర్లకు అమర్చాని తెలిపారు. సాధారణ గృహ వినియోగదారులను, బడ్డీ కొట్టుల వంటి వారిని వేధించొద్దని సూచించారు. ఐఆర్‌డిఎ మీటర్ పనిచేస్తున్నా ప్రిపెయిడ్ మీటర్ ఎందుకు అమర్చుకోవాలని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారని వివరించారు. ఆర్‌డిఎస్ఎస్ విధానాన్ని అమలు చేస్తున్న కేరళ ప్రభుత్వం స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లను తిరస్కరించిందని చెప్పారు. స్మార్ట్ మీటర్లపై రాష్ట్రప్రభుత్వం ప్రయాస్ కంపెనీతో చేయించిన సర్వే నివేదికను ఇప్పించాలని కోరారు.

సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజలపై విద్యుత్ భారాలు రద్దు చేయాలని, స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లు బిగించొద్దని సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలోని ఎపిసిపిడిసిఎల్ ఎస్ఈ కార్యాలయం వద్ద ఆందోళన జరిగింది. సిపిఎం నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌లతో ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, విజయవాడ నగర నాయకులు బి రమణరావు, పి కృష్ణ, చిన్నారావు, శేఖర్, సిహెచ్ శ్రీనివాస్, కృష్ణమూర్తి, ఆదిలక్ష్మీ నిరసనలు చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని నినాదాలు చేశారు.

సూపర్-6లోనూ అదే జోరు

- న్యూజిలాండ్‌పై 214పరుగుల తేడాతో టీమిండియా గెలుపు
- ఐసిసి(అండర్-19) వన్డే ప్రపంచకప్



జొహన్నెస్‌బర్గ్: ఐసిసి(అండర్-19) వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా యువ క్రికెటర్లు దూసుకెళ్తున్నారు. లీగ్‌దశలో అపజయమెరుగని యువజట్టు సూపర్-6 లోనూ అదే జోరును కొనసాగిస్తోంది. మంగళవారం జరిగినసూపర్-6 తొలి మ్యాచ్‌లో ఏకంగా 214పరుగుల తేడాతో న్యూజిలాండ్ యువ జట్టును చిత్తుచేసింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 295పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. అనంతరం భారత బౌలర్లు చెలరేగడంతో న్యూజిలాండ్ జట్టు 81 పరుగులకే కుప్పకూలింది. తొలుత టీమిండియా ఓపెనర్ కులకర్ణి(9) నిరాశపరిచినా.. మరో ఓపెనర్ ఆదర్శ్ సింగ్(52) అర్ధసెంచరీతో రాణించాడు. ముషీర్ ఖాన్(131) సెంచరీకి తోడు కెప్టెన్ ఉదయ్ సహరన్(34) బ్యాటింగ్‌లో మెరిసారు. ముఖ్యంగా ముషీర్ లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ సాయంతో స్కోర్‌బోర్డును పరుగెత్తించాడు. ముషీర్ ఖాన్ 109బంతుల్లో 10ఫోర్లు, ఓ సిక్సర్ సాయంతో సెంచరీని పూర్తిచేశాడు. ఈ మ్యాచ్‌కు ముందు ముషీర్ ఖాన్ సోదరుడు సర్ఫరాజ్ ఖాన్ భారత సీనియర్ జట్టుకు ఎంపికైన మరుసటి రోజే ముషీర్ ఖాన్ అండర్-19 ప్రపంచకప్‌లో సెంచరీ సాధించడం మరో విశేషం. ఈ ప్రపంచకప్‌లో ముషీర్ ఖాన్‌కు ఇది రెండో సెంచరీ. న్యూజిలాండ్ బౌలర్లు మాసన్ క్లార్క్‌కు నాలుగు, రియాన్, ఎడ్వర్డ్, కమింగ్, తెవాటియాకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో న్యూజిలాండ్‌ను తొలినుంచే భారత బౌలర్లు కట్టడి చేశారు. నెల్సన్(10), జాక్సన్(19), కమింగ్(16), థామ్సన్(12) మాత్రమే రెండంకెల స్కోర్ చేయగా... సౌమీ పాండేకు నాలుగు, రాజ్ లింబని, ముషీర్ ఖాన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ముషీర్‌ఖాన్‌కు లభించగా.. ఫిబ్రవరి 2న జరిగే సూపర్-6 చివరి గ్రూప్ మ్యాచ్ పసికూన నేపాల్‌తో తలపడనుంది. నేడు జరిగిన ఇతర సూపర్-6 పోటీల్లో వెస్టిండీస్ జట్టు శ్రీలంకను, పాకిస్తాన్ జట్టు ఐర్లాండ్‌ను చిత్తుచేశాయి.

స్కోర్‌బోర్డు..

ఇండియా(అండర్-19) ఇన్నింగ్స్: ఆదర్శ్ సింగ్ (సి)ఓలీవర్ తెవాటియా (బి)కమింగ్ 52, కులకర్ణి (సి)ఎడ్వర్డ్ (బి)క్లార్క్ 9, ముషీర్ ఖాన్ (సి)కమింగ్స్ (బి)క్లార్క్ 131, ఉదయ్ సహరన్ (సి)కమింగ్స్ (బి)ఓలీవర్ తెవాటియా 17, ప్రియాన్షు మోలియా (సి)జోన్స్ (బి)క్లార్క్ 10, సచిన్ ధాస్ (సి)స్నేహిత్ రెడ్డి (బి)ఎడ్వర్డ్ 15, అభిషేక్ (బి)క్లార్క్ 4, నమన్ తివారి (నాటౌట్) 3, రాజ్ లింబని (నాటౌట్) 2, అదనం 18. (50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 295పరుగులు. **వికెట్ల పతనం:** 1/28, 2/105, 3/192, 4/219, 5/257, 6/275, 7/289, 8/289 **బౌలింగ్:** క్లార్క్ 8-0-62-4, రియన్ సర్జన్ 6-0-28-1, ఎడ్వర్డ్ 8-0-50-1, ఆస్కార్ జాన్సన్ 2-0-20-0, కమింగ్స్ 10-0-37-1, స్నేహిత్ 10-0-48-0, తెవాటియా 6-0-43-1.

న్యూజిలాండ్(అండర్-19) ఇన్నింగ్స్: టామ్ జోన్స్ (బి)రాజ్ లింబని 0, జేమ్స్ నెల్సన్(ఎల్‌బి)సౌమీ పాండే 10, స్నేహిత్ రెడ్డి (ఎల్‌బి)రాజ్ లింబని 0, లఛలన్ (బి)సౌమీ పాండే 5, జాక్సన్ (బి)ముషీర్ ఖాన్ 19, ఓలీవర్ తెవాటియా (బి)నమన్ తివారి 7, కమింగ్స్ (ఎల్‌బి)సౌమీ పాండే 16, థామ్సన్ (సి)అవనీశ్ (బి)కులకర్ణి 12, ఎడ్వర్డ్ (బి)ముషీర్ ఖాన్ 7, పోర్గాస్ (స్టంప్) అవనీశ్ (బి)సౌమీ పాండే 0, క్లార్క్ (నాటౌట్) 0, అదనం 5. (26.1ఓవర్లలో ఆలౌట్) 81పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/0, 3/13, 4/22, 5/39, 6/55, 7/69, 8/75, 9/76, 10/81 **బౌలింగ్:** రాజ్ లింబని 6-2-17-2, సౌమీ పాండే 10-2-19-4, నమన్ తివారి 5-0-19-1, ముషీర్ ఖాన్ 3.1-0-10-2, అర్షిన్ కులకర్ణి 4-0-13-1.

ఎపి శకటానికి తృతీయ బహుమతి

- సాంస్కృతిక పోటీల్లో మూడో స్థానం
- బహుమతులు అందజేత



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గణతంత్ర వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ప్రదర్శించిన శకటానికి, సాంస్కృతిక ప్రదర్శనలకు లభించిన బహుమతులను కేంద్ర మంత్రి అజయ్ భట్ చేతులమీదుగా రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, సమాచారశాఖ జెడి కిరణ్ కుమార్ స్వీకరించారు. పీపుల్స్ ఛాయిస్ విభాగంలో ఎపి శకటానికి, కళా ప్రదర్శనలకు తృతీయ బహుమతులు లభించాయి. రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్న శకటాలకు నిర్వహించిన జ్యూరీ ఎంపికలు, దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రజాభిప్రాయ ఎంపికలలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన శకటాలకు రిపబ్లిక్ డే క్యాంపులో రక్షణశాఖ మంగళవారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించింది. పీపుల్ ఛాయిస్ కేటగిరిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శకటానికి మూడో స్థానం లభించింది.

దీప్తికి 2వ ర్యాంక్

ఐసిసి మహిళల టి20 ర్యాంకింగ్స్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) తాజా టి20 మహిళల బౌలర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్పిన్నర్ దీప్తి శర్మ 2వ ర్యాంక్‌కు ఎగబాకింది. ఐసిసి మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ 718రేటింగ్ పాయింట్లతో 2వ స్థానంలో నిలువగా.. రేణుకా సింగ్ టాప్-10లో చోటు దక్కించుకుంది. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా స్పిన్నర్ నోకులు లెకో ఆస్ట్రేలియా పర్యటనలో నిరాశపరచడంతో దీప్తి ర్యాంక్ మెరుగైంది. ఈ క్రమంలో పాకిస్తాన్‌కు చెందిన సైదా ఇక్బాల్‌తో కలిసి సంయుక్తంగా దీప్తి 2వ స్థానంలో నిలిచింది. టాప్‌లో ఇంగ్లండ్ పేసర్ ఎక్లేస్టోన్(777పాయింట్లు) అగ్రస్థానంలో ఉంది. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలోనూ దీప్తి 4వ స్థానంలో నిలిచింది. బ్యాటర్ల జాబితాలో స్మృతి మంధాన 713రేటింగ్ పాయింట్లతో 4వ స్థానాన్ని నిలబెట్టుకోగా.. రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, హర్మన్ ప్రీత్ కౌర్ 13, 16, 17వ ర్యాంకుల్లో ఉన్నారు. ఇక ఆస్ట్రేలియాకు చెందిన బెత్ మూనీ(766పాయింట్లు), మెక్‌గ్రాత్(762పాయింట్లు) టి20 బ్యాటర్స్ జాబితాలో టాప్‌లో ఉన్నారు. బెత్ మూనీ 2024లో దక్షిణాఫ్రికాతో జరిగిన టి20 సిరీస్‌లో రెండు అర్థసెంచరీలతో రాణించడంతో టాప్ ర్యాంక్‌కు ఎగబాకింది.

రెండోరౌండ్‌కు త్రీసా-గాయత్రి

థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్‌లోకి రెండోరౌండ్‌లోకి యువజంట త్రీసా జోలీ-గాయత్రి ప్రవేశించారు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో త్రీసా-గాయత్రి జంట 16-21, 21-10, 21-18తో హాంకాంగ్‌కు చెందిన లోక్ లూ-వింగ్ వాంగ్‌లపై చెమటోడ్చి నెగ్గారు. ఈ మ్యాచ్ సుమారు గంటా 14నిమిషాలసేపు హోరాహోరీగా సాగింది. రెండోరౌండ్‌లో భారత యువ షట్లర్లు సీనియర్ ప్లేయర్లు అశ్విని పొన్నప్ప- తానీషా క్రాస్టోతో తలపడనున్నారు. తొలిరౌండ్‌లో తానీషా-అశ్విని జంట 21-13, 21-17తో చైనీస్ తైపీ జంటను చిత్తుచేశారు. ఇక పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ ప్రధాన టోర్నీకి అర్హత సాధించారు. మంగళవారం జరిగిన అర్హతరౌండ్ తొలి రెండో పోటీలో వీరిద్దరూ విజయం సాధించారు. అర్హతరౌండ్ పోటీల్లో భాగంగా మంగళవారం జరిగిన తొలి సింగిల్స్‌లో సమీర్ 21-9, 21-18తో హోవార్డ్ షూ(అమెరికా)పై, రెండోరౌండ్‌లో కువాన్-లిన్-క్యూను 16-21, 21-16, 21-15తో చిత్తుచేశాడు. ఇక సుబ్రమణియన్ తొలిరౌండ్‌లో 9-21, 21-17, 21-12తో సుగియార్టో(ఇండోనేషియా)ను, రెండోరౌండ్‌లో కొరక్రిత్(థాయ్‌లాండ్)ను 20-22, 21-10, 21-14తో ఓడించారు. బుధవారం జరిగే ప్రధాన టోర్నీ తొలిరౌండ్‌లో సమీర్ వర్మ.. లాంగ్ అంగస్(హాంకాంగ్)తో, సుబ్రమణియన్ మలేషియాకు చెందిన జున్-హో-లింగ్‌తో తలపడనున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68